Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శుక్రవారం, జూన్ 05, 2026 | సంపుటి - 20 | సంచిక 257 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## కేరళను తాకిన నైరుతి
# రుతుపవనాలు

### మరో వారం రోజుల్లో తెలంగాణకు రాక



తిరువనంతపురం : ఇంతకాలం మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా చల్లని కబురు వచ్చేసింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. కేరళ తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇక అక్కడ ఇనుంచి తమిళనాడు, కర్నాటక, ఆంధ్రాలకు విస్తరిస్తాయి.

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం
# భూముల ధరలు
## నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు
### రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం

- సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ : మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. తరువాయి 2లో




## పవన్ కళ్యాణ్ తెలంగాణకు
# వ్యతిరేకంగా మాట్లాడారా?

- మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి
- ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు
- బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు

హైదరాబాద్ : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తరువాయి 2లో

# అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

- కేఎస్స్టార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు
- రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు
- అమీర్‌పేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్ధీకరణ



## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

- వర్షాభావంపై సన్నద్ధం చేయండి
- వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్ : వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను తరువాయి 2లో



## సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

- మానవ అక్రమ రవాణాను నిరోధించేలా చర్యలు
- సుప్రీంకోర్టు పలు కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ : పిల్లల అక్రమ రవాణా నిరోధానికి సంబంధించిన కేసులో విచారణ చేపడుతున్న సుప్రీంకోర్టు.. సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి సారించింది. ఈ కేసులో అమికస్ క్యూరీగా వ్యవహరిస్తున్న సీనియర్ అడ్వకేట్ అపర్ణా భట్ చేసిన సూచనలను పరిశీలించింది. 2లో

## తెలంగాణ ఉద్యమకారులకు
# న్యాయం చేస్తాం

- ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం
- అఖిలపక్ష భేటీలో కమిటీ ఛైర్మన్ కేశవరావు




హైదరాబాద్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. తరువాయి 2లో



## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా
# లక్ష ఎకరాలకు సాగునీరు

- ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన
- త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

నారాయణపేట : మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద 2లో



## రెండేళ్ల కూటమి విజయాలపై
# ప్రజలకు వివరణ

- మంత్రులంతా ప్రజల్లోకి వెళ్లి చెప్పాలి
- కేబినేట్ భేటీలో సిఎం చంద్రబాబు సూచన

అమరావతి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా అందరూ ప్రజల్లోకి వెళ్లాలని మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. గురువారం సీఎం అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ శాఖలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. గత ప్రభుత్వం నిర్వాకాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని.. అప్పటి నుంచి ఈ రెండేళ్లలో ఏం చేశామో శాఖల వారీగా ఈనెల 28లోపు ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సీఎం చెప్పారు. దేశీయ, స్థానిక అవసరాల మేరకు పంటలు వేసే విధంగా రైతులను ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేయలేదంటూ ఉన్నతాధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాయి 2లో



## రెండోరోజూ అమరావతిలో నారాయణ పర్యటన

- వాగుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- వర్షాకాలం నీటి జాగ్రత్తలపై మంత్రి సూచనలు

అమరావతి : వర్షాకాలం దృష్ట్యా రాజధాని అమరావతిలో వాగుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. వాగుల అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించింది. పురపాలక శాఖ మంత్రి పి నారాయణ రెండోరోజు గురువారం రాజధాని అమరావతిలో పర్యటించారు. తరువాయి 2లో

# అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం




- వివిధ రాష్ట్రాల్లో ఉన్నట్లుగానే అమలు
- బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం
- భీమిలీ తదితర బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం
- కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు
- ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంపు
- ఎపి కేబినేట్ వివరాలు వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఏపీ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్నయాలు తీసుకున్న ఈ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. ఆ నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వివరించారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్టం అమలుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. తరువాయి 2లో

# కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు

మరో వారంలోపే ఈ రుతుపవనాలు తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఈసారి నైరుతి రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వాస్తవానికి మే 26వ తేదీననే నైరుతి రుతపవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ముందుగా అంచనా వేసింది. కానీ, ఎల్‌నినో ప్రభావంతో ఆ అంచనాలు తలకిందుల య్యాయి. కాగా రుతుపవనాల ప్రభావంతో ఇప్పటికే కేరళలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో అటు తమిళనాడులోని 15 జిల్లాల్లోనూ రానున్న కొన్ని గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరిక జారీచేసింది. ఇదిలావుంటే.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది నైరుతి రుతుపవన కాలంలో (జూన్-సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువ వర్షపాతమే నమోదవుతుందని వాతావరణ విభాగం అంచనా వేసింది. దీర్ఘకాల సగటుతో పోలిస్తే 90శాతం వర్షమే ఈ సీజన్‌లో కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్‌నినో పరిస్థితులు ఆవిర్భవిస్తున్నాయని, జూన్‌లో ఇవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో మాత్రం బలంగా ఉండే అవకాశం ఉందని తెలిపింది.

# ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ఎ÷-లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

# రెండేళ్ల కూటమి విజయాలపై ప్రజలకు వివరణ

రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సీఎం చెప్పారు. దేశీయ, స్థానిక అవసరాల మేరకు పంటలు వేసే విధంగా రైతులను ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేయలేదంటూ ఉన్నతాధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్నా ఎందుకిలా ఉన్నారని అధికారులపై సీరియస్ అయ్యారు. అగ్రిగోల్డ్ కేసులను వెంటనే పరిష్కరించేందుకు మొత్తం 31 కొత్త పోస్టులు మంజూరు చేసిన సీఎం.. వెంటనే కేబినెట్ సబ్ కమిటీని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ఏపీలో16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్ రాద్ధాంతం చేస్తున్నారని.. ప్రజలను అయోమయానికి గురిచేయాలని చూశారని మండిపడ్డారు. 'మనం గట్టిగా తిప్పికొట్టడంతో ఇప్పుడు తోక ముడిచారు. మనం చెప్పేది వివరంగా ప్రజలకు తెలియజేయాలి. అప్పుడు మాత్రమే ప్రజలకు తెలుస్తుంది' అని వివరించారు. ఇటీవల రాజధానిలో కొంతమంది రైతులను జగన్ కలిశారని సీఎం చెప్పగా.. జగన్ దగ్గరకు వెళ్లిన అశోక్ అనే రైతు నిన్న నేలపాడులో తన భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. రైతులను జగన్ గందరగోళంలోకి నెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని.. కానీ రాజధాని రైతులు ఇప్పుడు కూడా జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నారని సీఎం అన్నారు. జగన్ చెప్పిన మాటలను నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ప్రజలకు నిజాలు వివరిస్తే వాళ్లు పూర్తిగా అర్థం చేసుకుంటారన్నారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నంలో యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దు

## ఆంధ్రా నాయకులకు గుత్తా కౌంటర్

హైదరాబాద్,జూన్4 : తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దని తెలంగాణ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ నాయకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభను నిర్వహిస్తామనడం సరైనది కాదని మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ వాడిన భాష తీరు సరిగా లేదని వెల్లడించారు. అమరావతి బ్రహ్మాండమైన రాజధాని అంటున్న సీఎం ,డిప్యూటీ సీఎం , మంత్రులు అమరావతిలోనే నివాసం ఉండాలని సూచించారు. తెలంగాణ కన్నా ఏపీలో ఎక్కువ సోర్స్ ఉన్నాయి. సముద్ర తీరం ఉంది. రకరకాల పోర్టులు ఉన్నాయి. ఆ నాయకులంతా ఏపీ అభివృద్ధి చూసుకోవాలి తప్ప తెలంగాణా వైపు చూడొద్దని హితవు పలికారు. తెలంగాణలో విద్వేషాలకు ప్రయత్నించవద్దని తెలిపారు. తెలంగాణ లో 75 శాతం ధాన్యం సేకరణ పూర్తి అయిందని, ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. రైతులు వరి , పత్తి తప్ప ఏ పంటలు పండించడం లేదని వివరించారు.

# విధ్వంస పాలన విముక్తికి రెండేళ్లు

## మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి,జూన్4 : విధ్వంస పాలన నుంచి ఏపీ ప్రజలకు విముక్తి లభించి రెండేళ్లు పూర్తి అయ్యిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఐదేళ్ల రాక్షస పాలనతో రాష్ట్ర ప్రజలను జగన్ వెన్నుపోటు పొడిచారని వ్యాఖ్యానించారు. 2024లో చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన ఏపీ ప్రజలు.. 2029లోనూ అదే తీర్పు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో మళ్లీ ప్రజాస్వామ్య వెలుగులు కనిపిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వ విధ్వంసాన్ని సరిదిద్దుతూ సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని మంత్రి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం శరవేగంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. రాష్ట్రానికి పూర్వవైభవం తీసుకురావడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. వచ్చాక ఏసీబీ ట్రాప్ ఆయిన ÷ల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్ల రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు. ÷-రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రొక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

# పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. మున్ముందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ పక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

# అవయవ మార్పిడి చట్టానికి ఆమోదం

2011 కేంద్ర చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు చెప్పారు. అవయవ మార్పిడి పక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉన్న విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు చేయనున్నారు. గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే బీచ్ షాక్స్‌లు తెరిచి ఉంచడానికి అనుమతి ఇవ్వనున్నారు. పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే తదుపరి విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపును ఆమోదించింది. రాష్ట్రంలో రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ-2025 ముసాయిదాకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ పాలసీ-2026కు కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసుల పరిష్కారం కోసం 21 పోస్టుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. చిత్తూరు జిల్లాలో వ్యవసాయ శాఖ భూమిపై సోలార్ విద్యుత్ ఎ÷-లాంట్ ఏర్పాటుకు 30 ఏళ్ల లీజు ఇవ్వడానికి అనుమతి ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కృష్ణా నది తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు టెండర్లకు కేబినెట్ అనుమతి ఇచ్చింది. రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ప్రభుత్వ రంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీపీఎస్ అమల్లోకి రాకముందు ఇచ్చిన నోటిఫికేషన్లలో ఎంపికై.. వివిధ కారణాలతో సీపీఎస్ అమలు తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారికి పాత పింఛను వ్యవస్థ అమలు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం లభించింది. నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలో సవరణలకు కేబినెట్ ఆమోదించింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్ ను జులై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.

# నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు

## ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని

హైదరాబాద్,జూన్4 : అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులో కి తేవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, సుమిత్ సింగ్, కట్టా బలరాం, సాయి, ప్రదీప్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# రైతులు ఇబ్బందులను పట్టించుకోని సిఎం

## పర్యటనలతో ఒరిగేదేమీ లేదు: నిరంజన్ రెడ్డి

వనపర్తి,జూన్4 : రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డ సమయంలో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల సందర్శన పేరుతో హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. సీఎం గురువారం పాలమూరు పర్యటన సందర్భంగా పలు ప్రశ్నలు సంధించారు. విపత్తుల సమయంలో రాకుండా , రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న ఈ పర్యటనలు ఎవరికి ఉపయోగమని నిలదీశారు. సీఎం పర్యటనే వేళ తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సబబు కాదని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ వడ్లు కల్లాల్లోనే ఉన్నాయని,రైతు భరోసా అడుగుతారనే హెలికాప్టర్‌లో పర్యటిస్తున్నారని విమర్శించారు.

# కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ÷ూష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

# సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల నియంత్రణపై దృష్టి

మానవ అక్రమ రవాణాను నిరోధించేలా సరోగసీ, ఐవీఎఫ్ కేంద్రాల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు (ఎస్ఓపీ) లేవని ఆమె ఈ సందర్భంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సరోగసీ, ఐవీఎఫ్ క్లినిక్స్ నియంత్రణ కోసం తీసుకొచ్చిన ఏఆర్టీ చట్టంలో అనేక నిబంధనలు ఉన్నప్పటికీ, చిన్నారుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక ప్రోటోకాల్ లేదని అపర్ణా భట్ పేర్కొన్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలు ప్రధానంగా వైద్య ప్రమాణాలు, మౌలిక వసతులకే పరిమితమయ్యాయని వివరించారు. ఈ నేపథ్యంలో నిబంధనలను మరింత కట్టుదిట్టం చేసేందుకు రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ సూచనలతో సమగ్ర విధానాన్ని రూపొందించాలని ప్రతిపాదించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తన అభిప్రాయాన్ని తెలియజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 19కి వాయిదా వేసింది.

# రెండోరోజూ అమరావతిలో నారాయణ పర్యటన

కొండవీటి వాగు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎన్-9,8,7రోడ్లలో కొండవీటి వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జిల పనుల పురోగతిపై ఆరా తీశారు.బ్రిడ్జిల కింద కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం లేకుండా మట్టి తొలగించాలని అధికారులను ఆదేశించారు. కొండవీటి వాగు వెడల్పు తక్కువగా ఉన్నచోట మరింత వెడల్పు చేయాలని సూచించారు. నీరుకొండలో నిర్మిస్తున్న రిజర్వాయర్ పనులను కూడా మంత్రి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాజధానిలో ట్రంక్ రోడ్లు, బ్రిడ్జిలు, వాగుల అభివృద్ధి పనులు వేగంగా జరుగు తున్నాయని మంత్రి చెప్పారు. ట్రంక్ రోడ్లపై 43,ఎల్ పి ఎస్ (ల్యాండ్ పూలింగ్)జోన్లలో 32 బ్రిడ్జిలను నిర్మిస్తున్నామని మంత్రి చెప్పారు. వర్షాకాలంలో కొండవీటివాగు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా మట్టి తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. శాఖమూరు, పెనుమాక, నీరుకొండ రిజర్వాయర్లలో సగం పని పూర్తయిందని చెప్పారు. కొండవీటివాగు 23.7 కిలోమీటర్లు, పాలవాగు 16.7 కిలోమీటర్లు, గ్రేవిటీ కాలువ 7.84 కిలోమీటర్లు అభివృద్ధి చేస్తున్నామని మంత్రి చెప్పారు. నీరుకొండ రిజర్వాయర్ 440 ఎకరాలలో నిర్మాణం జరుగుతోందని అన్నారు. వైసిపి నాయకులు రైతుల ను రెచ్చగొడుతున్నారని, విభేదాలు సృష్టించి రాజధానిని విధ్వంసం చేయాలని చూస్తోందని మండిపడ్డారు. అమరావతిపై వైసిపి కమిటీలు వేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రైతుల భూములను వెనక్కి ఇచ్చేస్తామని వైసిపి నాయకులు చెబుతున్నారని, భవనాలు, రోడ్లు, పైపు లైన్లు ల నిర్మాణం పూర్తయ్యాక సిఎంగా పనిచేసిన వ్యక్తి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మంత్రి అన్నారు. రాజధాని పర్యటనలో మంత్రి వెంట అమరావతి అభివృద్ధి సంస్థ (ఎడిసి) ఛైర్ పర్సన్ డి లక్ష్మీ పార్థసారధి, సి ఆర్ డి ఎ,ఎడిసి చీఫ్ ఇంజినీర్లు ఇతర అధికారులు ఉన్నారు.

# వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు

## ప్రజలకు అదనపు కలెక్టర్ సూచన

జగిత్యాల,జూన్4 : వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాయకపు గూడెం, బీర్పూర్ మండలంలోని బీర్పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కందేనకుంట గ్రామాల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు గురువారం నిర్వహించారు. బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గ్రామాల్లో వర్షాకాలంలో పారిశుద్య నిర్వహణపై ఆ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు, పారిశుద్య నిర్వహణ, ఎలినినో ప్రభావ పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడీ చేసుకోవడం, మ చర్యలు, గ్రామాల్లో ఇంకుడు గంతల నిర్మాణాల ఏర్పాటు, నీటిని పొదుపుగా వాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో బీర్పూర్ మండల ప్రత్యేక అధికారి ప్రకాష్, తహసీల్దార్లు వహిదొద్దిన్, సుజాత, ఎంపీడీఓలు ఎండి సలీం, భీమేష్ ప్రజాప్రతినిధులు చేకూట ఆరుణ శేఖర్, మర్రిపెల్లి అశ్విని, పుష్పనాథ్, మల్యాల జ్యోతి, ఎలమట్ల హరీష్, ఎడ్ల సృజన సుశీన్, హర్షకోట రాజగోపాల్ రావు, కొమిరే నర్సయ్య, ఆయా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# టూ వీలర్ స్కిడ్.. దూసుకెళ్లిన బస్సు

### ఇంజనీరింగ్ విద్యార్థి దుర్మరణం

హైదరాబాద్,జూన్4 : నగరంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఇదే ఓ విద్యార్థి ప్రాణాలు పోవడానికి కారణమైంది. సికింద్రాబాద్ పరిధిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. నగరంలో కురిసిన వర్షానికి రోడ్డుపై బురద చేరింది. ఈ క్రమంలో బైకుపై వస్తున్న ఓ యువకుడు స్కిడ్ అయి.. అదే సమయంలో పక్కనే వెళ్తున్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకుపోయాడు. బస్సు అతడి పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న మార్కెట్ స్టేషన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడు గురునానక్ కాలేజీలో బీటెక్ చదువుతున్న మదన్ మోహన్‌గా గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. మదన్ మోహన్ అకాల మరణంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

# పవన్ కళ్యాణ్‌పై మరోమారు ప్రకశార్ రాజ్ సెటైర్లు

### ఘాటుగా తిప్పికొట్టిన నిర్మాత బండ్ల గణెళిశ్

హైదరాబాద్,జూన్4 : ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ అంశంలో నటుడు ప్రకాశ్ రాజ్, నిర్మాత బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్‌లో వార్ నడుస్తోంది. తెలంగాణలో జనసేన పోటీ చేస్తుందంటూ పవన్ చేసిన వ్యాఖ్యలపై ప్రకాశ్ రాజ్ సెటైర్ వేస్తే.. ప్రకాశ్ రాజ్‌కు బండ్ల గణెళిశ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో జనసేన పోటీపై ఎక్స్‌లో పోస్ట్ చేసిన ప్రకాశ్ రాజ్.. పవన్‌ను ఉద్దేశించి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'మీరొస్తామంటే మేమొద్దంటామా.. రండి దొర. సింగిల్‌గా వస్తున్నారా.. పొత్తుతో వస్తున్నారా చెప్పి రండి' అని ప్రకాశ్ రాజ్ పోస్ట్ చేశారు. ప్రకాశ్‌రాజ్ పోస్ట్‌కు బండ్ల గణెళిశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రతి దాంట్లో ఎందుకు వేలు పెడతావంటూ ప్రశ్నించారు. 'అసలు నువ్వెవరు.. తమిళోడివా? తెలుగోడివా? కన్నడిగుడివా? ప్రతి విషయంలో జడ్జిమెంట్ ఇవ్వడానికి నువ్వేమైనా ప్రధానివా. అందరి విషయాల్లో దూరి హీరోలా ఫీలవ్వకు. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకో. తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయ్' అంటూ ప్రకాశ్ రాజ్‌ను ఉద్దేశించి బండ్ల గణెళిశ్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రకాశ్ రాజ్, బండ్ల గణెళిశ్ మధ్య సోషల్ మీడియా ఎక్స్ వేదికగా జరుగుతున్న వార్.. చర్చనీయాంశంగా మారింది.

# 5, 6, 7 తేదీల్లో హైటెక్స్‌లో చేనేత వస్త్ర ప్రదర్శన

హైదరాబాద్,జూన్4 : అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి పొందిన పోచంపల్లి 'ఇక్కత్' వస్త్ర ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు ఈనెల 5,6,7 తేదీల్లో ప్రత్యేక వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. పోచంపల్లి చేనేత కళాకారుల జీవన ప్రమాణాల మెరుగుపరిచే లక్ష్యంతో జూన్ 5, 6, 7 తేదీల్లో హైదరాబాద్ హైటెక్స్ లో 'త్రెడ్ పోచంపల్లి' పేరిట వస్త్ర ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచేందుకు ఏర్పాటు చేసే ఈ ఎగ్జిబిషన్ లో దాదాపు 100 పైగా స్టాల్స్, మహిళా శక్తి స్వయం సహాయక సంఘాల ద్వారా కూడా స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

# జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలు

### నియమించిన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్

అమరావతి,జూన్4 : జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలను ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నియమించారు. జనసైనికుల నుంచే భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని అధినేత చెప్పుకొచ్చారు. 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా కసరత్తు చేస్తున్నామని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. కేడర్ ఆధారిత నాయకత్వ వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. క్షేత్రస్థాయి సమాచారాన్ని పరిశీలించి పార్టీ బాధ్యతల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# మమత పార్టీకి మరో షాక్

### బిధాన్నగర్ మేయర్ కృష్ణాచక్రవర్తి రాజీనామా

కోల్‌కతా,జూన్4 : పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. బిధాన్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కృష్ణా చక్రవర్తి.. గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారామె. రాజీనామా అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. 16 ఏళ్లుగా నేనీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను. ఎవరి పట్లా నాకే అసంతృప్తి లేదు. నిబంధనల ప్రకారమే రాజీనామా చేశా. నాకు నేను కొంత సమయం కేటాయించాలి అనుకుంటున్నాను. కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజలకు సేవ చేయదలచుకున్నాను' అని చెప్పారు. టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా ఉన్న కృష్ణా చక్రవర్తి తన రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. స్థానిక కార్పొరేషన్ అధికారులూ ఆమె రాజీనామా లేఖ అందిన విషయాన్ని ధ్రువీకరించారు. అలాగే రాష్ట్ర పురపాలక వ్యవహారాల శాఖ మంత్రి, అదనపు ప్రధాన కార్యదర్శికి కూడా లేఖ ప్రతులను పంపినట్లు అధికారులు తెలిపారు. ఆమె రాజీనామా ఆమోద ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు.

# కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్

### కార్మికుల సమస్యలపై సిఎంకు పట్టింపు లేదు

### జలమండలి గేట్ మీటింగ్‌లో తలసాని శ్రీనివాసయాదవ్



హైదరాబాద్,జూన్4 : ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడేది గులాబీ జెండా మాత్రమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై ప్రసంగించారు. వాటర్ బోర్డులో 50 సంవత్సరాల లో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాటర్ వర్క్స్ బోర్డు లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న రాంబాబు యాదవ్‌ను 6 వ తేదీన జరిగే గుర్తింపు ఎన్నికలలో గెలిపించుకోవాలని తలసాని పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నముఖ్యమంత్రి రెండున్నర సంవత్సరాలలో ఒక్కసారైనా సమీక్ష చేశారా? అని తలసాని ప్రశ్నించారు. మీ సమస్యలపై ముఖ్యమంత్రికే పట్టింపు లేనప్పుడు ఆ పార్టీకి సంబంధించిన వ్యక్తిని గెలిపిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన చేతకాక ప్రశ్నించే వారిపై ఎదురుదాడి చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తలసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం అవగాహన, ప్రణాళిక లేకుండా మూడు కార్పొరేషన్లుగా విభజించి ఉద్యోగులు, ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని తలసాని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏ రోజు కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా త్రాగునీటిని సరఫరా చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం త్రాగునీటిని కూడా సక్రమంగా ఇవ్వలేకపోతుందని మండిపడ్డారు. మీకు అండగా ఉండేది బీఆర్ఎస్ పార్టీ అని, మీ హక్కుల కోసం అసెంబ్లీ లోపల, బయట ప్రభుత్వాన్ని నిలదీస్తామని ప్రకటించారు. మీ కోసం గొంతుక వినిపించే గులాబీ జెండాకు మద్దతు తెలపాలని తలసాని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో బోర్డులోని అనేక సమస్యలను నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. అటు సూర్యుడు ఇటు పొడిచినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తలసాని హామీ ఇచ్చారు.

# ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో అరుదైన దృశ్యం

### ప్రమాదం నుంచి బయటపడేందుకు కిందకు దూకిన బాధితులు

### కింద పరుపులు పరచి కాపాడిన తండ్రీ కొడుకులు

### సోషల్ మీడియాలో వారిపై సరవ్తరా ప్రశంసలు

న్యూఢిల్లీ,జూన్4 : దేశరాజధాని ఢిల్లీలోని ఒక లాడ్జ్‌లో బుధవారం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది మృత్యువాతపడ్డారు. అయితే, స్థానికంగా షాపు నిర్వహిస్తున్న తండ్రీకొడుకులు భవనంలో చిక్కుకున్న అనేక మంది ప్రాణాలను కాపాడారు. ప్రస్తుతం వారిపై ప్రశంసల వర్షం కురుస్తోంది. బుధవారం ఉదయం భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అనేక మంది చిక్కుకుపోయారు. వారు కిందకు వచ్చేందుకు ఏ అవకాశమూ లేకపోయింది. దీంతో కొందరు భవనం నుంచి కిందకు దూకేందుకు సిద్ధమయ్యారు. కిందకు దూకితే ఏం కాదుగా అంటూ అక్కడున్న వారిని ఆందోళనతో ప్రశ్నించారు. ఈ క్రమంలో రియాజుద్దీన్, ఆయన కుమారుడు అర్మాన్ రంగంలోకి దిగారు. క్షణకాలం కూడా ఆలస్యం చేయకుండా భవనానికి సమీపంలో నేలపై కొత్త పరుపులను పరిచారు. దీంతో, బాధితులు వాటిపైకి సురక్షితంగా దూకి తమ ప్రాణాలను కాపాడుకున్నారు. 'ఉదయం నేను షాపు వద్దకు వచ్చేసరికే అక్కడ పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో కూడా మంటలు వ్యాపించాయి. లోపలికి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు అసలు ఏ దారీ లేకుండా పోయింది. మమ్మల్ని కిందకు దూకేయమంటారా అంటూ పై అంతస్తుల్లోని వారు భయంతో ప్రశ్నించారు. దీంతో, వెంటనే నేను మా షాపులోంచి 20 నుంచి 25 వరకూ పరుపులు, క్విల్ట్‌ను తీసుకొచ్చి భవనం బయట పరిచాను' అని అర్మాన్ అన్నారు. 'ఈ క్రమంలో మాకు రూ.2 లక్షల వరకూ నష్టం వచ్చింది. బాధితులకు దుప్పట్లు కూడా ఇచ్చాము. మృతులను బయటకు తెచ్చేందుకు కూడా దుప్పట్లను ఇచ్చాము. మా వద్ద ఉన్నవన్నీ ఇచ్చేశాము. మానవత్వపు కోణంలో చూస్తే ఎవరైనా ఒకటే. హిందువైనా, ముస్లింలైనా మనందరం భారతీయులమే. కాబట్టి, కష్టాల్లో ఉన్న సోదరులకు స్నేహం చేయడం మా బాధ్యత' అని అర్మాన్ తండ్రి రియాజుద్దీన్ అన్నారు. దీంతో, ఈ తండ్రీకొడుకులపై ప్రస్తుతం సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది.

# ట్రెక్కింగ్‌కు వెళ్లిన యువతి అదృశ్యం

### స్నేహితులను అరెస్ట్ చేసి విచారణ

డెహ్రాడూన్,జూన్4 : స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయింది. 6 రోజులు గడుస్తున్నా ఆమె ఆచూకీ దొరకలేదు. పోలీసులు ఆమె స్నేహితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఉత్తరాఖండ్‌లోని నైనితాల్‌కు చెందిన బబితా పాండే అనే యువతి ఎంబీఏ చేస్తోంది. వారం రోజుల క్రితం ఆమె తన స్నేహితులు హర్మన్‌పాల్ సింగ్, హర్మన్ ప్రీత్ సింగ్‌లతో కలిసి టూర్‌కు వెళ్లింది. మే 25వ తేదీన వారు హర్సిల్, గంగోత్రితో పాటు చుట్టుపక్కల ఉన్న పర్యాటక ప్రదేశాల్లో తిరిగారు. ముగ్గురూ మే 28వ తేదీన రైతాల్ గ్రామానికి వెళ్లారు. ఆ రోజు అక్కడే ఉన్నారు. మరుసటి రోజు రైతాల్ నుంచి దయారా బుగ్యాల్‌కు ట్రెక్కింగ్ మొదలెట్టారు. ఆ రాత్రి గోయ్ బేస్ క్యాంప్‌లో బస చేశారు. అర్ధరాత్రి నుంచి బబిత కనిపించకుండాపోయింది. బబిత స్నేహితులు ఆమె కోసం వెతికారు. ఆమె ఎక్కడా కనిపించకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆర్మీ, ఇండో – టిబెటన్ బోర్డర్ పోలీస్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, పోలీస్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు చెందిన 150 మంది ఆమె కోసం వెతుకుతున్నారు.

# ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో మరో విషాదం

### ఒకే కుటుంబానికి చెందిన 8మంది దుర్మరణం

న్యూఢిల్లీ,జూన్4 : దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో గల ఫ్లోరిష్ స్టే రెస్టారెంట్‌లో బుధవారం ఉదయం జరిగిన ఘోర అగ్ని ప్రమాదం ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 8 మంది మృతిచెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 46కు చెందిన వివేక్ అగర్వాల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్.. మ్యాక్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన తండ్రిని పరామర్శించేందుకు ఢిల్లీ వెళ్లారు. ఆయనతో పాటు తల్లి ప్రేమ్ లత, భార్య తర్జనీ అగర్వాల్, ఇద్దరు కుమార్తెలు జివిషా, వారియా, మరో ముగ్గురు బంధువులూ ఉన్నారు. వీరంతా బస చేసేందుకు.. ప్రమాదానికి గురైన ఫ్లోరిష్ స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్‌లో 2 గదులను బుక్ చేసుకున్నారు. వీరు అల్పాహారం తీసుకుంటుండగా ఒక్కసారిగా ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో మొత్తం 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ కుటుంబంలో ప్రాణాలతో మిగిలిన ఏకైక వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వివేక్ అగర్వాల్ తండ్రి రాధేశ్యామ్ అగర్వాల్(80) మాత్రమే. ఒకే కుటుంబంలోని 8 మంది మరణించడంతో గురుగ్రామ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా.. డీఎన్ఏ టెస్టుల అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8:30 గంటలకు ఆ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇరుకైన భవనం కావడంతో వేగంగా మంటలు వ్యాపించాయి. ఎంట్రీ, ఎగ్జిట్ ఒకేచోట ఉండటంతో అందులో ఉన్నవారు తప్పించుకునేందుకు వీలులేకుండా పోయింది. ప్రమాద సమయంలో అందులో సుమారు 40 మంది ఉన్నట్టు సమాచారం. వారిలో 21 మంది చనిపోగా.. కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు కిటికీలు, భవనం పైనుంచి దూకి తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో విదేశీయులే ఎక్కువ మంది ఉన్నట్టు తెలుస్తోంది. వీరంతా సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుంచి చికిత్స కోసం అక్కడికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కాగా.. ఢిల్లీ ప్రభుత్వం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద ఆ హోటల్‌కు లైసెన్స్ మంజూరు చేసింది. దీని ప్రకారం.. ఆ ప్రాపర్టీలో 6 గదులకే అనుమతి ఉండగా.. బేస్‌మెంట్‌లోని కొన్ని గదులతోపాటు మొత్తం 25 గదులతో ఆ రెస్టారెంట్‌ను నిర్వహిస్తున్నట్టు తెలుస్తోంది.

# ఇండియా కూటమికి బీటలు

### 8వతేదీ ఇండీ కూటమిని బహిష్కరించిన డిఎంకె

### హాజరు కాబోవడం లేదని ప్రకటన విడుదల

న్యూఢిల్లీ,జూన్4 : అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది. జూన్ 8వ తేదీన ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్ వేదికగా ఇండియా కూటమి అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కూటమి సమావేశానికి హాజరు కావాలని ఆ పార్టీ భాగస్వామ్య కూటమిల నుంచి డీఎంకేకు ఆహ్వానం అందింది. అయినప్పటికీ.. హాజరు కాకూడదని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ పార్టీ ప్రవర్తించిన తీరుపై డీఎంకే శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహం వచ్చింది. తమ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీ చేసిన ద్రోహాన్ని క్షమించేది లేదంటూ డీఎంకే ఒక ప్రకటన విడుదల చేసిన విషయం విదితమే. ఇండియా కూటమి ఏర్పడినప్పటి నుంచి డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా డీఎంకే గుర్తు చేసింది. నీట్, ఒకే దేశం–ఒకే సారి ఎన్నికలు, వక్ఫ్ చట్టాలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో తమ పోరాటం కొనసాగుతుందని డీఎంకే వెల్లడించింది. కూటమితో భేటీకి దూరంగా ఉన్నప్పటికీ, ప్రజా వ్యతిరేక విధానాలపై ఇతర పార్టీల పోరాటాలకు మద్దతు ఇస్తామని డీఎంకే ప్రకటించింది. దీంతో డీఎంకే – కాంగ్రెస్ బంధంలో వివాదం ముదిరినట్లు అయింది. అంతేకాకుండా జాతీయ స్థాయిలో ప్రతిపక్ష కూటమికి డీఎంకే భారీ షాక్ ఇచ్చినట్లు అయింది.

# అభిజిత్ దిప్కేలను అడ్డుకుంటే అల్లర్లు

### సోషల్ మీడియాలో అమిత్ కుమార్ వీడియో వైరల్

న్యూఢిల్లీ,జూన్4 : ఈ నెల 6న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు కాక్రోచ్ జనతా పార్టీకి చెందిన ఓ వీడియో తీవ్ర దుమారం రేపుతోంది. సీజేపీకి మద్దతుదారుడిగా ఉన్న ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలు.. సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చర్చనీయాంశమైంది. ఈ వైరల్ వీడియోలో అమిత్ కుమార్ సింథ్ అనే వ్యక్తి నిరసనలో పాల్గొనే వారినుద్దేశించి మాట్లాడుతూ.. 'ఉద్యమ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేను విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు అడ్డుకుంటే అక్కడే అల్లర్లు చెలరేగుతాయి' అని చెప్పినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా.. నిరసనకారులు తమ రక్షణ కోసం పెప్పర్ స్ప్రేలు, కర్రలు వంటి వాటిని వెంట తెచ్చుకోవాలని సూచించినట్లూ ఆ వీడియోలో ఉంది. పోలీసులు నిరసనను అడ్డుకునే అవకాశముందని, ఎలాంటి పరిస్థితులెదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఆ వీడియోలోని అత్యంత వివాదాస్పద భాగంలో.. 'ఇప్పటివరకు చాలా భరించాం. ఈసారి హద్దులు దాటుతాం. నేపాల్‌ను నిర్మిస్తాం' అని వ్యాఖ్యానించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ వ్యాఖ్యలపై పలువురు నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈనెల 6న భారత్‌కు రానున్నట్లు సమాచారం. అనంతరం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి.. జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టేందుకు అనుమతులు కోరనున్నట్లు తెలుస్తోంది. ఈ వీడియోపై వివాదం చెలరేగినప్పటికీ.. తమ ఉద్యమం పూర్తిగా శాంతియుతంగానే సాగుతుందని అభిజీత్ దీప్కే అన్నారు. రాజ్యాంగంపై తనకు పూర్తి విశ్వాసముందని, ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచే హక్కు ఉందని ఆయన పేర్కొన్నారు. ఏది ఏమైనా.. జూన్ 6కు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో.. నిరసన కార్యక్రమం శాంతియుతంగా, చట్టబద్ధమైన పరిమితుల్లోనే కొనసాగుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది. పరీక్షల ప్రశ్నపత్రాల లీకులు, ఉద్యోగ నియామకాల్లో అవకతవకల అంశాలపై చేపట్టిన ప్రచారాలతో.. సీజేపీకి మద్దతు పెరిగింది. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్‌సీ జీడీ వంటి పరీక్షలకు సంబంధించిన వివాదాల వల్ల దేశవ్యాప్తంగా సుమారు 95 లక్షల మంది యువత ప్రభావితమయ్యారని ఆ సంస్థ పేర్కొంటోంది.

# తృణమూల్‌కు వరుస ఎదురుదెబ్బలు

### అసెంబ్లీ తరహాలో పార్లమెంటులోనూ తిరుగబాటు

### తాజా రాజకీయాలపై జాతీయ మీడియాలో కథనాలు

కోల్‌కతా,జూన్4 : పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అసెంబ్లీ తరలహాలోనే టీఎంసీ ఎంపీలు కూడా తిరుగుబాటు బావుటా ఎగరవేయనున్నారనే వార్తలు ప్రచారం అవుతున్నాయి. టీఎంసీకి చెందిన సుమారు 20 మంది ఎంపీలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఇప్పటికే ఈ ఎంపీలు బీజేపీతో టచ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఉన్నతస్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తృణమూల్‌కు లోక్‌సభలో 28 మంది ఎంపీలు, రాజ్యసభలో 13 మంది ఎంపీలు ఉన్నారు. పార్లమెంటులో ఎంపీల సంఖ్యాపరంగా టీఎంసీ రెండో అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉంది. ఈ నేపథ్యంలో పార్లమెంటు వేదికగా టీఎంసీ చీలిపోతే పార్లమెంటులో ప్రతిపక్షం ప్రభావం గణీయంగా తగ్గుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇటీవల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో కనిపించిన సీన్ రాబోయే కొన్ని రోజుల్లో పార్లమెంటులో కూడా కనిపిస్తుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. టీఎంసీ రెబల్ వర్గం బలం మరింత పెరుగుతుందని అంటున్నారు. ప్రస్తుతం తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ తమ పార్టీ ఎన్నికల గుర్తు, పార్టీ పేరును కాపాడుకునే పనిలో నిమగ్నమైనట్టు మీడియాలో వార్తలు వెలువడ్డాయి. టీఎంసీకి రాష్ట్రంలో 80 ఎమ్మెల్యేలు ఉండగా రుతుప్రత బెనర్జీ నేతృత్వంలో 58 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు బావుటా ఎగరేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీలో తామే అసలైన టీఎంసీ అని రుతుప్రత స్పష్టం చేయడంతో ఆయనకు ప్రతిపక్ష నేత హోదా దక్కింది. పశ్చిమబెంగాల్‌లో ఓటమి తరువాత టీఎంసీలో విభేదాలు పెరిగాయి. రాష్ట్రంలో అవినీతి, ఆర్‌జీ కార్ ఆసుపత్రి హత్యాచారం కేసులో ప్రభుత్వ తీరును సొంత పార్టీ నేతలే విమర్శించారని సమాచారం.

# సంపాదకీయం

## తెలంగాణలో సెంటిమెంట్ రాజకీయం !

తెలంగాణను ముంచిన వారంతా ఇప్పుడు వీరతాళ్లు వేసుకుని..నా తెలంగాణ అంటూ ఊరేగుతున్నారు. విగ్రహాల పేరుతో కొందరు నిగ్రహం కోల్పోయి మాట్లాడుతున్నారు. తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడ్డదని వాపోతున్నారు. ఇప్పుడు తెలంగాణ సెంటిమెంట్ కోసం మళ్లీ రాజకీయ రగడ మొదలయ్యింది. ఎవరికి వారు తామే తెలంగాణ భావి విధాతలమని మాట్లాడుతున్నారు. పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతున్నారు. నిజానికి తెలంగాణ ఏర్పడ్డ తరవాత జరిగిన ద్రోహం, అంతకుముందు ఎప్పుడూ జరగలేదు. ఉమ్మడి ఎపిలో జరగనంత దోపిడీ గత 12 ఏళ్లుగా సాగుతోంది. ఎక్కడిక్కడ భూములు దోచుకున్నారు. అప్పుల చేసి దోచుకున్నారు. తెలంగాణను అప్పుసుల కుప్పచేసి అనుభవిస్తున్నారు. ఎవరికి వారు తామే తెలంగాణను ఉద్ధరించామని చెప్పుకుంటున్నారు. నిరుద్యోగ సమస్య తీరలేదు. నీటి సమస్యలు తీరలేదు. నిధులు పారించలేదు. అంతెందుకు రైతులు పండించిన ధాన్యం మద్దతు ధరలకు కొని సేకరణ సక్రమంగా చేయడంలో కూడా విఫలం అయ్యారు. మక్క, జొన్న, మిర్చి, పత్తి రైతులు ఏటా పడుతున్న కష్టాలను పట్టించుకోని అసమర్థులుగా మిగిలి పోయారు. ఇకపోతే తెలంగాణలో కొత్తగా ఆస్తులు సృష్టించలేదు. అయినా పాలకులుగా పనిచేసిన వారు తామే తెలంగాణను ఉద్ధరించామని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ప్రజలకు పెన్షన్లు, ఇళ్లు, ఆరోగ్యశ్రీలు ఎరగా వేసి దర్జాగా దోచేస్తున్నారు. నిజానికి ఉమ్మడి ఎపి నుంచి తెలంగాణ విడివడ్డాక తెలంగాణ అభివృద్ధి చెందిందా..లేక అప్పుల పాలయ్యిందా అంటే..అప్పుల పాలయ్యిందని లెక్కలు చెబుతున్నాయి. సమయానికి జీతాలు ఇవ్వలేని వారు పాలకులు అయ్యారు. హైదరాబాద్ మీ అయ్య జాగీరా అని జనసేనాని పవన్ కళ్యాణ్ అనగానే కొందరు ఒంటి కాలిపై లేచి..అవును మా అయ్య జాగీరే అంటున్నారు. ఎందుకంటే మూడో వ్యక్తి వస్తే..దోచుకోవడానికి అవకాశం ఉండదు కనుక...ఎగిరెగిరి పడుతున్నారు. తెలంగాణ సమాజాన్ని బెదిరిస్తున్నావంటూ పవన్‌ను చీల్చి చెండాడేంత పని చేశారు. పవన్ మీడియా సమావేశంలో మాట్లాడిన మాటలు నిజంగానే తెలంగాణలోని కొందరికి బాధ కలిగించాయి. అందులో అనుమానం లేదు. రాజకీయంగా తెలంగాణలో ఉన్న కొందరు జనసేనలోనూ ఉన్నారు. వారికి పదవులు రావాలంటే జనసేన పక్షాన పోటీ చేయాల్సిందే. రాజకీయ పార్టీ అన్న తరవాత పోటీకి సై అంటుంది. జనసేన కూడా అదే చేసింది. అయితే మిగతా ప్రాంతాలకు, తెలంగాణకు ఓ రేఖ అడ్డంగా ఉంది. అదే సెంటిమెంట్. తెలంగాణ ప్రజలను ముంచిందే సెంటిమెంట్. ఆ సెంటిమెంట్‌తోనే ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డది. అది అడ్డం పెట్టుకునే కెసిఆర్ కుటుంబం పదేళ్లు దర్జాగా తెలంగాణలో పాగా వేసి, ఇష్టారాజ్యంగా దోచుకున్నది. పదవులు, డబ్బులు, భూములు దోచేసారు. లక్షల కోట్లు తెలంగాణ నెత్తిన అప్పులు పెట్టారు. తరవాత గత రెండేళ్లుగా కాంగ్రెస్ కూడా అదే దారిలో నడుస్తోంది. అభివృద్ధి పేరిట ఊదరగొట్టిన కాంగ్రెస్ నేతలు పప్పు బెల్లాల్లా తెలంగాణను పంచుకుంటున్నారు. భూములు యధేచ్ఛగా అమ్మేస్తున్నారు. ఈ క్రమంలో పవన్ రాకతో మరోమారు సెటిమెంట్ రగిల్చి బాగుపడాలన్న ధోరణిలో పొన్నం ప్రభాకర్, కెటిఆర్, కవితలు తామే అసలుసిసలు తెలంగాణ వారుసులమని చెప్పుకునే ప్రయత్నంలో పడ్డారు. తెలంగాణ సమాజం అస్తిత్వ సంక్షోభంల పడుతున్నదనీ గొంతు చించుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి ఆంధ్రా ఆధిపత్యం కిందకు వెళుతోందని ప్రకటించుకున్నారు. పవన్ కళ్యాణ్ ఎంట్రీ వెనక బిజెపి, మోడీ ఉన్నారని ఆరోపిస్తున్నారు. తెలంగాణ కూడా భారతదేశంలోనే ఉందని, అందుకు బిజెపి ఎక్కడైనా పావులు కదుపుతుందని తెలుసుకోవాలి. బిజెపికి తెలంగాణ కూడా ఒక రాష్ట్రమని తెలుసు. ఇక్కడ పాగా వేయాలని ఎప్పటనుంచో కలలు కంటోంది. కనుక దాని ప్రయత్నాల్లో అది ఉంది. ఇది రాజకీయం. కెసిఆర్ కూడా భారత రాష్ట్ర సమితి అంటూ దేశాన్ని ఏలుతానని అన్ని రాష్ట్రాలు తిరిగారు. దానిని ఎవరైనా తప్పుపట్టారా అన్నది కెటిఆర్ చెప్పాలి. రాజకీయ పార్టీ పెట్టి ఇక్కడ వైఎస్ షర్మిల కూడా పాదయాత్ర చేశారు. తాను తెలంగాణ బిడ్డనని ప్రకటించుకున్నారు. అప్పుడు లేని రోషం ఇప్పుడే ఎందుకు వచ్చిందన్నది ప్రశ్న. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం స్వరాష్ట్రంలో ఆంధ్రా వలసవాదం పెరిగింది. దానికి కెసిఆర్ ఆద్యులు. ఆయనే మాకు ఆంధ్రాతో పేచీ లేదంటూ..జగన్‌ను పిలిచి భోజనం పెట్టి అలయ్ భలయ్ చేసుకున్నారు. కృష్ణా నీటిని ఎపికి దోచి పెట్టారని వస్తున్న ఆరోపణలకు కెసిఆర్ బృందం నుంచి సమాధానం లేదు. తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకుని, హైదరాబాద్ సంపదను కొల్లగొట్టడానికి వస్తున్నారని జనసేనాని పవన్ కళ్యాణ్‌ను విమర్శించే ముందు..ఇక్కడ ఎంత కొల్లగొట్టారో చెప్పాలి. ధరణి పేరుతో మోసాలు. కాళేశ్వరం పేరుతో దగా. టెలిఫోన్ ట్యాపింగ్. అస్మదీయులకు రాజ్యసభ పదవులు.. ఇలా చెప్పకుంటూ పోతే కథలు కోకొల్లలు. ఇప్పుడు రెండేళ్ల పాలనలో మంత్రులందరిపైనా అవినీతి గుప్పు మంటోంది. అయినా ఎవ్వరు కూడా మాట్లాడడం లేదు. తెలంగాణ మేధావులు నోరు మెదపడం లేదు. కాంగ్రెస్ వచ్చాకనే స్వేచ్ఛ వచ్చిందని కోదండరామ్ సార్ అంటున్నారు. అంటే కెసిఆర్ ఉన్నంతకాలం నిరంకుశ పాలనలో మగ్గామనే అర్థం కదా. తెలంగాణ అస్తిత్వం మీద దాడిలో, మోదీ, చంద్రబాబుల ఉమ్మడీ ప్రణాళిక దాగి ఉందని ఘోషిస్తున్న వారు, ఏ రకమైన దాడి జరిగిందో చెప్పాలి. ఈ గడ్డపై నివస్తిస్తూ ఇక్కడే మమేకమైన వారంతా తెలంగాణ బిడ్డలే. వాళ్ల పిల్లల భవిష్యత్తు, వారి ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ ఈ తెలంగాణ రాష్ట్రంతోనే ముడిపడి ఉన్నాయి. రాజకీయ పార్టీలు అన్ని చోట్లా తమ అస్తిత్వం కోసం ప్రయత్నం చేస్తుంటాయి. కెసిఆర్ కుటుంబానికి చెందిన పార్టీలే తెలంగాణకు ప్రతినిధులు కాదు. తెలంగాణ కోసం కష్టపడే వారు ఎవరైనా రాజకీయలు చేసుకునే హక్కు ఉంటుంది. రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో, ఆ తర్వాత జరిగే సాధారణ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి పోటీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనిని తప్పుపట్టడానికి లేదు. ఉమ్మడి రాష్ట్రంలో అధికారం చలాయించిన సమైక్య పాలకులు, తెలంగాణ ఏర్పాటుతో అధికారం చేపట్టిన వారు కూడా తెలంగాణను నిలువునా దోచుకున్నారు. కాబట్టి ఎవ్వరు కూడా తెలంగాణ అస్తిత్వం కోసం పోరాడలేదు. తమ స్వార్థ రాజకీయం కోసమే పోరాడారు. ఇంకా పోరాడుతున్నారు. ఇప్పుడు రాష్ట్ర విభజన జరిగిన తర్వాత కూడా ఇదే సెంటిమెంటుతో తమ ఉనికి కోసం కొందరు ఇప్పుడు నానా యాగీ చేస్తున్నారని గుర్తిస్తే మంచిది.

# ఇరాన్-అమెరికా చర్చలకు గమ్యం లేదా?




దాదాపు అర్ధశతాబ్ద కాలంగా ఇరాన్‌అమెరికా మధ్య సంబంధాలు శత్రుత్వానికి, సంక్షోభానికి మధ్యనే ఊగిసలాడుతున్నాయి. అప్పుడప్పుడు చర్చల ద్వారా శాంతికి ప్రయత్నాలు జరిగినా ఎక్కువకాలం నిలబడడం లేదు. అనుమానాలు, అపనమ్మకాలు బయటపడి చివరకు ఘర్షణలకు దారి తీయడం పరిపాటి అవుతుంది. ఇప్పుడు ఎటువంటి సమయ పరిమితి లేకుండా కాల్పుల విరమణకు దారితీయగల ఒక అవగాహన ఒప్పందం దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఈ సంబంధాలను ఇబ్బంది పెడుతున్న అనేక సమస్యలు సవాలుగా నిలుస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ ఒప్పందం కీలకమైన ముందడుగుగా కనిపిస్తున్నది. అయినప్పటికీ రెండు పక్షాల అంచనాలు చాలా భిన్నంగా ఉండడం వల్ల ఏకాభిప్రాయం రావడం కూడా ఊహించిన దానికంటే చాలా కష్టంగా మారింది. అమెరికా, ఇరాన్ రెండు దేశాలు చర్చలకు దిగడానికి యుద్ధాన్ని ఆపడానికి ప్రధాన కారణాలు రాజకీయ, ఆర్థిక నష్టాలే. అమెరికా విషయాన్ని పరిశీలిస్తే ఈ యుద్ధం వల్ల అపారమైన సైనిక ఖర్చులు, ఆసియాలో మధ్యప్రాచ్యంలో భారీ బలగాలను మోహరించడం, క్షిపణి దాడుల నిర్వహణకు అత్యధిక ఖర్చు చేయడంతో అమెరికా ఖజానాపై బిలియన్ డాలర్ల భారం పడింది. ఆర్థిక ద్రవ్యోల్బణం పెరిగింది. చమురు ధరలు ముఖ్యంగా అమాంతంగా అమెరికాలో గ్యాసోలిన్ ధరలు , నిత్యావసరాల ధరలు పెరగడం ద్రవ్యోల్బణానికి దారి తీసింది. ఇది అక్కడి పాలకులకు తీవ్రమైన సమస్యగా తయారైంది. ఇక ఇరాన్ వైపు పరిశీలిస్తే ఆర్థిక వ్యవస్థ పతనమైంది. అమెరికా విధించిన కఠినమైన ఆంక్షలు, నావికా దిగ్బంధనాలు ఇవన్నీ ఇరాన్ ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బ తీశాయి. బిలియన్ కొద్ది డాలర్ల నష్టం జరిగిందని స్వయంగా ఇరాన్ అధికారులే ప్రకటించారు. ఇక రాజకీయపరంగా చూస్తే అస్థిరత నెలకొన్నది. సుప్రీం లీడర్ ఖమేనీ మరణం, అంతర్గత ఆందోళనల నేపథ్యంలో ఇరాన్ నాయకత్వం తన పరిపాలన మనుగడ కోసం దౌత్యమార్గాలను ఆశ్రయించాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. ఇజ్రాయెల్‌తో కలిసి అమెరికా ఇరాన్‌పై దాడి చేయడం సుపీరియర్ మిలిటరీ ఫోర్స్‌తో అపార నష్టం జరగడం, ఇదంతా ఇరాన్ దాని అణు, క్షిపణి కార్యక్రమాలపై ప్రాథమిక పరిమితులను అంగీకరించడానికి దారి తీసింది. అమెరికా, ఇజ్రాయెల్ వంటి ప్రత్యర్థులపై వ్యూహాత్మక పట్టు సాధించడానికి ఇరాన్ తన వ్యూహాలను రూపొందించుకుంది. తమకు అనుకూలంగా చర్చలను మార్చడానికి వ్యూహాత్మక స్థితిస్థాపకత ప్రాంతీయ నెట్‌వర్క్‌ను, ఇంధన సరఫరాలను నిరోధించే సామర్థ్యాలను ఉపయోగించుకోవాలని భావించింది. అయితే అటు అమెరికా గాని, ఇటు ఇరాన్ గాని తమ లక్ష్యాలను పూర్తిగా సాధించలేకపోయాయి. ఇరాన్ తన మిలిటరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను తీవ్రంగా నష్టపోయింది. అంతేకాక ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయినప్పటికీ హర్మూజ్ జలసంధి నిగ్బంధనం కొనసాగించడం, గల్ఫ్ దేశాలలో అమెరికా మిత్ర వర్గాలపై దాడి చేయడం, తన ప్రతినిధుల ద్వారా అస్థిరతను కొనసాగిస్తామని బెదిరించడం, తదితర చర్యలను కొనసాగిస్తోంది. అయితే యుద్ధం కొనసాగించడం వల్ల అమెరికా కూడా చాలా నష్టపోతున్నది. నౌకా రవాణా మార్గాలపైన, ఇంధన మార్కెట్లపైనా ఈ ప్రభావం పడుతుంది. దీనితో స్వదేశీయంగానే కాకుండా ప్రపంచ దేశాల నుంచి కూడా అమెరికాపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. అందువల్ల ఉభయ దేశాలు శాంతి ఒప్పందాల కంటే అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడం కోసమే ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే ఇరువర్గాల మధ్య విస్తృతమైన అగాధం ఉండడం వల్ల కనీసం ఒక అవగాహనపైకూడా ఒప్పందం కుదరడం అసాధ్యంగా కనిపిస్తున్నది. ఈమేరకు శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగినా సుస్థిర శాంతికి అనేక అడ్డంకులున్నాయి. ఇరు దేశాల మధ్య దశాబ్దాలుగా నెలకొన్న అపనమ్మకం, అణ్వాయుధ కార్యక్రమాలు, ఆంక్షల సడలింపులపై భిన్న వైఖరులు హర్మూజ్ జలసంధి నిర్బంధం తదితర అంశాలు ఈ ఒప్పందానికి పెద్ద సవాలుగా ఉన్నాయి. 2025 జూన్‌లో జరిగిన 'ట్వల్వ్ డే వార్', 2026 ఫిబ్రవరి చివరిలో అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్ ఎపిక్ క్యూరీ దాడుల నేపథ్యంలో దౌత్య చర్చల ముసుగులో అమెరికా తమను అంతం చేయడానికి ప్రయత్నిస్తోందని ఇరాన్ దృఢంగా నమ్ముతోంది. పూటకో మాట మార్చే అలవాటున్న ట్రంప్ వల్ల సమస్య మరింత సంక్లిష్టంగా మారుస్తోంది. ఇరాన్ కాలయాపన చేయడం ద్వారా అణ్వాయుధ అవకాశాన్ని కాపాడుకోవడంతో పాటు క్షిపణి, ఇతర రక్షణ సామర్థ్యాలను పునర్నిర్మించుకోవడానికి ఇరాన్ ఈ చర్చలను వాడుకుంటోందని అమెరికా విధాన రూపకర్తలు భావిస్తున్నారు. ఏ ఒప్పందమైనా రెండు దేశాల్లో వ్యతిరేకతే వస్తోంది. 2015 నాటి ఇరాన్ అణు ఒప్పందంలోని ప్రధాన లోపాలున్నాయని అమెరికాలో విమర్శలు వస్తున్నాయి. ఇక ఇరాన్‌లో ఒప్పందం పేరుతో ఎటువంటి రాజీ కుదిరినా ఒత్తిడికి లొంగిపోవడమేనని ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్ (ఐఆర్‌జిసి) లోని చాలా మంది విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఇజ్రాయెల్ ఇరాన్ క్షిపణి అణు సామర్థ్యాలు తమ ప్రాంతీయ ఆధిపత్యానికి, ఆకాంక్షలకు అది పెద్ద ముప్పుగా ఇజ్రాయెల్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ అమెరికా చర్చలకు గమ్యం అంటూ లేకుండా పోతోంది.

## ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలి

### బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి డిమాండ్



జగిత్యాల,జూన్4 : రాష్ట్ర ప్రజానికంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందుచూపు లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి ఆరోపించారు. వానకాలం పంట సీజన్ మరికొద్ది రోజుల్లో ప్రారంభమవుతున్నా గాని ప్రభుత్వానికి ముందస్తు కార్యచరణ ప్రణాళికను ఇంకా తయారు చేసుకోలేదని వెల్లడించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట రుణాలకు సంబంధించి కార్యచరణను ఇంకా రూపొందించ లేదని ఆరోపించారు. కనీసం ఖరీఫ్ పంటకైనా రైతు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా మూడు సంవత్సరాల కాలంలో ఆరు పంటలు పండాయని, ఇందులో ఎన్ని పంటలకు రైతు భరోసా కల్పించారో ఆయన ఆత్మకే తెలుసని విమర్శించారు. ధాన్యం సేకరణపై కాంగ్రెస్ , బీజేపీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు. పప్పు దినుసులు, నూనె గింజలు పండించాలని సలహా ఇస్తున్న ప్రభుత్వం వాటికి ఏ విధమైన ప్రోత్సాహం కల్పిస్తుందో చెప్పడం లేదని పేర్కొన్నారు. కోతుల బెడద నుంచి పంటలను కాపాడేందుకు కోతుల పునరుత్పత్తి నిలుపుదల కేంద్రాన్ని జిల్లాకు ఒకటి ఏర్పాటు చేయాలని, తక్షణమే రైతుకు సోలార్ ఫెన్సింగ్ 50 శాతం రాయితీతో ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్లో యూరియా అందుబాటులో లేదని, యూరియా యాప్‌ను తొలగించి నేరుగా రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## భవిష్యత్యం అవసరాలకు పెట్టుబడి

### గూగుల్ తీరును అభినందించన ఉదయ్ కోటక్

ముంబై,జూన్4 : కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ తాజాగా భారతీయ వ్యాపార సంస్థలను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దిగ్గజ కార్పొరేట్ సంస్థలు వేల కోట్లను ఆర్జిస్తున్నప్పటికీ సంతృప్తి చెందకుండా భవిష్యత్తుపై పెట్టుబడులు పెడుతున్న వైనాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా గూగుల్ గురించి ప్రత్యేకంగా పేర్కొన్నారు. ఈ సంస్థ ఆర్థిక సామర్థ్యం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని అన్నారు. 'గూగుల్ వార్షిక లాభం 160 బిలియన్ డాలర్లు. గత త్రైమాసికంలో 62 బిలియన్‌లను ఆర్జించింది. సంస్థ మార్కెట్ విలువ 4.5 ట్రిలియన్‌లు. భారతీయ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్, లాభాల కంటే ఇది ఎక్కువ. ఇది భారతీయ కంపెనీలకు మేలు కొలుపు కావాలి. ప్రస్తుత పరిస్థితి ఎంత మెరుగ్గా ఉన్నప్పటికీ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టాలి' అని ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ పోస్టు నెట్టింట తెగ వైరల్ అవుతోంది. కృత్రిమ మేధపై పెట్టుబడుల కోసం ఇటీవల గూగుల్ ఏకంగా 80 బిలియన్ డాలర్లను సేకరించేందుకు ప్రణాళిక ఆవిష్కరించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనాన్ని సృష్టించింది. ప్రభుత్వాలు నిధుల సేకరణ జరిపే స్థాయిలో ఒక కార్పొరేట్ కంపెనీ దీర్ఘకాలిక వ్యూహంతో నిధులు సేకరించడంతో పెద్ద చర్చుకు దారి తీసింది.


## పర్యావరణ పరిరక్షణకు సైకిల్ వినియోగం

### ప్రజలకు చంద్రబాబు విజ్ఞప్తి

అమరావతి : జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు సైకిల్ వినియోగించాలని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం విశాఖపట్నంలో జరిగే ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొననున్నారు. ఆ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు నాయుడు సైకిల్‌పై వెళ్లనున్నారు. పర్యావరణ హితమైన సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించేందుకు సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రజలు, పార్టీ నేతలతోపాటు ప్రభుత్వంలో పని చేసే వారంతా శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. జూన్ 5వ తేదీ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా గురువారం ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆయన ఏమన్నారంటే.. 'రేపు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు? ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. అందులో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ –సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతున్నాను' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## కుటుంబ బంధం అవసరం !

తిరుమల : ఆవు తనకు కట్టిన పలుపుతాడు తెంచుకొని వెళ్ళిపోవాలనుకుని అటు, ఇటు చుట్టూ తిరుగుతుంది. చివరకు తన పరిధి తాను తెలుసుకుని చతికిలపడుతుంది. మన నిస్సహాయతను మనం తెలుసుకోవాలి. అదే సమయంలో మనల్ని ఇలా ఉంచినవాడి గొప్పదనాన్ని గ్రహించాలి. ఎవరిమీదో కోపం వస్తుంది. ఎందుకో కోపం వస్తుంది. పారిపోవాలని అనిపిస్తుంది. తాళ్లతో కట్టి బంధించరెవరూ! అయినా వెళ్ళలేం. ఎందుకు, ఎవరు మనల్ని ఆపుతున్నారో తెలియదు.చూసిన ముఖాలే చూస్తూ, ఆడిన మాటలే ఆడుతూ, అదే తిండి తింటూ, నిద్రపోతూ తెల్లవారి లేచి మరో కొత్త సూర్యుడి కోసం ఎదురు చూస్తాం. ఇదే బంధం. మౌలికంగా మనిషి బతకడంలోనే బంధం ఉంది. అందం ఉంది. బంధాలు అందంగా ఉంటాయి. అవి ఇనుప గొలుసులైతేనేం, బంగారు గొలుసులైతేనేం– బంధాలు బయటకు కనిపించవు. తల్లి వెంట బిడ్డ, బిడ్డ వెంట తల్లి... ఆ బిడ్డ ఎదిగి తల్లి... అలా అందరూ కలిసి కుటుంబం. ఈ కుటుంబాలన్నీ ఈశ్వరుడివే.పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు మనసు వైరాగ్యానికి గురి అయినప్పుడు తట్టా బుట్టా సర్దుకుని ఎక్కడికైనా వెళ్ళిపోదాం అనిపిస్తుంది. కానీ, అంతలోనే ఆగిపోవాలి అనిపిస్తుంది. కనపడకుండా ఆపేదెవరని ఆలోచిస్తే– మనవాళ్లే కాదు... మనమధ్యలో ఉండే బంధమే అనిపిస్తుంది. కుటుంబ బంధం అంత బలమైనది. అందులోనే అందం, ఆనందం ఉంది.



ఆధ్యాత్మికం

# కరీంనగర్ గ్లోబల్ సిటీగా మారే దిశగా అడుగులు వేస్తుంది ఇది తెలంగాణకే గర్వకారణం

- స్మార్ట్ సిటీ కా మతలబ్ సిర్ఫ్ టెక్నాలజీ నహీం, బల్కి లోగోం కీ జిందగీ కో ఆసాన్ బనానా హై
- హిందీ ప్రసంగంతో ఆకట్టుకున్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరీంనగర్ టౌన్, జూన్04(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ బహుత్ తేజీ సే ఏక్ గ్లోబల్ సిటీ బన్నే కీ ఓర్ బఢ్ రహా హై యే తెలంగాణ కా గౌరవ్ హై కరీంనగర్ చాలా వేగంగా ఒక గ్లోబల్ సిటీగా మారే దిశగా అడుగులు వేస్తోంది. ఇది తెలంగాణ కే గర్వకారణం అని నగర మేయర్ కొలగని శ్రీనివాస్ అన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం ఋషి కేష్ లో జరిగిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ మేయర్స్ 117 వ సమావేశంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పై వ్యాఖ్యలు చేశారు. జూన్ 3, నాలుగు తేదీల్లో ఋషికేష్ జరిగిన ఆల్ ఇండియా మేయర్స్ సమావేశాల్లో పాల్గొన్న కోలగాని శ్రీనివాస్ ముందుగా సమావేశంలో పాల్గొన్న ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, సహచర మేయర్లు, అధికారులందరికీ నమస్కారాలు తెలియజేసి కరీంనగర్ స్మార్ట్ సిటీ , అర్బన్ డెవలప్మెంట్ గురించి హిందీలో తన ప్రసంగాన్ని కొనసాగించి అందర్నీ ఆకట్టుకున్నారు. ముఖ్యంగా స్మార్ట్ సిటీ కా మతలబ్ సిర్ఫ్ టెక్నాలజీ నహీం, బల్కి లోగోం కీ జిందగీ కో ఆసాన్ బనానా హై,స్మార్ట్ సిటీ అంటే కేవలం సాంకేతికత మాత్రమే కాదు, ప్రజల జీవితాలను సులభతరం చేయడం అని అన్నారు. కరీంనగర్, తెలంగాణలోని ఒక ముఖ్యమైన ,వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, దీనిని కేంద్ర ప్రభుత్వ 'స్మార్ట్ సిటీ మిషన్' కింద ఎంపిక చేశారన్నారు. కరీంనగర్‌ను ఒక ఆధునిక నగరంగా మార్చడానికి అనేక పెద్ద మార్పులు జరుగుతున్నాయన్నారు. నగరంలో స్మార్ట్ రోడ్లు, మంచి ఫుట్‌పాత్‌లు , డ్రైనేజీలు , నగరం మొత్తంలో సీసీటీవీ కెమెరాలు కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా భద్రతను పెంచడానికి అనేక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా కరీంనగర్‌లో స్వచ్ఛమైన నీరు, మంచి డ్రైనేజీ వ్యవస్థ , మెరుగైన రోడ్లు, అందమైన పార్కులను నిర్మించి ప్రజలకు ఒక మెరుగైన వాతావరణాన్ని అందించే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. అంత్ మే ఓర్ ఏక్ బాత్ గర్వ్ సే కహనా చాహాతూ ఇస్ మొకే పర్ "తెలంగాణ రాజ్య కే గఠన్ కే బాద్ పహలీ బార్ కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పర్ బిజెపి నే కబ్జా కియా ఔర్ మేయర్ కీ కుర్సీ హాసిల్ కీ. యహ్ తెలంగాణ బిజెపి కే లియే ఏక్ ఐతిహాసిక్ జీత్ జైసీ హై."చివరగా ఓ విషయాన్ని ఈ సందర్భంగా గర్వముగా చెప్పదలుచుకున్నా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావనంతరం ప్రప్రదమంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ను బిజెపి కైవసం చేసుకుంది..ఇది తెలంగాణలో నే బీజేపీకి ఒక చారిత్రక విజయం లాంటిది. అని మేయర్ కోలగని శ్రీనివాస్ తన ప్రసంగాన్ని ఈ సందర్భంగా ముగించారు. గురువారం ముగింపు సమావేశానికి ఉత్తరాఖండ్ మంత్రి మదన్ కౌశిక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మదన్ కౌశిక్, మేయర్ కొలగని శ్రీనివాస్ ను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.






# మహిళల హక్కులను, చట్టాలను పరిరక్షించుకుంటునే సమస్యల పరిష్కారం కోసమే ఎన్.ఎఫ్.ఐ డబ్ల్యూ ఉద్యమిస్తోంది

**- ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీటీసీ గూడెం లక్ష్మీ**

**కరీంనగర్ టౌన్, జూన్04(ది క్రైమ్ న్యూస్):** సమాజంలో మహిళల హక్కుల పరిరక్షణ కోసం, వారి అభ్యున్నతి కోసం, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేసేది భారత జాతీయ మహిళా సమాఖ్య అని ఎన్.ఎఫ్.ఐ డబ్ల్యూ సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపీటీసీ గూడెం లక్ష్మీ అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ జెండాను లక్ష్మీ ఎగురవేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన మహిళల చట్టాలను, హక్కులను మహిళ లోకానికి తెలియజేసేందుకు వారిలో చైతన్యాన్ని నింపడానికి, అన్యాయాలను, అత్యాచారాలను అరికట్టేందుకు భారత జాతీయ మహిళా సమాఖ్య ఆవిర్భవించిందని, 72 సంవత్సరాలుగా ఈ దేశంలో మహిళల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిందని ప్రధానంగా మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించడం కోసం పాలక ప్రభుత్వాలపై సాధించేవరకు పోరాటాలు నిర్వహించినది మహిళా సమాఖ్య అని, ఆరుట్ల కమలాదేవి లాంటి గొప్ప, గొప్ప మహిళలు ఈ సమాఖ్య లో పనిచేశారని లక్ష్మీ గుర్తు చేశారు. ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బీర్ల పద్మ, కొట్టె అంజలి మాట్లాడుతూ వంటింటికే పరిమితమైన మహిళలను చైతన్య వంతం చేసి వారిలో ధైర్యాన్ని నింపి, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు సముచిత స్థానం కావాలనీ, విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో కూడా ప్రాధాన్యత ఇవ్వాలని పోరాడిన సంఘం ఎన్.ఎఫ్. ఐ. డబ్ల్యూ అని, ఎక్కడ మహిళలను చిన్న చూపు చూసా, అవహేళన చేసినా, వరకట్న వేధింపులకు గురి చేసినా, అత్యాచార ఘటనలు జరిగినా బాధితుల పక్షాన ముందుండి పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక మహిళా సమాఖ్య ఎన్. ఎఫ్. ఐ. డబ్ల్యూ అని పద్మ, అంజలి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య ఎన్.ఎఫ్.ఐ.డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు బీర్ల పద్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టె అంజలి, జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి సావిత్రి, కోశాధికారి రాగుల మల్లిక, జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు ఎ.సంధ్య, జి.రజిత, బి.మున్నీ, డి.సరోజన, ఎం.పద్మ, ఎ.భాగ్య,ఎస్. శోభ, ఎన్.లక్ష్మీ, బి. సుజాత తదితరులు పాల్గొన్నారు.




# ఆత్మీయ భరోసా కింద వ్యవసాయ కార్మికులందరికీ రూ.12 వేలు ఇవ్వాలి: నారీ ఐలయ్య

**నల్గొండ ప్రతినిధి, జూన్ 4 (ది క్రైమ్ న్యూస్):** ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నిడమనూరు మండల కేంద్రంలో నిర్వహించిన నాగార్జునసాగర్ నియోజకవర్గ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టం కింద 100 రోజుల పని పూర్తిచేసిన కుటుంబాలన్నింటికీ సంవత్సరానికి రూ.12 వేల చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, మూడేళ్లు పూర్తవుతున్నా అమలు చేయలేదని విమర్శించారు. అర్హులైన అన్ని వ్యవసాయ కార్మిక కుటుంబాలకు వెంటనే ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలని కోరారు. అలాగే 50 సంవత్సరాలు నిండిన వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.5,000 పెన్షన్ ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి ఆహార భద్రతా కార్డు మంజూరు చేసి 16 రకాల నిత్యావసర వస్తువులను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక కుటుంబాలకు ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని సూచించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక వర్గంపై యుద్ధం ప్రకటించినట్లుగా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఉపాధి హామీ పనుల్లో కార్మికులు రోజుకు రెండుసార్లు ఫోటోలు తీయాల్సిన విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ విధానం వల్ల ఎండల్లో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్స్ పేరుతో కార్మికుల హక్కులను హరించే చర్యలకు కేంద్ర ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. దశాబ్దాల పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం, కనీస వేతనం, సామాజిక భద్రత వంటి హక్కులను బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కార్మికులు, రైతులు, పేద ప్రజలు ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. డీజిల్, పెట్రోల్, గ్యాస్ ధరల పెరుగుదలతో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. పెంచిన ఇంధన ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జటాపత్తు రవి నాయక్, జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి కోటేష్, సీఐటీయూ మండల కన్వీనర్ కోమండ్ల గురవయ్య, ఐద్వా మండల కార్యదర్శి రాంరాజు యశోద, గుర్రంపోడు మండల కార్యదర్శి బచ్చనబోయిన శివ, పెద్దవూర మండల కార్యదర్శి శ్రీరాముల నాయక్, నిడమనూరు మండల అధ్యక్షుడు కొంచెం శేఖర్, త్రిపురారం మండల అధ్యక్షురాలు సోమమ్మతో పాటు పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.





# సూపర్ స్పెషాలిటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

**ఆర్.జి.త్రీ, ఎపిఎ అధికార ప్రతినిధి బి.సుదర్శనం**

**రామగిరి, జూన్ 04(ది క్రైమ్ న్యూస్):-** సూపర్ స్పెషాలిటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్.జి.త్రీ, ఎపిఎ అధికార ప్రతినిధి బి.సుదర్శనం గురువారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సింగరేణి ముఖ్య వైద్యాధికారి సూచనల మేరకు, తేది:07.06.2026 ఆదివారము రోజున ఏరియా హాస్పిటల్, రామగుండం-వన్ నందు సూపర్ స్పెషాలిటి మెడికల్ క్యాంపు నిర్వహించబడుచున్నది. అస్టర్ ప్రైమ్ హాస్పిటల్ హైదరాబాద్ నుండి కార్డియాలజీ (గుండె సంబంధిత వ్యాధులు), న్యూరాలజీ (నరాల సంబంధిత వ్యాధులు), యూరాలజీ (మూత్రపిండాల శస్త్రచికిత్స), నెఫ్రాలజీ (కిడ్నీ సంబంధిత వ్యాధులు), గ్యాస్ట్రో ఎంటరాలజీ (జీర్ణకోశ వ్యాధులు) ఇట్టి విభాగాలకి సంబంధించిన సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్స్ ఈ క్యాంపునకు రావడం జరుగుచున్నది.సూపర్ స్పెషాలిటీ క్యాంపు నందు రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు ఏరియా హాస్పిటల్ రామగుండం నందు శనివారం సాయంత్రంలోగా తమ హాస్పటల్ బుక్ తో రిజిస్ట్రేషన్ చెసుకొనగలరు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకొన్న వారు మాత్రమే సూపర్ స్పెషాలిటి క్యాంపుకు అనుమతించబడతారు. తేది: 07.06.2026 ఆదివారము రోజున ఏరియా హాస్పిటల్, రామగుండము నందు జరగనున్న సూపర్ స్పెషాలిటి వైద్య శిబిరంలో పాల్గొని ఇట్టి అవకాశం సద్వినియోగించుకొనగలరని తెలియజేయనైనది. రామగుండం-త్రీ , అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలలో పనిచేయుచున్న అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, కార్డు కలిగిన రిటైర్డ్ ఉద్యోగులు, వారి భార్య/భర్తలు, అన్ని గనుల, విభాగాలలో పనిచేయు అధికారులు, ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఇట్టి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



# మధిర పట్టణంలో అనేక సమస్యలు పరిష్కరించబడ్డాయి

**మున్సిపల్ చైర్మన్ సామినేని సుజాత**





**మధిర ప్రతినిధి జూన్ 4 (ది క్రైమ్ న్యూస్):** ప్రజా పాలనలో ప్రగతి ప్రణాళికలతో మధిర పట్టణంలో అనేక సమస్యలు పరిశీలించబడ్డాయి అని మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం నాలుగవ వార్డు ఇల్లెందులపాడులో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ బెనటిక్ ఇజ్రాయెల్ పాల్ అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమంలా పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత మాట్లాడుతూ,తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, మున్సిపాలిటీలలో పారిశుధ్యం,వర్షాకాలంలో ముంపు సమస్యలు,సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టామని అన్నారు.మున్సిపాలిటీలో ఇప్పటికే అనేక సమస్యలు గుర్తించి పరిష్కరించామని తెలిపారు.వచ్చే వర్షాకాల సీజన్ ని దృష్టిలో ఉంచుకొని వర్షపు నీరు సాఫీగా పోయేలా మురుగునీటి కాలువలు, నాలాల్లో పేరుకుపోయిన పూడిక,చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నామని తెలిపారు.మున్సిపాలిటీలో పొంగిపొర్లే మురుగు కాలువలను గుర్తించి,పగిలిన మ్యాన్‌హోల్స్‌కు పటిష్టమైన మూతలు మార్పు వంటి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అలాగే తడి-పొడి చెత్త వేరుచేసే ప్రక్రియపై పట్టణ ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు పెద్దలు సూర్యదేవర కోటేశ్వరరావు, సామినేని రామనాథం, వాసిరెడ్డి నాగేశ్వరరావు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్‌లో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' వార్డు సభ

**హాజరైన ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు**


**అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో 2, 3, 4, 5 వార్డుల సభ విజయవంతం**





**సుల్తానాబాద్, జూన్ 4 (ది క్రైమ్ న్యూస్):** సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని వైశ్య భవనంలో గురువారం 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' వార్డు సభ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు కృష్ణ మరియు స్థానిక కౌన్సిలర్ల సంయుక్త ఆధ్వర్యంలో 2, 3, 4, 5 వార్డులకు సంబంధించిన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి , ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డులలో నెలకొన్న పలు ప్రజా సమస్యలపై, పట్టణ ప్రగతి ప్రణాళికలపై అధికారులతో కలిసి సమీక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఈ వార్డు సభలో మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మార్వో, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు. అలాగే పల్లె దవాఖాన డాక్టర్, డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్ పాల్గొని తమ శాఖల పరిధిలోని ప్రగతిని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మెప్మా సీఏలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ సిబ్బందితో పాటు ఆయా వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హాలియా పురపాలక గృహ యజమానులకు విజ్ఞప్తి



**నల్గొండ ప్రతినిధి, జూన్ 4 (ది క్రైమ్ న్యూస్):** జనగణన--2027లో భాగంగా ఇండ్ల గణనకు సహకరించండి జనగణన-2027 కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇండ్ల గణన ప్రక్రియకు 2026 జూన్ 9 చివరి తేదీగా నిర్ణయించబడినందున, హాలియా పురపాలక పరిధిలోని గృహ యజమానులందరూ తప్పనిసరిగా అందుబాటులో ఉండి గణన ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని పురపాలక సంఘం విజ్ఞప్తి చేసింది. ఇప్పటివరకు హౌస్ లిస్టింగ్ (ఇండ్ల గణన) చేయించుకోని వారు ఎవరైనా ఉంటే, వెంటనే హాలియా పురపాలక సంఘ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్యాలయంలో సమాచారం అందించిన వెంటనే సంబంధిత ఎన్యూమరేటర్ల ద్వారా ఇండ్ల గణన చేపట్టబడుతుందని తెలిపారు. జనగణన ప్రక్రియలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావడం అత్యంత ముఖ్యమని, అందరూ సహకరించి గణనను విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

# అత్యుత్సాహంతో లాటి చార్జ్ అమానుషం...

● పోలీసుల తొందరపాటు చర్యలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.. ● బాధితులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి మండలం నిట్టూరు గ్రామపంచాయతీ పరిధిలో బుధవారం లారీ డ్రైవర్ల నిర్లక్ష్యం, పోలీసుల అత్యుత్సాహం వల్ల సామాన్య ప్రజలు బాధితులుగా మారడం అత్యంత విచారకరమని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం జరిగిన లాఠీచార్జ్ సంఘటనలో గాయపడిన వారిని గురువారం నిట్టూరు గ్రామ సర్పంచ్ భర్త ఆకుల శ్రీనివాస్ నివాసంలో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. అనంతరం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ గత పది రోజులుగా ఈ రోడ్డుపై చెరువు మట్టి రవాణా చేస్తున్న లారీ టిప్పర్లు విపరీతమైన వేగంతో వెళ్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నా అధికారులు పట్టించుకోలేదని మనోహర్ రెడ్డి విమర్శించారు. నిన్న కూడా ఒక లారీ అతివేగంగా వచ్చి కరెంటు పోల్‌ను ఢీకొట్టడంతో అది విరిగిపోయిందని తెలిపారు. ఒక బాధ్యత గల పౌరుడిగా అక్కడే ఫంక్షన్‌లో ఉన్న సర్పంచ్ భర్త ఆకుల శ్రీనివాస్ వెంటనే స్పందించి, వెళ్ళిపోతున్న లారీని వెంబడించి ఆపి, డ్రైవర్‌ను తీసుకువచ్చారన్నారు.అయితే, లారీల అతి వేగంపై ఆగ్రహంతో ఉన్న కొద్దిమంది యువకులు మూడు లారీల అద్దాలు పగలగొట్టడం జరిగిందని, ఆ సమయంలో ఏం జరిగిందో చూద్దామని గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారని తెలిపారు. అంతలోనే అక్కడికి వచ్చిన పెద్దపల్లి రూరల్ ఎస్ఐ ఆ తర్వాత వచ్చిన పెద్దపల్లి సిఐ ఎలాంటి విచారణ జరపకుండా, అక్కడ గుమి కూడిన సామాన్య ప్రజలపై చెప్పలేని బూతులు తిడుతూ, విచక్షణారహితంగా లాఠీచార్జ్ చేయడం తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు. పోలీసుల దెబ్బలకు సామాన్య గ్రామస్తుల ఒంటిపై వాతలు రావడం వారి అత్యుత్సాహానికి నిదర్శనమని మండిపడ్డారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి: ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలే తప్ప, సంబంధం లేని సామాన్య ప్రజలపై లాఠీలు ఝుళిపించడం నిబద్ధత గల అధికారులకు తగదని దాసరి హితవు పలికారు. ప్రజలు ఆవేశంలో పొరపాటు చేస్తే సరిదిద్దాల్సిన పోలీసులే ఇలా తొందరపడి సామాన్యులను కొట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ఈ ఘటనపై నిట్టూరు గ్రామస్తులతో కలిసి గౌరవ పెద్దపల్లి డీసీపీ గారికి గారికి ఫిర్యాదు చేస్తామని, అత్యుత్సాహం ప్రదర్శించిన సదరు పోలీస్ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అతివేగంతో వెళ్తున్న టిప్పర్ల వల్ల నిట్టూరు గ్రామస్తులు నిత్యం భయాందోళనలకు గురవుతున్నారని, లారీల వేగాన్ని నియంత్రించాల్సిందిగా కోరారు. బాధితులకు, నిట్టూరు గ్రామ ప్రజలకు బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా దాసరి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్ కుమార్, నాయకులు సలేంద్ర రాములు , మాదారపు వేణు గోపాల్ రావు, సంపత్ రావు , హరీష్, పెంచల శ్రీధర్, నామ్సాని సరేష్ బాబు,సిరవేని లవన్ కుమార్, పల్లె మధు , జక్కుల శ్రీకాంత్, తో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# మహిళల పక్షాన చారిత్రిక పోరాటాలు: ఏపూరి లతాదేవి

● ఘనంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ వ్యవస్థాపక దినోత్సవం

**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** మహిళల పక్షాన భారతదేశంలో చారిత్రిక పోరాటాలను నిర్వర్తించిన ఘనత భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ)కు దక్కుతుందని భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి తెలిపారు. దశాబ్దాల పోరాట చరిత్రలో అనేక పోరాట విజయాలను మహిళా సమాఖ్య సాధించిందని ఆమె తెలిపారు. మహిళా సమాఖ్య 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య పతాకాన్ని ఏపూరి లతాదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపూరి లతాదేవి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచిన మహిళలు ఇంకా వివక్షను ఎదుర్కొంటునే ఉన్నారన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో ముందు వరుసలో ఉండి పని చేస్తున్నా వివక్ష పోవడం లేదన్నారు. చట్టాలు అక్రమార్కులకు, కామాంధులకు చుట్టాలుగా మారుతున్నాయని లతాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. భారత మహిళా సమాఖ్య అనేక చారిత్రిక పోరాటాలను నిర్వహించిందని ప్రస్తుతం మహిళలు అనుభవిస్తున్న చట్టాల వెనుక మహిళా సమాఖ్య పోరాటాలు దాగి ఉన్నాయన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతున్నామని కానీ డిలిమిటేషన్ తో ముడిపెట్టి మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుంటున్నారని లతాదేవి ఆరోపించారు. మహిళల చట్టాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, వివిధ కేసులకు సంబంధించి ఫాస్ట్రాక్ కోర్టుల ద్వారా తక్షణ న్యాయం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని లతాదేవి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పోటు కళావతి, జిల్లా బాధ్యులు జమ్ముల లక్ష్మి, మందడపు రాణి, దండి రాజేశ్వరి, ఓరుగంటి ప్రమీల, భవాని, సృజన, కృష్ణవేణి, సౌజన్య, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాలకు కొత్త బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలి

● మిర్యాలగూడ బస్టాండ్‌ను డిజిటల్ బస్టాండ్‌గా ఆధునికీకరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి






**నల్గొండ, ప్రతినిధి, జూన్ 4 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌ను సందర్శించిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ను మిర్యాలగూడ ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బస్టాండ్ పరిసరాలను పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సరైన బస్సు సౌకర్యం లేక ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, రోజువారీ కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించాలని కోరుతూ ఎండీకి వినతిపత్రం అందజేశారు. మాడుగులపల్లి మండలంలో మిర్యాలగూడ--కుక్కడం--తోపుచర్ల--ఇసుకబావిగూడెం--పుచ్చకాయలగూడెం--బొమ్మకల్--భీమనపల్లి -కల్వలపాలెం-పాములపాడు -సూర్యాపేట మార్గంలో బస్సు సర్వీసులు నడపాలని కోరారు. అలాగే వేములపల్లి మండలంలో వేములపల్లి--అన్నపరెడ్డిగూడెం--గోగువారిగూడెం మార్గంలో బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు ప్రస్తుతం సల్కనూరు అడ్డరోడ్డు వరకు నడుస్తున్న బస్సును మంగాపురం వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అడవిదేవులపల్లి మండలంలోని ముదిమాణిక్యం గ్రామానికి ఉదయం, సాయంత్రం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. మిర్యాలగూడ మండలంలోని యాదగిరిపల్లి, కాల్వపల్లి, ఉట్లపల్లి, తక్కెళ్లపాడు, తడకమళ్ల, కామేపల్లి, రుద్రారం, లక్ష్మీపురం, ఎర్రకాలువ, కేశవపురం, రామోజీ తండా, అవంతిపురం, ఆలగడప, రాయలపాలెం, ముల్కలకాల్వ, జాల్బాయి తండా, జప్తి వీరప్పగూడెం, జటావత్ తండా, అల్వాల్‌పాడు, బొర్రాయపాలెం, అన్నారం గ్రామాలకు కొత్త బస్సు సర్వీసులు ప్రారంభించాలని కోరారు. దామచర్ల మండలంలో దామచర్ల--పొత్తలపాలెం--కల్లేపల్లి--గాంధీనగర్--తిమ్మాపురం--తూర్పు తండా--బడాయిగడ్డ--రాగడప, దామచర్ల--గణేష్‌పాడు, దామచర్ల--నునావత్ తండా--సాతండా--తిట్టకుండా--మంగళదుబ్బ తండా మార్గాల్లో బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మార్గాల్లో బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా వేలాది మంది గ్రామీణ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు ప్రయోజనం పొందుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదేవిధంగా మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌ను డిజిటల్ బస్టాండ్‌గా ఆధునికీకరించాలని ఎండీకి సూచించారు. ఎమ్మెల్యే విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన ఎండీ వై. నాగిరెడ్డి, అన్ని అంశాలను పరిశీలించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డిపో మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల నేత సుబ్బారావు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యేల సంతాపం





**నల్గొండ ప్రతినిధి, జూన్ 04 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ టౌన్ శాంతినగర్‌కు చెందిన మానవ హక్కుల వేదిక నాయకులు శ్రీ సుబ్బారావు ఆకస్మిక మరణం పట్ల మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్ రావు మరియు తిప్పన విజయసింహా రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సుబ్బారావు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మానవ హక్కుల పరిరక్షణ కోసం సుబ్బారావు గారు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలోని బలహీన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. సుబ్బారావు మరణం మానవ హక్కుల ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్న మాజీ ఎమ్మెల్యేలు, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎండి. మగ్దుం పాషా, ఎండి. ఇలియాస్ ఖాన్, పెద్ది శ్రీనివాస్ గౌడ్, ఎండి. మాజీద్, పద్మశెట్టి కోటేశ్వరరావు, గుడిసె దుర్గాప్రసాద్, గంగుల బిక్షం యాదవ్, దైద సత్యం, నల్లగంతుల నాగభూషణం, అరుణ్ కుమార్, వేనేపల్లి పాండురంగారావు, నేరెళ్ళ శివ, కడియం సైదులు, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ పై కార్పొరేట్ సెంట్రల్ స్టోర్స్‌కు వెళ్తున్న అజ్మీరా

శ్రీనివాస్‌కు ఘన వీడ్కోలు పలికిన ఆర్‌సీహెచ్‌పీ కార్మికులు



**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కొత్తగూడెం ఏరియాలోని ఆర్‌సీహెచ్‌పీ (ఆర్ సి ఎహ్ పి)లో విశిష్ట సేవలు అందించిన శ్రీ అజ్మీరా శ్రీనివాస్, ఎస్.ఈ. (ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్) కి కార్పొరేట్ సెంట్రల్ స్టోర్స్‌కు బదిలీ అయిన సందర్భంగా ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కార్మికులు, అధికారులు, యూనియన్ నాయకులు శాలువాతో సత్కరించి ఆయన అందించిన సేవలను కొనియాడారు. గురువారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఏరియా ఇంజనీర్ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన అధికారులు, యూనియన్ నాయకులు అజ్మీరా శ్రీనివాస్ సంస్థ అభివృద్ధికి, బొగ్గు ఉత్పత్తి మరియు ఉత్పాదకత పెంపుదలకు అందించిన సేవలను ప్రశంసించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేయడంతో పాటు కార్మికులతో స్నేహపూర్వకంగా వ్యవహరించడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. అలాగే, ఆర్‌సీహెచ్‌పీలో ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని, నూతన బాధ్యతల్లో కూడా అదే స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు లింగా, యశస్వి, యూనియన్ నాయకులు ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి గట్టయ్య, ఐఎన్‌టీయూసీ పిట్ కార్యదర్శి శంకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వెంకట్ డాన్స్ అకాడమీ డాన్స్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించిన డాక్టర్ లక్ష్మీ ఆకుల




**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** ఖమ్మంపట్టణానికి చెందిన వెంకట్ డాన్స్ అకాడమీ (వి డి ఏ) ఆధ్వర్యంలో వి బి సి సి యూత్ సహకారంతో నిర్వహించనున్న తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి డాన్స్ పోటీల బ్రోచర్‌ను ప్రముఖ విద్యావేత్త, సామాజిక సేవకురాలు డాక్టర్ లక్ష్మీ ఆకుల ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ ఆకుల మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీయడంలో ఇలాంటి డాన్స్ పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నేటి తరం పిల్లలు విద్యతో పాటు కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని సూచించారు. కళాకారులను ప్రోత్సహించేందుకు వెంకట్ డాన్స్ అకాడమీ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. డాక్టర్ లక్ష్మీ ఆకుల బటర్ఫ్లై స్పెషల్ వింగ్స్ సంస్థ వ్యవస్థాపకురాలు మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా, అలాగే ఋగ్వేదం స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ వ్యవస్థాపకురాలు మరియు కరస్పాండెంట్‌గా సేవలందిస్తూ విద్యా, సామాజిక రంగాల్లో విశేష కృషి చేస్తున్నారు. అంతేకాకుండా ఆంకాలజీ విభాగంలో పరిశోధకురాలిగా కూడా సేవలందిస్తున్నారు. వెంకట్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ రాష్ట్ర స్థాయి డాన్స్ పోటీలు జూన్ 14న ఇల్లందులోని సి ఈ ఆర్ క్లబ్ ప్రాంగణంలో జరగనున్నట్లు నిర్వాహకులు కడారి వెంకటేష్ మరియు సాయి మాస్టర్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో కళాకారులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టచ్ స్టూడియో అధినేత రాకేష్ రెడ్డి మీరా, షబ్బీర్, ఇల్లందు సీనియర్ డాన్స్ మాస్టర్ రాజేష్ మాస్టర్, కళాకారులు, యువజన ప్రతినిధులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# హాలియాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రత్యేక వార్డు సభలు





**నల్గొండ ప్రతినిధి, జూన్ 4(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా హాలియా మున్సిపాలిటీలో 1, 2, 3 వార్డులకు సంబంధించిన ప్రత్యేక వార్డు సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమం హాలియా పబ్లిక్ స్కూల్‌లో మున్సిపల్ చైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ, 99 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, ప్రధాన రహదారుల వెంట వ్యర్థాల తొలగింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ జూట్, గుడ్డ సంచులను వినియోగించాలని పిలుపునిచ్చారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ--2026 నిబంధనలను ప్రజలకు వివరించారు. ఇంటి వ్యర్థాలను తడి, పొడి, శానిటరీ మరియు స్పెషల్ కేర్ వ్యర్థాలుగా నాలుగు విభాగాలుగా వేరు చేయాలని సూచించారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టే వారు వర్షపు నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం స్వచ్ఛత, ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రత్యేక వార్డు సభల కరపత్రాలను విడుదల చేసి ప్రజలకు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రజా సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు చేశారు. వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అభిప్రాయాలను వెల్లడించగా, వార్డు ప్రజల నుంచి పలు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ , మండల వ్యవసాయ అధికారి, పట్టణ ప్రముఖులు, వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు, మహిళలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం

## ● జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ● 4000 గంజాయి టెస్టింగ్ కిట్స్ ● డిఅడిక్షన్ ద్వారా గంజాయి తాగేవారిలో మార్పు తీసుకొస్తున్న మహబూబాబాద్ జిల్లా పోలీసులు







**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్04(ది క్రైమ్ న్యూస్):-** మహబూబాబాద్ జిల్లాను, జిల్లాలో గంజాయి వినియోగం, రవాణా, విక్రయాలను పూర్తిగా నిర్మూలించి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు జిల్లా పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపట్టిందని జిల్లా పోలీసు అధికారి డాక్టర్ శబరీష్, ఐపీఎస్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు మరియు వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లాలో ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం నిఘా నిర్వహిస్తున్నాయని తెలిపారు. డీఎస్పీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది రాత్రి వేళల్లో విస్తృతంగా గస్తీ నిర్వహిస్తూ అనుమానాస్పద ప్రాంతాలు, నిర్జన ప్రదేశాలు, యువత ఎక్కువగా గుమికూడే ప్రాంతాలు, గంజాయి వినియోగానికి అవకాశం ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. గంజాయి గుర్తింపునకు ఉపయోగపడే అత్యాధునిక 4000 గంజాయి టెస్టింగ్ కిట్లు ప్రస్తుతం జిల్లా పోలీసు శాఖకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని ఎస్ఐలు, పోలీసు సిబ్బంది ఈ కిట్లను విధుల్లో భాగంగా వెంట తీసుకెళ్తూ అనుమానిత వ్యక్తులు లేదా పదార్థాలను అక్కడికక్కడే పరీక్షించి కేవలం 10 నిమిషాల్లో ఫలితాలు పొందగలరని చెప్పారు. దీంతో గంజాయి సేవిస్తున్న వారిని, గంజాయి కలిగి ఉన్న వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం మరింత సులభమవుతుందని తెలిపారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు బానిసైన వ్యక్తులు తిరిగి సాధారణ జీవితంలోకి రావడానికి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డీ-అడిక్షన్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. మత్తు పదార్థాల అలవాటు నుండి బయటపడాలనుకునే వారు లేదా వారి కుటుంబ సభ్యులు పోలీసులను సంప్రదిస్తే కౌన్సెలింగ్, వైద్య సహాయం మరియు సంబంధిత డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా పునరావాస సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యువతను వ్యసనాల బారినుంచి రక్షించడం కూడా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని అన్నారు. గంజాయి సేవించడం, నిల్వ ఉంచడం, విక్రయించడం లేదా రవాణా చేయడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని, ఇటువంటి కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠినమైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా గంజాయి విక్రయం, వినియోగం లేదా రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే 8712656999 నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా ఉంచాలని, గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం ప్రజలు, మీడియా ప్రతినిధులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించి మహబూబాబాద్ జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు భాగస్వాములు కావాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. గంజాయి నిర్మూలన కోసం జిల్లా పోలీసు శాఖ నిరంతరం కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ స్పష్టం చేశారు.

# మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి





**ఖమ్మం ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్ ):** మిషన్ భగీరథ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి ఐ ఎన్ టి యు సి రాష్ట్ర మిషన్ భగీరథ అధ్యక్షులు తలారి రాములు ఆధ్వర్యంలో నగర ఐ ఎన్ టి యు సి అధ్యక్షులు నరేష్ మోహన్ నాయుడు అధ్యక్షతన గురువారం స్థానిక మిషన్ భగీరథ సి సి ఆఫీసులో జరిగిన ధర్నా కార్యక్రమంలో కార్మికుల సమస్యలపై మాట్లాడుతూ మిషన్ భగీరథ కార్పొరేషన్ ద్వారా నే జీతాలను అందించాలని కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పెండింగ్లో ఉన్న జీతాలను ఇప్పించాలని ఏజెన్సీ లను రద్దు చేయాలని వారికి నేత భర్తల కాంట్రాక్టు ద్వారా అధికారులు కమిషన్ లు పొంది కేవలం సగటు మనిషి కి కల్పించాల్సిన వేతనాలను కూడా విస్మరిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కార్మికులు వాపోయారు. ప్రజా ప్రభుత్వంలో వారికి న్యాయం జరిగేలా ఐ ఎన్ టి యు సి జిల్లా మరియు రాష్ట్ర నాయకత్వం అడుగులు వేస్తుందని త్వరలోనే మంత్రి సీతక్క ని కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ భగీరథ అధ్యక్షులు వేల్పుల అనంత రాములు, ప్రధాన కార్యదర్శి అనుబోతు బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మధు సుధాన్ రెడ్డి, బొడ్ల నర్సింహారావు, కూతురు నాగేశ్వరరావు, జంగా నరసింహారావు, ఖాజా, రాజబాబు, ప్రసాద్ కారుమంచి, బమ్మ నరసింహారావు, ఏదునూరి సురేష్, తాళ్లూరి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ బడులు వద్దు.. ప్రభుత్వ బడులే ముద్దు

## ● బంచరాయితండలో మన ఊరు ● మనబడి బడిబాట కార్యక్రమం ● బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ బడుల్లోనే చేరాలి ● పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్04 (ది క్రైమ్ న్యూస్):-** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామంలో గురువారం "మన ఊరు -- మనబడి" బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్, ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు సురేష్, సర్పంచ్ కమ్లి పూల్యా, గ్రామ పెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ప్రస్తుతం నాణ్యమైన విద్యకు కేంద్రాలుగా మారాయని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం, రాగిజావ, డిజిటల్ విద్య, ఇంగ్లీష్ మీడియం బోధన వంటి సౌకర్యాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతి బడిఈడు పిల్లవాడు తప్పనిసరిగా పాఠశాలలో చేరి విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నాయని తెలిపారు. పాఠశాలలో విశాలమైన తరగతి గదులు, పరిశుభ్రమైన వాతావరణం, తాగునీటి సదుపాయం, గ్రంథాలయం, క్రీడా సామగ్రి, డిజిటల్ తరగతులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదివించేందుకు అప్పులు చేయాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య పూర్తిగా ఉచితంగా లభిస్తోందన్నారు. ఉపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే బలమైన పునాది అని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామంలోని ప్రతి బడిఈడు పిల్లవాడు పాఠశాలలో చేరేలా తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ విద్య ప్రాముఖ్యతపై నినాదాలు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ప్రత్యక్షంగా మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులు, సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో ప్రభుత్వ విద్య పట్ల మరింత అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి తండవాసులు తదితరులు పాల్గొన్నారు. "బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలి -- ప్రభుత్వ బడుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి" అనే సందేశంతో కార్యక్రమం ముగిసింది.

# ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల దోపిడీని అరికట్టాలి

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి
## ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ డిమాండ్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపి) పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తాగునీటి సమస్య, మరుగుదొడ్లు, ఫర్నిచర్ మరియు ఇతర విద్యా సౌకర్యాల లోపంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజునే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్లు మరియు ఇతర విద్యా సామగ్రి అందేలా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయని పేర్కొన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేసి, కార్పొరేట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు నిబంధనల ప్రకారం వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి జంగపల్లి అరవింద్, నగర ఉపాధ్యక్షుడు విగ్నేష్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్ కప్ సీజన్-1 క్రికెట్ టోర్నమెంట్ ఘన ప్రారంభం





**నల్గొండ, ప్రతినిధి, జూన్ 4(ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడలోని (ఎన్ఎస్పీ క్యాంప్ (గ్రౌండ్స్)లో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి "చైర్మన్ కప్ -- సీజన్ 1" క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మిర్యాలగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ , వైస్ చైర్‌పర్సన్ టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడం, క్రీడలను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ, పోటీల్లో పాల్గొంటున్న అన్ని జట్లకు ముఖ్య అతిథులు శుభాకాంక్షలు తెలిపారు. యువతకు క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, జట్టు భావనను పెంపొందిస్తాయని వారు పేర్కొన్నారు.

# సుబ్బారావు మృతి అత్యంత బాధాకరం: ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ





**నల్గొండ, ప్రతినిధి, జూన్ 4 (ది క్రైమ్ న్యూస్):** మానవ హక్కుల సంఘం నాయకులు శ్రీ సుబ్బారావు అనారోగ్యంతో మృతి చెందడం అత్యంత బాధాకరమని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పట్టణంలోని శాంతినగర్‌లోని సుబ్బారావు స్వగృహానికి చేరుకున్న వారు ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సుబ్బారావు సమాజ సేవలో విశేష కృషి చేసిన వ్యక్తి అని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. ఆయన సేవలను ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. సుబ్బారావు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, పలువురు నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఆర్ బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 9న జాబ్ మేళా నిర్వహణ

## జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు జూన్ 9 మంగళవారం రోజున జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ లిమిటెడ్ సంస్థలో 30 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, లోన్ ఆఫీసర్, కస్టమర్ రిలేషన్ అసోసియేట్, పోస్టులు పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల్, హుజరాబాద్, జనగాం, నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, నర్సంపేట్ ,పరకాల, మహబూబాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, బోధన్, ఇచ్చోడా ఆర్మూర్, నిర్మల్, ప్రాంతాలలో ఖాళీలు ఉన్నాయని తెలిపారు. విద్యార్హతలు ఇంటర్ ఆపై పూర్తి చేసినవారు ఫ్రెష్, పని అనుభవం కలిగిన అభ్యర్థులు అర్హులని, 19 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వయస్సు ఉండాలని, ఆసక్తి గల అభ్యర్థులు జూన్ 09 మంగళవారం రోజున ఉదయం 11 గంటలకు రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో పెద్దపల్లి లోని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం, మొదటి అంతస్తు, రూమ్ నెంబర్. 233, హాజరై తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8985336947, 8121262441 నెంబర్లను సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి పేర్కొన్నారు.

# బలమైన విద్యా పునాదితోనే లక్ష్యసాధన సాధ్యం

## ● సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



**కరీంనగర్ టౌన్ జూన్ 04(ది క్రైమ్ న్యూస్):** పాఠశాల స్థాయి నుంచే బలమైన విద్యా పునాదిని నిర్మించుకుంటేనే విద్యార్థులు తమ జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధించగలరని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విజయానికి క్రమశిక్షణ, సరైన మార్గదర్శకత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా విద్యార్థుల కోసం 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఎంతో ఉపయోగపడే ఫౌండేషన్ కోచింగ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన రెసోనెన్స్ విద్యా సంస్థల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు తమ మెదడుకు పదును పెట్టుకోవాలని సూచించారు. విద్యార్థుల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం పెరగడానికి ఉపయోగపడే ఐదు అద్భుతమైన సూత్రాలను ఆయన వివరించారు.ప్రతిరోజూ క్రమం తప్పకుండా 21 గుంజీలు తీయడం. వంద (100) నుండి ఒకటి (1) వరకు అంకెలను వెనక్కి లెక్కపెట్టడం." అక్షరం నుండి "ఊ" అక్షరం వరకు ఇంగ్లీష్ ఆల్ఫాబెట్స్ వెనక్కి చదవడం. ప్రతిరోజూ సుడోకు పజిల్స్ పూరించడం. విభిన్నమైన పజిల్స్‌ను సాధించడం (సాల్వ్ చేయడం).చిన్న దేశమైన సౌత్ కొరియా కేవలం ఈ సూత్రాలను పాటించడం వల్లే, నేడు నాలుగు ప్రపంచ స్థాయి ఉత్పత్తులతో అంతర్జాతీయ మార్కెట్‌ను శాసిస్తోందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.విద్యార్థులు తమ జీవితంలో ఉన్నత స్థానాలకు చేరడానికి మూడు ముఖ్యమైన లక్ష్యాలను నిర్దేశించుకోవాలని జేడీ పిలుపునిచ్చారు. కన్న తల్లిదండ్రులు గర్వపడేలా సమాజంలో ఎదగాలి. మీరు చదువుకున్న స్కూల్, కాలేజీలకు భవిష్యత్తులో ముఖ్య అతిథిగా వెళ్లే స్థాయికి చేరుకోవాలి.మీ చేతి సంతకమే ఇతరులకు 'ఆటోగ్రాఫ్'గా మారే విధంగా విజయం సాధించినప్పుడే భారతదేశం గర్వపడుతుంది. ఈ కార్యక్రమంలో రెసోనెన్స్ విద్యా సంస్థల ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప్పల్ స్వచ్ఛ గ్రామం కోసం ప్రజాప్రతినిధులు, యువత శ్రమదానం

● పర్యావరణ సంరక్షణ నిరంతర ఉద్యమం కావాలి ● ఉత్సాహంగా పాల్గొన్న ఉప్పల్ గ్రామ పంచాయతీ పాలకవర్గం






**కమలాపూర్ ( ది క్రైమ్ న్యూస్):** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని స్వచ్ఛ గ్రామం - సురక్షితమైన గాలి, నీరు కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మహిళలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శ్రమదానంలో భాగంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి జెండా ఏరియా వరకు అర కిలోమీటర్ పొడవునా ఉన్న ప్రధాన రహదారిని పూర్తిగా శుభ్రం చేశారు. రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన మురికిని, ప్లాస్టిక్ వ్యర్థాలను, పిచ్చిమొక్కలను ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు స్వచ్ఛందంగా తొలగించారు. మురుగు కాలువల్లో పూడికతీత చేపట్టి, నీరు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమ నాగరాజు ,ఉప సర్పంచ్ మేడిపల్లి సిద్ధార్థ, పంచాయతీ కార్యదర్శిలు మాట్లాడుతూ.... ఈ కార్యక్రమం మన నిత్య జీవితంలో భాగం కావాలని అన్నారు. ఇది నిరంతర పర్యావరణ సంరక్షణ ఉద్యమం అన్నారు. కాగా గ్రామపంచాయతీ పాలకవర్గం చేపట్టిన ఈ కార్యక్రమం పై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బైరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ మేడిపల్లి సిధార్థ , వార్డు సభ్యులు మోతె రాజేష్, సముద్రాల సదయ్య, మేడిపల్లి రమేష్, వెంగల రవీందర్, పసునూటి రాణా ప్రతాప్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూసల గణేష్, యువకులు, మహిళలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ మురుగునీటి కాలువ పనులను పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** మాదాపూర్ డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్ కాలనీలో రూ.38 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న భూగర్భ మురుగునీటి కాలువ (యూజీడీ) నిర్మాణ పనులను గురువారం పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జలమండలి, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ కాలనీలో కొనసాగుతున్న భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. హనుమాన్ నగర్ కాలనీలో నెలకొన్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. అలాగే నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, పనుల కారణంగా ప్రజలు, కాలనీవాసులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భూగర్భ మురుగునీటి కాలువ పనులు పూర్తయిన అనంతరం రహదారి నిర్మాణ పనులను ప్రారంభించి ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేసిన ఆయన, కాలనీవాసులు ఎదుర్కొనే ఏ సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఉప ప్రధాన నిర్వాహక అధికారి నరేందర్, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ దుర్గ ప్రసాద్, సహాయ ఇంజనీర్ సరిత, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బీఎల్ఆర్ బ్రదర్స్ ఈశ్వర బంధం ద్వారా 1000 మందికి భోజనాల పంపిణీ





**నల్గొండ, ప్రతినిధి, జూన్ 4 (ది క్రైమ్ న్యూస్):** మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని పలువురు కుటుంబాల్లో ఇటీవల సంభవించిన మరణాల నేపథ్యంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బీఎల్ఆర్ బ్రదర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈశ్వర బంధం కార్యక్రమంలో భాగంగా ఆయా కుటుంబాల బంధుమిత్రులు, గ్రామస్థులకు కలిపి 1000 మందికి భోజనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన స్వర్గీయ నీతినేటి వెంకయ్య, అన్నారం గ్రామానికి చెందిన స్వర్గీయ పూసపాటి మహేష్, వేములపల్లి మండలం ముల్కపట్నం గ్రామానికి చెందిన స్వర్గీయ ఎలిజర్ల నరసమ్మ, మాడ్గులపల్లి మండలం పోరెడ్డిగూడెం గ్రామానికి చెందిన స్వర్గీయ అండేం సైదులు, అలాగే మిర్యాలగూడ పట్టణంలోని 40వ వార్డు శాంతినగర్‌కు చెందిన స్వర్గీయ గంజి జయం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ సభ్యులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యం: ఎంఈఓ రాము...





**నల్గొండ, ప్రతినిధి, జూన్ 4 (ది క్రైమ్ న్యూస్):** నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని పెద్దవూర మండలం తిప్పలమడుగు గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. "మన ఊరు -- మన బడి" నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్దవూర మండల విద్యాధికారి (ఎంఈఓ) రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, ఇతర విద్యా సదుపాయాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. అదేవిధంగా తిప్పలమడుగు గ్రామంలో నూతన పాఠశాల ఏర్పాటు విషయమై ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే మంజూరు చేయించేలా కృషి చేస్తానని ఎంఈఓ రాము హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ, ఉపాధ్యాయులు అమల, సీఆర్పీ శంకర్ యాదవ్, ఉపసర్పంచ్ తరి నాగయ్య, గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ పేపర్ లీక్ ఘటనపై కేంద్ర విద్యాశాఖ మంత్రికి రాజీనామా డిమాండ్



**నల్గొండ, ప్రతినిధి, జూన్ 4(ది క్రైమ్ న్యూస్):** నీట్ పరీక్ష పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోజ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 6న నిర్వహించనున్న శాంతియుత నిరసన కార్యక్రమానికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, విద్యా వ్యవస్థ పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కుల సాధన కోసం చేపడుతున్న ఈ ఆందోళన విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. నీట్ పేపర్ లీక్ వంటి ఘటనలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తాయని, ఇటువంటి సంఘటనలపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. జూన్ 6న నిర్వహించే ధర్నాలో పాల్గొనే నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలకు బీసీ జేఏసీ తరఫున సంఘీభావం ప్రకటిస్తూ, ఈ నిరసన కార్యక్రమం శాంతియుతంగా విజయవంతం కావాలని జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు.

# నూతన మున్సిపల్ కమిషనర్ తాన్యాను కలిసిన కిష్టయ్యపల్లి యువకులు



**పటాన్చెరు(గడ్డపోతారం), జూన్ 04(ది క్రైమ్ న్యూస్):** గడ్డపోతారం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తాన్యా మేడంను కిష్టయ్యపల్లి గ్రామానికి చెందిన యువకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, మున్సిపాలిటీ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. అలాగే గ్రామ సమస్యలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై తమ అభిప్రాయాలను తెలియజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కే. నాగేష్, కే. మల్లికార్జున్, బి. గణేష్, కే.శ్రీకాంత్, కే.విజయ్, కే.సోనూ, ఎం.కృష్ణ తదితరులుఉన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ తాన్యా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# క్రీడాకారుల కల సాకారం చేసిన సాయి భరత్

- శివాజీ గ్రౌండ్‌లో సిమెంట్ పిచ్ ఏర్పాటు - సాయి భరత్‌కు క్రీడాకారులు అభినందనలు



**పటాన్చెరు(గడ్డపోతారం),జూన్ 04(ది క్రైమ్ న్యూస్ ):** ఎన్నో రోజులుగా మట్టి పిచ్‌పై ఆడుతూ సరైన బౌన్స్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న క్రీడాకారుల సమస్యను గుర్తించిన నవ,యువ సామాజిక సేవకుడు పులిగిల్ల సాయి భరత్, గడ్డపోతారం ఛత్రపతి శివాజీ క్రికెట్ గ్రౌండ్‌లో తన స్వంత నిధులు రూ.50 వేల వ్యయంతో సిమెంట్ పిచ్‌ను ఏర్పాటు చేయించారు. మట్టి పిచ్ కారణంగా ఆటగాళ్లు తమ ప్రతిభను పూర్తిస్థాయిలో ప్రదర్శించలేకపోతున్నారని గమనించిన సాయి భరత్, క్రీడాకారుల అవసరాన్ని వెంటనే గుర్తించి ఈ సదుపాయాన్ని కల్పించారు. కొత్త సిమెంట్ పిచ్‌తో ఆట నాణ్యత మెరుగుపడటమే కాకుండా యువ క్రికెటర్లకు మెరుగైన శిక్షణ, పోటీలకు అనుకూల వాతావరణం ఏర్పడనుంది. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులు, యువకులు మాట్లాడుతూ తమ సమస్యను అర్థం చేసుకుని వెంటనే స్పందించి సిమెంట్ పిచ్ ఏర్పాటు చేసిన పులిగిల్ల సాయి భరత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రీడల అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు.

# 'గో టు విలేజ్' విద్య ప్రాధాన్యత పై నేతల పిలుపు

- జెండా గద్దె నిర్మాణానికి సహకారం: దండు వరలక్ష్మి





**కరీంనగర్ టౌన్, జూన్04(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం అన్నారం, లలితపూర్, రంగపేట, గట్టే పల్లి గ్రామంలో బుధవారం రోజున ఉదయం గో టు విలేజ్ ' కార్యక్రమం నిర్వహించి గ్రామ కమిటినీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి విద్యార్థి తప్పనిసరిగా పాఠశాలకు వెళ్లేలా తల్లితండులకు అవగాహన కల్పించారు. విద్యే పిల్లల భవిష్యత్తు కు బలమైన పునాది అని నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమన్ని కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎలక్కపెల్లి పౌలు ఆధ్వర్యం లో నిర్వహించారు. ముఖ్య అతిథి గా మహిళా ఎమ్మార్పీఎస్ ఎంఎంఎస్ కన్వీనర్ దండు వరలక్ష్మి మాదిగ పాల్గొనారు. గ్రామ అభివృద్ధి, విద్యా ప్రాధాన్యతపై ఆమె మాట్లాడారు. అలాగే అన్నారం గ్రామంలో పౌలు అధ్యర్యంలో జెండా గద్దె నిర్మాణానికి సహకారం అందిస్తామని వరలక్ష్మి మాదిగ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ మహిళలు అంజలి, లావణ్య, పద్మ, దేవకీ తది తరులు పాల్గొన్నారు

# సంక్షేమం, అభివృద్ధి ప్రధాన లక్ష్యం

## ● పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రధాన లక్ష్యమని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. గురువారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ్ నగర్, హనీఫ్ కాలనీలలో రూ.75 లక్షల అంచనా వ్యయంతో చేపడుతున్న భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్, జలమండలి అధికారులు, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ మార్తాండ్ నగర్, హనీఫ్ కాలనీలలో కొనసాగుతున్న భూగర్భ మురుగునీటి కాలువ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కాలనీలలో ఎన్నో రోజులుగా నెలకొన్న డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పనుల కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భూగర్భ మురుగునీటి కాలువ పనులు పూర్తయిన అనంతరం రహదారి అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సదుపాయం కల్పించాలని అధికారులకు సూచించారు. పనుల నాణ్యత, వేగంపై పలు సూచనలు చేసిన ఆయన, కాలనీవాసులు ఎదుర్కొనే ఏ చిన్న సమస్యనైనా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి కార్యనిర్వాహక సంచాలకుడు మండల సంతోష్ రెడ్డి, ఉప ప్రధాన నిర్వాహక అధికారి శ్రీహరి, మేనేజర్ సందీప్, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ ఆనంద్, సహాయ ఇంజనీర్ భాస్కర్, నాయకులు తిరుపతి, రజనీకాంత్, అక్షయ్, శారద, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన కార్పొరేషన్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు ఘన సన్మాన కార్యక్రమం



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** సొసైటీ ఫర్ పొలిటికల్ ఎంపవర్మెంట్ విత్ యాక్షన్ నాలెడ్జ్ (స్పీక్) ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా నియమితులైన వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు గురువారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ విశ్వేశ్వర భవన్‌లో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్పీక్ చీఫ్ అడ్వైజర్ అన్నే సత్యనారాయణ, ఆహ్వాన కమిటీ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు, ప్రధాన కార్యదర్శి మారిశెట్టి మురళీకుమార్ పాల్గొన్న ఈ కార్యక్రమానికి స్పీక్ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ గోపాలం విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మశాలి కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, తెలంగాణ బట్టరాజ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ సీహెచ్ బాలరాజు, తెలంగాణ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, వాషర్‌మెన్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ దాసరి రాజు అజయ్ కుమార్, పెరిక కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, మేర కో-ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ సంఘ వెంకట్రాజం, మున్నూరు కాపు కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, యాదవ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం. రఘునాథ్ యాదవ్, వడ్డెర కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక నారాయణ, తెలంగాణ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దూదేం వెంకటరమణ, కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ బండి రమేష్‌లను ఘనంగా సన్మానించారు. అలాగే బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్, పెరిక కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్, మేర కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ ఎం. లక్ష్మీనారాయణ, వాల్మీకి బోయ నగేష్, మున్నూరు కాపు కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అల్లం భాస్కర్, యాదవ్ కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ గజ్జి భాస్కర్ యాదవ్, వడ్డెర కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ బత్తుల వెంకటేష్, తెలంగాణ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ జక్కారి అనిత, కమ్మ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ చైర్మన్ పరుచూరి మురళిలను సైతం సన్మానించారు. ఈ సందర్భంగా స్పీక్ అధ్యక్షులు డాక్టర్ గోపాలం విద్యాసాగర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సమాజాభివృద్ధికి దోహదపడే అనేక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆహ్వాన కమిటీ చైర్మన్ అట్టేపల్లి రామప్రభు మాట్లాడుతూ నూతనంగా నియమితులైన చైర్మన్లు, వైస్ చైర్మన్లను సన్మానించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. వారు తమ తమ సామాజిక వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన చైర్మన్లు, వైస్ చైర్మన్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్పీక్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# తులసి నీళ్లు రోజూ తాగితే అమృతం తాగినట్లే..!

## అందం, ఆరోగ్యంతో పాటు బోలెడు ప్రయోజనాలు!



యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబయల్ లక్షణాలు నిండివున్న తులసి రోగనిరోధక వ్యవస్థను పునరుద్ధరించడానికి, ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడుతుంది. ఈ వేడి సీజన్‌లో తులసి నీటిని తాగడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయం టున్నారు ఆరోగ్య నిపుణులు. ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల జీర్ణ సమస్యలు, కడుపునొప్పి, గ్యాస్, అసిడిటీ వంటి అసౌకర్యాల నుండి ఉపశమనం పొందవచ్చు. ఈ పానీయం శరీరాన్ని శుభ్రపరచడంలో, ఆరోగ్యకరమైన జీర్ణ ప్రక్రియను ప్రారంభించడంలో సహాయపడుతుంది. దాని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్ లక్షణాలతో, తులసి నీరు దగ్గు, జలుబు లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. శ్వాసకోశ ఆరోగ్యాన్ని సమర్థవంతంగా బలోపేతం చేస్తుంది. తులసి ఆకులు సహజమైన డిటాక్సిఫైయర్. ఉదయాన్నే పరగడుపున తులసి నీటిని తాగడం వల్ల డిటాక్సిఫికేషన్ జరుగుతుంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో తులసి నీటిని తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్, క్రిములు బయటకు వెళ్లిపోతాయి. జీర్ణ సంబంధ వ్యాధులు దూరంగా ఉంటాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మ ఆరోగ్యానికి కూడా సహాయపడుతుంది. ఇందులోని యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు చర్మ పరిస్థితులకు చికిత్స చేయడానికి ఉపయోగపడతాయి. తులసి నీటిని తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. తులసి నీరు కార్టిసాల్ హార్మోన్ స్థాయిలను నిర్వహించడానికి సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇది శరీరంలో ఒత్తిడిని కలిగించే ఒత్తిడి హార్మోన్ అని కూడా పిలుస్తారు. తులసి నీటిని తాగడం వల్ల కార్టిసాల్ స్థాయిలు తగ్గుతాయి. అలాగే మీరు ఒత్తిడి లేకుండా ఉండేందుకు సహాయపడుతుంది.

## తెల్లగా ఉన్నాయ్ ఇవేం చేస్తాయిలే అనుకునేరు.. ఆ సమస్యలకు దివ్యౌషధం..



ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదంటారు.. ఎందుకంటే.. ఉల్లిపాయల్లో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే, ఉల్లిపాయను ఆరోగ్యానికి నిధిగా భావిస్తారు.. వాస్తవానికి ఉల్లిపాయలు లేకుండా ఏ కూరగాయల రుచి కూడా బాగుండదు.. సాధ్యమైనంత మేరకు ఉల్లి లేకుండా కూరనే వండరు.. అందుకే.. ఏదిఏమైనప్పటికీ.. ఇంట్లో ఉల్లి ఉండాల్సిందే.. ఇంకా ఉల్లిపాయను సలాడ్‌లో కూడా ఉపయోగిస్తారు. వాస్తవానికి అందరి ఇళ్లల్లో ఎర్ర ఉల్లిపాయను ఉపయోగిస్తుంటారు.. ఎర్ర ఉల్లిపాయల వలే తెల్ల ఉల్లిపాయల్లో కూడా ఎన్నో పోషకాలు దాగున్నాయి. తెల్ల ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకోండి.. తెల్ల ఉల్లిపాయలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు.. జీర్ణవ్యవస్థ బలపడుతుంది : తెల్ల ఉల్లిపాయ అనేక సమస్యలను దూరం చేస్తుంది. ఈ ఉల్లిపాయను తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థను బలంగా ఉంచుతుంది. ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణ ఆరోగ్యాన్ని బలపరుస్తుంది. ఇది కాకుండా, ఉల్లిపాయలో ప్రీబయోటిక్ ఉంటుంది. ఇది పొట్టను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. జుట్టు సమస్యలు దూరం: తెల్ల ఉల్లిపాయ మీ జుట్టుకు చాలా మేలు చేస్తుంది. మీకు చుండ్రు సమస్య ఉంటే తెల్ల ఉల్లిపాయ రసాన్ని వినియోగించాలి. రసాన్ని తలపై అప్లై చేసి కొంత సేపటి తర్వాత తలను శుభ్రం చేసుకోవాలి. ఇంకా తెల్ల జుట్టు సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు ప్రతిరోజూ తెల్ల ఉల్లిపాయలను తింటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. కొలెస్ట్రాల్ తగ్గుతుంది: తెల్ల ఉల్లిపాయలో చాలా పోషకాలు ఉన్నాయి. ఇవి మీ శరీరం నుంచి చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించడంలో సహాయపడతాయి. మీకు కూడా చెడు కొలెస్ట్రాల్ సమస్య కూడా ఉంటే, మీరు ప్రతిరోజూ తెల్ల ఉల్లిపాయలను తినడం ప్రారంభించాలి. ఇది మీ కొలెస్ట్రాల్‌ను నియంత్రిస్తుంది. గుండెకు మేలు చేస్తుంది: తెల్ల ఉల్లిపాయను తీసుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీలు ఉన్నాయి.. ఇది మీ రక్తపోటును పెరగకుండా చేస్తుంది.. ఇంకా రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తుంది. అందువల్ల, మీకు గుండె సంబంధిత సమస్యలు ఉంటే, మీరు తెల్ల ఉల్లిపాయలను తీసుకోవడం మంచిదని పేర్కొంటున్నారు.

## కేవలం రూ.20తో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి బయటపడొచ్చు.. ఎలాగో తెలుసా?



శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగినప్పుడు రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయదు. దీంతో రకరకాల సమస్యలు మొదలవుతాయి. యూరిక్ యాసిడ్ స్ఫటికాలుగా మారి వేళ్ల కీళ్లలో ఇరుక్కుపోయి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి. అంతేకాకుండా దీని వల్ల అనేక ఇతర సమస్యలు తలెత్తుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో శరీరం నుంచి యూరిక్ యాసిడ్‌ను తొలగించడానికి కొన్ని ఆహార అలవాట్లు మార్చుకుంటే ఈ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. యూరిక్ యాసిడ్‌ను తగ్గించగల 5 ప్రభావవంతమైన హోమ్ రెమెడీస్ ఇవే.. ఉసిరికాయలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో ఇన్‌ఫ్లమేటరీని నివారించడమే కాకుండా, ఆక్సీకరణ ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది. ఇది యూరిక్ యాసిడ్ స్థాయిని కూడా తగ్గిస్తుంది. కాబట్టి ప్రతి రోజూ కనీసం ఒక ఉసిరికాయను తినడం అలవాటు చేసుకోవాలి. ఎండిన కొత్తిమీర ఆకులు శరీరం నుంచి యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో సహాయపడతాయి. కొత్తిమీర ఆకుల్లో యూరిక్ యాసిడ్ ను మూత్రంతో తొలగించే గుణాలు ఉంటాయి. యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగిన వ్యక్తులు కొత్తిమీర టీ లేదా కొత్తిమీర నీటిని తీసుకుంటే మంచిది. యూరిక్ యాసిడ్ స్ఫటికాలను తొలగించడంలో వేప ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది. వేపలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇది వాపును తగ్గిస్తుంది. అలాగే యూరిక్ యాసిడ్ సమస్యను నయం చేస్తుంది. వేప శరీరం మొత్తం నిర్విషీకరణలో కూడా బాగా పనిచేస్తుంది. రోజువారీ ఆహారంలో చేపలు తినడం వల్ల యూరిక్ యాసిడ్ స్థాయిలు తగ్గించుకోవచ్చు. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు వాపును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి మూత్రపిండాలు సరిగ్గా పనిచేయడానికి కూడా సహాయపడుతుంది. దీని కారణంగా టాక్సిన్స్ తొలగిపోతాయి. ఫలితంగా యూరిక్ యాసిడ్ శరీరం నుంచి సులభంగా బయటికి పోతుంది. ఆయుర్వేదంలో కరక్కాయ (మైరోబాలన్)కు ప్రత్యేక స్థానం ఉంది. ఇందులో నిర్విషీకరణ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలోని టాక్సిన్స్, యూరిక్ యాసిడ్‌లను సులువుగా బయటకు పంపుతుంది. మైరోబాలన్ తీసుకోవడం జీర్ణక్రియకు కూడా మంచిది. దీని సహాయంతో యూరిక్ యాసిడ్ సమస్య నుంచి తేలికగా బయటపడొచ్చు. అలాగే గట్ సమస్యలు కూడా నయమవుతాయి.

# ఏసీబీ చిక్కిన మరో తిమింగళం...

## రెడ్ హ్యాండెడ్‌గా దొరికిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్..



**జగిత్యాల, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా చొప్పదండి నియోజకవర్గం కొడిమ్యాల మండలంలో ఏసీబీ (అవినీతి నిరోధకశాఖ) అధికారులు దాడి చేసారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ ర్ ఓ )గులాం మొయినుద్దీన్, బాధితుడి నుండి రూ. 80,000 లంచం తీసుకుంటుండగా కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ?కేసు పూర్తి వివరాలు. గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన పవర్ ఆఫ్ అటార్నీ ఉన్న పట్టా భూమిలోని 120 చెట్లను నరికి, రవాణా చేయడానికి అనుమతి (పర్మిషన్) కోరాడు. ఈ అనుమతి కోసం ఎఫ్ఆర్ఓ) గూలం మొయినుద్దీన్ మొత్తం రూ. 2 లక్షలు లంచం డిమాండ్ చేశాడు.?అడ్వాన్స్: బాధితుడు ఇదివరకే రూ. 1 లక్ష చెల్లించాడు. మిగిలిన మొత్తంలో రూ. 80,000 వెంటనే ఇవ్వాలని అధికారి ఒత్తిడి తెచ్చాడు. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు పక్కా స్కెచ్ వేసి, గురువారం ఫారెస్ట్ కార్యాలయంలోనే రూ. 80,000 తీసుకుంటుండగా అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ అధికారులు కొడిమ్యాల అటవీ కార్యాలయాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని, పలు కీలక రికార్డులు, పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పూర్తి వివరాలతో ప్రత్యేక కోర్టులో హాజరు పరచనున్నారు. ప్రభుత్వ అనుమతుల కోసం ఒక అధికారి ఇంత పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేసి దొరికిపోవడం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది...

## చామదుంపలో ఉండే ఈ గుణం గుండె జబ్బులు రాకుండా అడ్డుకుంటుంది..! డయబెటీస్‌కు బెస్ట్ ఫుడ్..!!

విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ ఇ, విటమిన్ బి 6, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ వంటి అనేక ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్న చామదుంపలు చాలా ఇళ్లలో ఇష్టంగా తింటారు. దాని రుచిని ఇష్టపడని వారు కూడా ఉన్నారు. మీరు కూడా అలాంటి వారిలో ఒకరైతే, ఈ రోజు మేము దాని ప్రయోజనాలను మీకు తెలియజేస్తాము. ఇది తెలిసిన తర్వాత మీరు తప్పక మీ ఆహారంలో భాగంగా చేర్చుకుంటారు. వేసవిలో బలహీనమైన రోగనిరోధక శక్తిని పెంచడంలో, అనేక శరీర సమస్యల నుండి ఉపశమనం పొందడంలో చామగడ్డను తినడం ఎలా ఉపయోగపడుతుందో తెలుసుకుందాం. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.. చామగడ్డలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. కాబట్టి దీని వినియోగం శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. ఎక్కువ ఫైబర్ తినడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుందని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. మొత్తంమీద, దీనిని తినడం వల్ల మీ మొత్తం గుండె ఆరోగ్యానికి ప్రయోజనం చేకూరుతుంది. బరువు తగ్గడంలో ప్రయోజనకరంగా ఉంటుంది.. ఊబకాయంతో బాధపడేవారికి చామదుంపలు తీసుకోవడం చాలా ప్రయోజనకరంగా పనిచేస్తుంది. వేసవిలో దీనిని తినడం వల్ల జీర్ణక్రియ మందగిస్తుంది. అటువంటి పరిస్థితిలో మీకు ఎక్కువసేపు ఆకలి అనిపించదు. అదనపు కేలరీలను తీసుకోకుండా మిమ్మల్ని మీరు ఆపుకోగలుగుతారు. దీని ప్రభావం బరువులో కనిపిస్తుంది. ఈ విధంగా చామగడ్డను మీ ఆహారంలో భాగం చేసుకోవటం వల్ల బరువు తగ్గడానికి చాలా మంచిది. కళ్లకు మేలు చేస్తుంది.. బీటా-కెరోటిన్, క్రిప్టోక్సాంటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నందున చామగడ్డ తీసుకోవడం వల్ల మీ కళ్ళు ఆరోగ్యంగా ఉంటాయి. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రెటీనా దెబ్బతినకుండా కాపాడతాయి. కంటిశుక్లం ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి. అటువంటి పరిస్థితిలో చిన్న వయస్సులోనే కంటి సంబంధిత సమస్యలు మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం ప్రారంభించినట్లయితే, ఆహారంలో చామగడ్డను తరచుగా చేర్చుకోవడం మంచిది. కండరాలు, ఎముకలకు మేలు చేస్తుంది. చామదుంప రెగ్యులర్ వినియోగం కండరాలు, ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది . ఐరన్, కాపర్, మెగ్నీషియం, జింక్ వంటి అనేక పోషకాలుఈ కూరగాయలలో ఉన్నాయి. ఇది ఎముకల ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంతో పాటు, క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతాయి.. చాలా మంది ప్రజలు వేసవిలో తక్కువ రోగనిరోధక శక్తితో పోరాడుతున్నారు. అటువంటి పరిస్థితిలో చామదుంపను రెగ్యూలర్‌గా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. సీజన్‌తో పాటు పెరిగే ఇన్‌ఫెక్షన్లతో పోరాడడంలో శరీరానికి సహాయపడుతుంది. దీని వినియోగం విటమిన్ సి లోపాన్ని కూడా తొలగిస్తుంది. ఇది ఫ్రీ రాడికల్ డ్యామేజ్ నుండి మిమ్మల్ని రక్షిస్తుంది.

## అలర్ట్.. డయాబెటిస్‌ను కంట్రోల్ చేసే ఏడు సూత్రాలు.. ఇలా చేస్తే 400 ఉన్న షుగర్ 100కు రావడం ఖాయం..



ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడం చాలా ముఖ్యం. హార్మోన్ల కారణంగా దీర్ఘకాలిక వ్యాధులు మీ శరీరంలో వేళ్లూనుకునే అవకాశం ఉంది. ఉదాహరణకు, థైరాయిడ్ హార్మోన్లలో హెచ్చుతగ్గులు హైపో లేదా హైపర్ థైరాయిడిజానికి దారితీస్తాయి. అదేవిధంగా, ఇన్సులిన్ అనే హార్మోన్ ఉత్పత్తి కాకపోయినా లేదా సరిగ్గా పని చేయకపోయినా, రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణంగా ఉండవు. చాలా సందర్భాలలో, చక్కెర స్థాయి పెరుగుతుంది. దీనివల్ల మధుమేహం, ప్రీ-డయాబెటిస్, టైప్-2 మధుమేహం వంటి సమస్యలు వస్తాయి. మధుమేహంతో పాటు, ఇన్సులిన్ నిరోధకత కొలెస్ట్రాల్ స్థాయిలు, థైరాయిడ్ పనితీరు, రక్తపోటును కూడా ప్రభావితం చేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆహారం ద్వారా ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలను నిర్వహించవచ్చు.. అలాంటి ఆహార పదార్థాలు ఏంటో తెలుసుకోండి.. ఏడు సూత్రాలతో డయాబెటిస్‌కు చెక్.. మెంతులు దనియాల నీరు: మెంతులు, దనియాల నీటిని రోజూ తీసుకోవడం వల్ల ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలు అదుపులో ఉంటాయి. 1/2 టీస్పూన్ మెంతి గింజలు, 1 టీస్పూన్ దనియాలను ఒక గ్లాసు నీటిలో వేసి మరిగించి తాగండి.. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను కూడా అదుపులో ఉంచుతుంది. గుండెల్లో మంటగా ఉన్నా.. అజీర్ణంతో బాధపడుతున్నా ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగడం వల్ల చాలా మేలు జరుగుతుంది. ఉసిరి అలోవెరా జ్యూస్: ఉసిరి, కలబంద రెండూ ఇన్సులిన్ నిరోధక సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఈ పానీయంలో విటమిన్ సి ఉంటుంది. ఇది ఇన్సులిన్ ఉత్పత్తి, పనితీరును నిర్వహించడానికి సహాయపడుతుంది. ఈ పానీయం రక్తంలోని అదనపు గ్లూకోజ్‌ను గ్రహిస్తుంది. సరైన పద్ధతిలో ఆహారాన్ని తినండి: ఆహారంలో సరైన మొత్తంలో ఫైబర్, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు ఉండాలి. రోజు ప్రారంభంలో ఫైబర్ తీసుకోండి. ఆ తర్వాత ప్రోటీన్.. చివరకు పిండి పదార్థాలు లాంటివి తీసుకోవాలి.. శరీరంలో ప్రొటీన్ల లోపాన్ని తీర్చడానికి గుడ్లు, చికెన్, బాదం, కాజు, పప్పులు వంటివి తినండి.. ఇటువంటి ఆహారాలు ఇన్సులిన్ హార్మోన్ ప్రభావాన్ని పెంచుతాయి. రోజులో ఏదైనా భోజనంలో ప్రొటీన్ తప్పనిసరిగా ఉండాలి. అప్పుడే బ్లడ్ షుగర్ లెవెల్ మెయింటెయిన్ అవుతుంది. దాల్చిన చెక్క నీరు:దాల్చిన చెక్కఇన్సులిన్ నిరోధకత..రక్తంలోచక్కెర స్థాయిలను నియంత్రించడంలో గ్రేట్ గా పనిచేస్తుంది.ఈ మసాలాలో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు శరీరంలో మంటను తగ్గిస్తాయి. దాల్చిన చెక్క పొడిని వేడి నీటిలో మరిగించి తాగాలి..రోజులో ఏదో ఒకపూట ఈ డ్రింక్ తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. పుష్కలంగా నీరు త్రాగండి: ఇన్సులిన్ హార్మోన్ స్థాయిలను నిర్వహించడానికి..వ్యాధి ప్రమాదాన్ని తగ్గించడానికి పుష్కలంగా నీరు త్రాగాలి. రోజంతా 3-4 లీటర్ల నీరు త్రాగాలి..దీనివల్ల హైడ్రేట్‌గా కూడా ఉంటాం..రాత్రి భోజనం తర్వాత నడవండి: రాత్రి భోజనం చేసిన తర్వాత పడుకోకండి. రాత్రి భోజనం తర్వాత కనీసం 15 నుంచి 30 నిమిషాల పాటు నడవండి. ఇది ఆహారాన్ని జీర్ణం చేస్తుంది.. వ్యాధి ప్రమాదాన్ని నివారిస్తుంది. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు కూడా అదుపులో ఉంటాయి.

# విశ్వజ



## ప్రతిరోజు చల్లటి నీటితో స్నానం చేస్తే ఏమవుతుంది? మంచిదేనా!!

చాలామంది వర్షాకాలం, శీతాకాలంలో వేడి నీళ్లతో స్నానం చేస్తారు. ఇక ఎండాకాలం వచ్చిందంటే ఉష్ణ తాపాన్ని తట్టుకోలేక చన్నీళ్ళతో స్నానం చేస్తూ ఉంటారు. ఎండాకాలంలో ప్రతిరోజు చన్నీళ్ళతో స్నానం చేస్తే ఏమవుతుంది? స్నానం చేయడం మంచిదేనా? చన్నీళ్ళ స్నానం వలన జుట్టు ఊడిపోతుందా? ఏమైనా అనారోగ్యాలు వస్తాయా? వంటి వివరాలను ప్రస్తుతం మనం తెలుసుకుందాం. చన్నీటి స్నానం వలన ఏం జరుగుతుందంటే వేసవికాలంలో చన్నీళ్ళతో స్నానం చేయడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, ప్రతిరోజు చన్నీళ్ల స్నానం చేయడం ఎంతో మంచిదని చెబుతున్నారు వైద్యనిపుణులు. చల్లటి నీటిలో స్నానం చేయడం వల్ల శరీరంలో ఉండే వాపులు, కండరాల నొప్పులు తగ్గుతాయని, రక్త ప్రసరణ మెరుగు పడుతుందని చెబుతున్నారు. అంతేకాదు మానసిక ఒత్తిడి కూడా తగ్గుతుందని, ఫలితంగా ఆరోగ్యంగా ఉంటామని చెబుతున్నారు వైద్యనిపుణులు. చన్నీటి స్నానంతో డిప్రెషన్ నుండి రిలాక్స్ చన్నీళ్ల స్నానం చేస్తే ఏదో జరిగిపోతుందన్న అపోహ వద్దని, చన్నీళ్ల స్నానం చేయడం వల్ల నాడీ వ్యవస్థ ప్రేరేపితం అవుతుందని చెబుతున్నారు. ఇది శరీరానికి కావలసిన శక్తిని ఇస్తుందని సూచిస్తున్నారు. వేసవిలో చన్నీళ్ళ స్నానం ఒత్తిడి కలిగించే హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తుందని సూచిస్తున్నారు. ఐదు నిమిషాల పాటు చన్నీటి స్నానం చేయడం వల్ల డిప్రెషన్ నుంచి ఉపశమనం లభిస్తుంది . ఇది ఫీల్ గుడ్ ఎండార్ఫిన్ హార్మోన్ ఉత్పత్తిని పెంచుతుంది. వ్యాధి నిరోధక శక్తి కోసం చన్నీటి స్నానం చన్నీటి స్నానం చేయడం వల్ల మన హృదయ స్పందన రేటు కరెక్ట్ గా మారుతుందని, రక్తపోటు తగ్గుతుందని, ఆక్సిజన్ సక్రమంగా తీసుకోగలమని చెబుతున్నారు. మన శరీరంలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, వేసవిలో రోజు చన్నీళ్ళతో స్నానం చేస్తే ఎంతో మంచిదని సూచిస్తున్నారు. చర్మం, జుట్టుకు చన్నీటి స్నానం మేలు చల్లని నీళ్లతో స్నానం చేయడం వల్ల శరీరంలోని ల్యూకోసైట్లు ప్రేరేపితం అవుతాయి. ఇవి మనల్ని సాధారణ అనారోగ్యాల నుండి కాపాడతాయి. చన్నీటి స్నానం చేయడం వల్ల చర్మ రంధ్రాలను బిగుతుగా చేసి ఆయిల్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. చర్మాన్ని, జుట్టు పొడిబారకుండా కాపాడుతుంది.

## నాసా ఏరో స్పేస్ ఇంజనీర్‌గా తొలి భారతీయ యువతి!







అమెరికాలోని నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్)లో ఉద్యోగం... ఈ కల చాలా మందికే ఉండి ఉంటుంది. ఈ కలను సాకారం చేసుకున్న తొలి భారతీయ యువతి అక్షత కృష్ణమూర్తి. నాసా అనగానే మనకు అంతరిక్షంలోకి వెళ్లి గ్రహాలను అధ్యయనం చేసిన రాకేశ్ శర్మ గుర్తు వస్తారు. అలాగే కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ కూడా గుర్తుకు వస్తారు. కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ ఇద్దరూ భారతీయ సంతతికి చెందిన వారే కానీ భారత పౌరసత్వం ఉన్న వాళ్లు కాదు. అమెరికా పౌరసత్వమే వారి అంతరిక్ష పథాన్ని సుగమం చేసింది. ఇక అక్షత విషయానికి వస్తే... ఆకాశానికి ఆవల బెంగళూరుకు చెందిన అక్షతా కృష్ణమూర్తికి చిన్నప్పటి నుంచి ఆకాశానికి ఆవల ఏముంటుంది అనే ఆలోచనే. ఆమె బాల్యం ఆకాశంలో నక్షత్రాలను చూడడంతో, చుక్కల్లో చందమామ వెలుగుతో సంతృప్తి చెందలేదు. అంతరిక్షం అంటే మనకు కనిపించేది మాత్రమే కాదు, ఇంకా ఏదో ఉంది, అదేంటో తెలుసుకోవాలనే ఆసక్తి ఉండేది. బాల్యంలో మొదలైన ఆసక్తిని పెద్దయ్యేవరకు కొనసాగించింది. తన పయనాన్ని అంతరిక్షం వైపుగా సాగాలని కోరుకుంది. అందుకోసం తీవ్రంగా శ్రమించింది, నేడు నాసాలో ఏరో స్పేస్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించింది. ఆ వివరాలను తెలియచేస్తూ "ఇది కేవలం అదృష్టం అని కానీ, కాకతాళీయంగా జరిగిపోయిందని చెప్పను. పూర్తిగా పదిహేనేళ్ల కఠోర శ్రమతోనే, అంతకు మించిన ఓర్పుతోనే సాధ్యమైంది" అంటుంది అక్షత. అలాగే అంతరిక్షంలో కెరీర్‌ని వెతుక్కోవాలంటే పాటించాల్సిన కొన్ని సూత్రాలను కూడా పంచుకుంది. నక్షత్రశాల నుంచి అంతరిక్షం వరకు... "నాసాలోని జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీలో స్పేస్ మిషన్‌లకు 'ప్రిన్సిపల్ నావిగేటర్ అండ్ స్పేస్ సిస్టమ్స్ ఇంజనీర్'గా విధులు నిర్వర్తిస్తున్నాను. నాసా ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన సింథటిక్ ఆపెర్చర్ రాడార్ మిషన్‌లో ఫేజ్ లీడ్‌గానూ, మార్స్ 2020 మిషన్‌లో రోబోటిక్స్ సిస్టమ్స్ ఇంజనీర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాను. నేను చదివింది స్టేట్ బోర్డ్ సిలబస్‌లోనే. మాది సంపన్న కుటుంబం కూడా కాదు. అయితే చిన్నప్పుడు నా వీకెండ్ ఎంజాయ్‌మెంట్‌లో ప్లానిటేరియం విజిట్స్, బెంగుళూరులో ఎయిర్‌షోస్ ఎక్కువగా ఉండేవి. నా ఆసక్తిని గమనించిన మా అమ్మానాన్న నేనడిగిన ప్రతిసారీ తీసుకెళ్లేవారు. హబుల్ టెలిస్కోప్ గురించి తెలుసుకోవడం నా జీవితంలో గొప్ప మలుపు. బహుశా 2000 సంవత్సరంలో అనుకుంటాను. నాకప్పుడు పదేళ్లు. వ్యోమగాములు అంతరిక్షంలో నడవడం గురించి తెలిసి చాలా ఆనందం కలిగింది. అంతరిక్షం నుంచి భూమిని చూడాలనే కోరిక కూడా. కెరీర్ గురించిన ఆలోచనలకు స్పష్టమైన రూపం వచ్చింది కూడా అప్పుడే. అంతరిక్షంలోకి వెళ్లే మార్గాల గురించి అధ్యయనం చేయగా చేయగా వ్యోమగాముల్లో ఎక్కువమంది ఎమ్ఐటీలోనే చదివారని తెలిసింది. నేను అదే సంస్థలో చదవాలని నిర్ణయించుకున్నాను. దాంతో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరాను. బెంగళూరులోని ఆర్ కాలేజ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ 2010 బ్యాచ్‌లో నేను మాత్రమే అమ్మాయిని. యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిలో ఏరోస్పేస్‌లో మాస్టర్స్ చేశాను. పీహెచ్‌డీకి ఎమ్ఐటీ (మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) నుంచి స్కాలర్‌షిప్‌తో సీటు వచ్చింది. అయితే యూఎస్‌లో అంతరిక్షంలో ఉద్యోగం రావాలంటే ఆ దేశ పౌరసత్వం ఉండాలి కనీసం గ్రీన్‌కార్డ్ అయినా ఉండాలి. సెమినార్‌లలో నేను సమర్పించిన పేపర్‌లకు ప్రశంసలు వచ్చినప్పటికీ ఉద్యోగం వచ్చేది కాదు. అయినా నా పరిశోధనలను మాత్రం ఆపలేదు. ప్రొఫెసర్‌లకు వారితో కలిసి పని చేసే అవకాశం ఇవ్వమని వినతులు పోస్ట్ చేయడం కూడా ఆపలేదు. నా అప్లికేషన్ ఎప్పుడూ వెయిల్ లిస్టులోనే ఉండేది. వీసా సమయం పూర్తి కావస్తున్న సమయంలో ఒక పేపర్ ప్రెజెంటేషన్ సారా సీగర్ అనే ఆస్ట్రో ఫిజిసిస్ట్ దృష్టిని ఆకర్షించింది. అలా ఒక ఏడాదికి ఇంటర్న్‌షిప్‌కి అవకాశం వచ్చింది. ఆ ఏడాది పూర్తవుతున్న సమయంలో మరో పీహెచ్‌డీకి అప్లయ్ చేశాను. నాసా ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా పని చేశాను. మొత్తం మీద మూడవ ప్రయత్నంలో నాసాలో ఫుల్‌టైమ్ ఉద్యోగినయ్యాను. మేధ ఉంది పాదు లేదు, మనదేశంలో అంతరిక్షంలో పరిశోధన చేయగలిగిన మేధ ఉంది. మొక్క ఎదగాలంటే అందుకు అనువైన పాదు ఉండాలి. అలాంటి పాదును తల్లిదండ్రులు బాల్యంలోనే వేయాలి. అలాంటి ప్రోత్సాహం మన దగ్గర ఉండాల్సినంతగా లేదనే చెప్పాలి. అందుకే లక్ష్యాన్ని సాధించడంలో నాకు ఎదురైన సవాళ్లతోపాటు అవకాశాలను వివరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాను. నేను సూచించేదేమిటంటే... స్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టుల్లో పాల్గొనాలి. అంతరిక్షంలో కూడా ఆస్ట్రో ఫిజిక్స్, ఆస్ట్రానమీ, టెక్నాలజీ, ఇంజినీరింగ్ వంటి చాలా విభాగాలుంటాయి. మన ఆసక్తి ఎందులో అనేది తెలుసుకోవాలి. అంతరిక్షరంగంలో స్థిరపడాలంటే బాచిలర్స్ సరిపోదు. బాచిలర్స్‌లో సైన్స్, ఇంజినీరింగ్‌తోపాటు పీహెచ్‌డీ తప్పనిసరి. అలాగే ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, కోడింగ్ వంటి నైపుణ్యాలను కూడా మెరుగుపరుచుకోవాలి. అంతరిక్షానికి సంబంధించి వీలైనంత ఎక్కువ సదస్సులు, సమావేశాల్లో పాల్గొనాలి. నిపుణులను సంప్రదిస్తూ మన సందేహాలను నివృత్తి చేసుకుంటూ జ్ఞానాన్ని పెంచుకోవాలి. ఇవన్నీ అంతరిక్షయానాన్ని సుగమం చేసే మార్గాలు" అంటోంది అక్షత.

## మామిడి పండ్లను తినడం వల్ల మొటిమలు వస్తాయా? నిపుణులు ఏమంటున్నారంటే..






మామిడి పండ్లు తినడం వల్ల ముఖంపై మొటిమలు, గడ్డలు వస్తాయని చాలామంది చెబుతుంటారు. పాపం ఆ ఉద్దేశ్యంతోనే మామిపండు తినేందుకు భయపడు తుంటారు. నిజానికి మామిడి పండ్లకు మొటిమలకు సంబంధం ఉందా? వాటిని తినడం వల్ల వస్తాయా ? అంటే.. వేసవిలో అందరూ మామిడి పండ్లంటే ఇష్టంగా తింటారు. పోషకాల రీత్యా మామిడిని పండ్లలో రారాజు అని పిలుస్తారు. నిజానికి ఈ మామిడి ఆగ్నేయాసియాలో ఉద్భవించింది. కానీ ఇది ప్రపంచవ్యాప్తంగా సాగు చేసే సాధారణ పండుగా మారింది. ఈ మామిడి తినడం వల్ల శరీరానికి కావాల్సిన ఎన్నో రకాల విటమిన్లు, పోషకాలు అందుతాయి. దీనిలో బీటా కెరోటిన్ అధికంగా ఉండటం వల్ల చర్మ ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో కీలకపాత్ర పోషిస్తుందని డెర్మటాలజీ నిపుణులు చెబుతున్నారు. ఈ బీటా కెరోటిన్ అనేది యాంటీ ఆక్సిడెంట్ పిగ్మెంట్, శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది. కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతుంది. అంతేగాక దీనిలో ఉండే పోషకాలన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ముఖ్యంగా మంటను తగ్గించి జీర్ణశక్తిని మెరుగుపరుస్తుంది. అలాంటి మామిడి పండ్లను తింటే కొందరిలో మొటిములు ఎందుక వస్తాయంటే..? అధిక చక్కెర స్థాయి, గ్లైసెమిక్ సూచిక అని చెబుతున్నారు నిపుణులు. ఇక్కడ గ్లైసెమిక్? ఇండెక్స్ అనేది రక్తంలో చక్కెర స్థాయిలను సూచించే స్కేల్. ఇక్కడ పండ్లు, బియ్యం, ఇతర కార్బ్ రిచ్ ఉత్పత్తులు, ముఖ్యంగా వేయించిన లేదా ప్రాసెస్ చేసిన ఆహారాల్లో అత్యధిక గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటాయి. అమెరికన్ అకాడమీ ఆఫ్ డెర్మటాలజీ అసోసీయేషన్ ప్రకారం..టీనేజ్ పిల్లలు తెగ ఇష్టంగా తింటారు. ఇది వారు యుక్త వయసుకు చేరుకునే సమయం..సరిగ్గా ఈ టైంలోనే వారిలో సెబమ్ ఉత్పత్తి అవుతుంటుంది. దీంతో వారిలో జిడ్డు చర్మం, మొటిమలు మొదలయ్యే దశ స్లోగా మొదలవుతుంది. సరిగ్గా ఆ సమయంలోనే ఈ మామిడి పండ్లు కూడా వాళ్లుగా ఇష్టంగా తినడంతో పెద్దవాళ్లు మొటిమలకి, మామిడి పండ్లకి లింక్ చేసి..అవి తినడం వల్లనే వస్తున్నాయని అనేస్తారు. మొటిమలను నిరోధించే క్రీమ్‌లను ఉపయోగిస్తే..ఈ సమస్య నుంచి సులభంగా బయటపడగలుగుతారు. పైగా చర్మం కూడా ప్రకాశవంతంగా అందంగా మారుతుందని చెబుతున్నారు నిపుణులు.

## ఇన్‌స్టంట్ నూడుల్స్ మంచివి కావా? తింటే ఫుడ్ పాయిజనింగ్ అవుతుందా?

ఇటీవలకాలంలో ఇన్‌స్టంట్ ఫుడ్ ఐటెమ్స్‌కి ప్రివరెన్స్ ఇస్తున్నారు చాలామంది. ఈ ఉరుకులు పరుగులు జీవితంతో ఏదో స్పీడ్‌గా తయారయ్యే ఇన్‌స్టంట్ రెసిపీలు వండుకుని తినేసి హమ్మయ్యా..! అనుకుంటున్నారు. ఇది ఆరోగ్యానికి మంచిదా? కాదా? అన్నది ముఖ్యం కాదు. కేవలం ఆకలి తీరిపోతే చాలు అన్నట్లుగా రెడీమేడ్ ఫుడ్‌పై ఆధారపడుతున్నారు జనాలు. ముఖ్యంగా ఇన్‌స్టంట్ నూడుల్స్ లాంటివి అయితే ప్రజలు ఎగబడి మరీ తింటున్నారు. కానీ ఇలాంటి నూడుల్స్ మరింత ప్రమాదమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు ఫుడ్ పాయిజనింగ్‌కి దారితీస్తుందా.. మాములు న్యూడిల్స్‌లా కాకుండా దీనిలో ఆయిల్‌తో సహా అన్ని ఇన్‌గ్రేడియంట్స్ మిక్స్ చేసి ఉంటాయి. జస్ట్ దాన్ని తీసి గిన్నెలో వేసుకుని వేడి చేసుకుంటే చాలు న్యూడిల్స్ రెడీ అంతే..అయితే దీనిలో అన్ని ఇన్‌గ్రేడియంట్స్ ఉండటంతో తటస్థ పీహెచ్ స్థాయిలు ఎక్కుకవగా ఉంటాయి. అందువల్ల దీనిలో ఈజీగా బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీంతో ఫుడ్ పాయిజినింగ్ దారితీసే స్థాయికి చేరుకుంటుంది.



# మార్కెట్

## కృత్రిమ మేధస్సుకు భారతీయులు సై..

**ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్న దేశ జనాభాలో సగం కంటే ఎక్కువ మంది**

**ఈ టెక్నాలజీని వినియోగిస్తున్న 65 శాతం మంది**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 : టెక్నాలజీ రంగంలో రోజుకొక వినూత్న మార్పులు జరుగుతుంటాయి. ఇటీవలకాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన కృత్రిమ మేధస్సు(ఏఐ) టెక్నాలజీ వాడకంలో భారతీయులు ముందువరుసలో నిలిచారు. దేశ జనాభాలో సగం కంటే అత్యధిక మంది ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారని మైక్రోసాఫ్ట్ విడుదల చేసిన సర్వేలో వెల్లడైంది. అంతర్జాతీయ దేశాల్లో వినియోగిస్తున్నవారికంటే ఇది రెండింతలు అధికంగా 65 శాతం మంది ఇండియన్స్ ఈ టెక్నాలజీని వినియోగిస్తున్నారని మంగళవారం మైక్రోసాఫ్ట్ విడుదల చేసిన గ్లోబల్ ఆన్‌లైన్ సేఫ్టీ సర్వేలో ఈ విష యం వెల్లడైంది. జూలై 19 నుంచి ఆగస్టు 9, 2024 మధ్యకాలంలో భారత్‌తోపాటు ఇతర దేశాల్లో ఈ సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో 15 వేల మంది యువతియువకు లు, పెద్దలు పాల్గొన్నారు. వీరిలో 65 శాతం మంది ఏఐ టెక్నాలజీని వినియోగిస్తున్నామ ని, 2023 కంటే ఇది 26 శాతం అధికమని పేర్కొంది. అంతర్జాతీయ దేశాల్లో సరాసరిగా 31 శాతం మంది ఈ టెక్నాలజీని వాడుతున్నారు. ముఖ్యంగా దేశీయంగా ఈ టెక్నాలజీని అనువాదాలకు, ప్రశ్నల జవాబులకోసం, మెరుగైన పనితీరు కనబర్చడానికి, స్కూల్‌వర్క్‌లో విద్యార్థులకు సహాయం అందించడానికి వినియోగిస్తున్నారు. ఏఐ టెక్నాలజీ వాడకంలో మిలియనీర్లు(25 నుం చి 44 ఏండ్లలోపువారు) 84 శాతం మంది ఉన్నారని పేర్కొంది. డిజిటల్ చాలెంజ్‌పై తల్లిదండ్రులకంటే తమ పిల్లలకు అవగాహణ అధికంగా ఉన్నదని, గడిచిన కొన్నేండ్లుగా ఇది మరింత పెరుగుతున్నదని తెలిపింది. అయినప్పటికీ అంతర్జాతీయ ట్రెండ్‌లను ప్రతిబింబించేలా ఆన్‌లైన్ దుర్వినియోగం, డీప్ ఫేక్‌లు, స్కామ్‌లపై ఈ నివేదిక ఆందోళన వ్యక్తంచేసింది. 18 ఏండ్ల కంటే తక్కువ వయస్సు కలిగిన యువకులు ఏఐ టెక్నాలజీని విపరీతంగా వాడేస్తున్నారని తెలిపింది.

## ట్రంప్ సుంకాల దెబ్బతో విదేశీ ఇన్వెస్టర్లు ఔట్..



### దెబ్బతిన్న సెంటిమెంట్.. నష్టాలతో ఈక్విటీ మార్కెట్‌లు..!

%హశీఎఎం% ఎ దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం వరుసగా ఆరో సెషన్‌లో నష్టాలతో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధం.. అమెరికా డాలర్ ప్లస్ యూఎస్ బాండ్లు బలోపేతం కావడంతో దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్లు వాటాలు ఉపసంహరిస్తుండటంతో దేశీయ మదుపర్లలో సెంటిమెంట్ బలహీన పడింది. ఫలితంగా బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 905.21 పాయింట్ల పతనంతో 76 వేల పాయింట్ల దిగువన 75,388.39 పాయింట్ల కనిష్టానికి పడిపోయింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి ఫైనాన్సియల్ స్టాక్స్ రికవరీతో 122.52 పాయింట్ల నష్టంతో 76,171.08 పాయింట్లతో సరి పెట్టుకున్నది. మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ 26.55 పాయింట్లు (0.12 శాతం) కోల్పోయి 23,045.25 పాయింట్ల వద్ద స్థిర పడింది. అంతర్గత ట్రేడింగ్‌లో 273.45 పాయింట్లు (1.18 శాతం) నష్టంతో 22,798.35 పాయింట్లకు చేరుకుని కీలక 23,000 మార్క్ దిగువకు చేరుకుంది. ఈ నెల నాలుగో తేదీ నుంచి బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 2,412.73 పాయింట్లు (3.07 శాతం), ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 694 పాయింట్లు (2.92 శాతం) నష్టపోయాయి. బీఎస్ఈ-30 సెన్సెక్స్‌లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఐటీసీ, పవర్‌గ్రిడ్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, టైటాన్, ఇన్ఫోసిస్ భారీగా నష్టపోయాయి. మరోవైపు బజాజ్ ఫిన్ సర్వ్, టాటా స్టీల్, లార్సెన్ అండ్ టర్బో, ఆల్ట్రా టెక్ సిమెంట్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టాటా మోటార్స్ తదితర షేర్లు లాభ పడ్డాయి. మంగళవారం నాటికి దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 4,486.41 కోట్ల విలువైన వాటాలను ఉపసంహరించారు. జియోజిత్ ఫైనాన్సియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ స్పందిస్తూ 'దేశీయ మార్కెట్‌లో ఇంట్రాడే భారీ నష్టాల నుంచి ట్రేడింగ్ ముగింపుకల్లా స్వల్ప రికవరీ నమోదైంది. బ్రాడర్ మార్కెట్ పుంజుకున్నాఇన్వెస్టర్ల సెంటిమెంట్ ఓవరాల్‌గా బలహీనంగా ఉంది. మూడో త్రైమాసికం ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉంటాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు సంఘటితమయ్యే దిశగా ప్రయాణిస్తాయని భావిస్తున్నారు' అని చెప్పారు. అమెరికా ద్రవ్యోల్బణం గణాంకాలు భవిష్యత్ మార్కెట్ల గమనాన్ని నిర్దేశిస్తాయన్నారు. ఏషియన్ మార్కెట్లలో సియోల్, టోక్యో, షాంఘై, హాంకాంగ్ మార్కెట్లు పాజిటివ్‌గా ముగుస్తాయి. యూరోపియన్ యూనియన్ మార్కెట్‌లు లాభాలతో ముగుస్తాయి. మంగళవారం అమెరికా మార్కెట్లు అత్యధికంగా లాభాలతో స్థిర పడ్డాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్‌పై 0.78 శాతం పతనమై 76.40 డాలర్లకు చేరుకుంది.

## గ్వాషా..బ్యూటీ తమాషా!

అందంగా కనిపించాలంటే చర్మ ఆరోగ్యంతోపాటు, ముఖాకృతీ ముఖ్యమే. అయితే వయసు పెరిగేకొద్దీ రకరకాల కారణాల వల్ల అది మార్పులకు లోనవుతుంటుంది. గీతలు, ముడతలు పడుతుంటాయి. వాటి నుంచి ఉపశమనం పొందడంతోపాటు, చక్కని ముఖాకృతి కోసం అంటూ ఇటీవల బ్యూటీ బజార్లో ఓ కొత్త సౌందర్య సాధనం హల్‌చల్ చేస్తున్నది. అదే 'గ్వాషా స్టోన్'. హృదయాకారంలో ఉండే ఉపరత్నాల జాతికి చెందిన రాయి ఇది. జేడ్, క్వార్ట్, అమెథిస్ట్ లాంటి రాళ్లు వీటిలో ఉంటాయి. ఈ తరహా రాళ్లకు కొన్ని రుగ్మతల నుంచి స్వస్థపరిచే గుణం ఉంటుందని నమ్ముతారు. చైనా సంప్రదాయ వైద్య విధానంలో ఈ రాయి భాగంగా ఉండేది. బిగుసుకుపోయిన కండరాలను రిలాక్స్ చేసేందుకు, నొప్పుల్ని తగ్గించేందుకు దీన్ని వాడేవారు. ఆ కాలం నుంచే ఇది సౌందర్య సాధనంగానూ ఉంది. హృదయాకారంలో ఉండే ఈ రాయిని ముఖం, మెడ ప్రాంతాలను మసాజ్ చేసేందుకు వాడుతున్నారు. ముక్కు, చెంపలు, దవడ, నుదురులాంటి చోట్ల ప్రత్యేక పద్ధతుల్లో దీనితో మర్దనా చేస్తారు. వివిధ కోణాల్లో ఉపయోగించేలా దీని ఆకృతి ఉంటుంది. ఇలా మర్దనా చేయడం వల్ల రక్త ప్రసరణ బాగా జరిగి చర్మం అందంగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. ముడతలు తగ్గి చర్మం కాంతిమంతంగా, బిగుతుగా తయారవుతుందట. కళ్లకింద వలయాలు, ఉబ్బినట్టు కనిపించడంలాంటి వాటి మీదా ప్రభావం చూపుతుంది. మొత్తంగా సరికొత్త యాంటీ ఏజెనింగ్ టూల్‌గా గ్వాషా మారిందన్న మాట. దీన్ని ఎలా వాడాలన్న దానిమీదా యూట్యూబ్‌లో వీడియోలు చాలానే ఉన్నాయి. వాటినే ఇప్పుడు అమ్మాయిలు తెగ వెతికేస్తున్నారట.

# ఆంధ్రప్రదేశ్

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### నేడు విశాఖలో టిడిపి సైకిల్ రైడ్

అమరావతి,జూన్4 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మహత్తర కార్యక్రమానికి టీడీపీ శ్రీకారం చుట్టనుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని సమాజానికి చాటిచెప్పేందుకు సైకిల్ యాత్ర చేపట్టనుందని వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రేపు బాధ్యతగా సైకిల్ వినియోగించాలని అన్నారు. విశాఖపట్నంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సైకిల్ ప్రయాణం చేయనున్నట్లు చెప్పారు. ప్రపంచం నేడు వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, తగ్గుతున్న పచ్చదనం వంటి సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. ప్రజలు కూడా సైకిల్ యాత్రలో భాగస్వాములు కావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. సైకిల్ వినియోగం వల్ల కాలుష్యం తగ్గుతుందని, ఇంధన వినియోగం తగ్గుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పుకొచ్చారు. చిన్న ప్రయత్నాలే పెద్ద మార్పులకు నాంది పలుకుతాయన్నారు. 'నా దేశం నా బాధ్యతలో' భాగంగా ప్రతి ఒక్కరూ ఇంధన వినియోగం తగ్గించాలన్నారు. ఇంధన సంక్షోభాన్ని దృష్టిలో పెట్టుకునే ఈసారి మహానాడును హైబ్రిడ్ విధానంలో నిర్వహించి గ్రాండ్ సక్సెస్ సాధించామని తెలిపారు. ప్రజలందరూ సైకిల్ యాత్రలో భాగస్వాములై పర్యావరణ పరిరక్షణకు 'నేను సైతం' అంటూ ముందుకు రావాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

## రేవంత్ పర్యటన.. ముందుస్తు అరెస్టులు

జోగులాంబగద్వాల,జూన్4 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం గద్వాల జిల్లాలో పర్యటన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా హౌస్ అరెస్టు చేశారు. గద్వాల నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతు నాయుడును పోలీసులు అర్ధరాత్రి నుంచి హౌస్ అరెస్ట్ చేశారు. అదేవిధంగా పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్ రాములు, కురువపల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్.కేశవ్‌ను అరెస్టు చేయడం పట్ల హనుమంతు నాయుడు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలనలో పోలీస్‌ల పహారాలు, నిర్బంధాలు ఎందుకని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం అంటూ బీరాలు పలుకుతూ ప్రతిపక్ష నాయకులపై అంక్షలు ఎందుకని నిలదీశారు. మూడు సంవత్సరాల పాలనకే ఇంత అభద్రతాభావమా.. ఇంతటి అరాచకమా? అని మండిపడ్డారు. పెండింగ్ ప్రాజెక్టులపై ప్రతిపక్ష పార్టీల సూచనలను, ప్రజల ఆలోచనలను పరిగణనలోకి తీసుకోకుండా హడావుడిగా ప్రాజెక్టుల సందర్శన చేపట్టడం విచారకరమని అన్నారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టును తీవ్రంగా ఖండించారు.

## దేశానికి యువతే ప్రాణం

### యువతను తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటా

### ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ వెల్లడి

అమరావతి,జూన్4 : తన రాజకీయ ప్రయాణంలో యువత పాత్రను ప్రత్యేకంగా స్మరించుకుంటూ జనసేన అధినేత పవన్ కల్యాణ్.. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 2008లో ప్రజారాజ్యం పార్టీ(పీఆర్పీ) యువజన విభాగం 'యువరాజ్యం' కోసం పటిష్ఠమైన యువజన విభాగం నిర్మించాలని ప్రణాళిక చేశానని తెలిపారు. జనసేన పార్టీని స్థాపించి 12 ఏళ్లలో ఎన్నో కష్టాలు, పోరాటాలను అధిగమించిన తర్వాత.. పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అనుభవం, పరిణితితో నిండి, సంస్థాగత బాధ్యతలు చేపట్టడానికి, రాజకీయాలు నిర్వహించడానికి, ప్రజా సమస్యలు పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ యువరాజ్యం యువజన విభాగానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. 2005 నుంచి ఇప్పటి వరకు తనను విశ్వసించి అండగా నిలిచిన యువతకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నిజాయితీ, నిబద్ధత, దేశభక్తి కలిగిన యువతను, చైతన్యవంతమైన నాయకులను తీర్చిదిద్దేందుకు తాను కృషి చేస్తానని పవన్ ప్రతిజ్ఞ చేశారు. నూతన భారత్.. జెన్‌జెడ్ తరం నుంచి అద్భుతమైన నాయకుల ఆవిర్భావానికి సాక్ష్యంగా నిలుస్తుందన్నారు. జెన్‌జెడ్ తరం.. బుజ్జగింపు రాజకీయాలు, వంశపారంపర్య రాజకీయాలు, కుల రాజకీయాలు, విభజన రాజకీయాలు, ప్రాంతీయ రాజకీయాలతో విసిగిపోయిందని అభిప్రాయపడ్డారు. ఈ తరం.. జవాబుదారీతనం గల రాజకీయాలను తీసుకురాగల నాయకుల కోసం ఎదురుచూస్తోందని చెప్పారు. అంతేగానీ, ప్రపంచ వేదికలపై భారత్‌ను బలహీనపరిచే నాయకుల కోసం కాదన్నారు. బలమైన, పటిష్ఠమైన భారత్‌ను నిర్మించగల నాయకుల కోసం జెన్‌జెడ్ యువత ఎదురుచూస్తోందని ఎక్స్ ఖాతాలో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు గ్రీన్ సిగ్నల్

ఆదిలాబాద్,జూన్4 : ఆదిలాబాద్ ఎయిర్ పోర్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది . ఎయిర్ పోర్టుకు 1580 ఎకరాలు ఇవ్వడానికి సిద్దమైన రాష్ట్ర సర్కార్ ప్రతిపాదన లేఖను రక్షణ శాఖ జాయింట్ సెక్రెటరీ మహంతికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ అందించారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన లేఖ పట్ల సానుకూలత తెలిపింది కేంద్రం. రక్షణ శాఖ చెందిన 400 ఎకరాలు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే1580 ఎకరాలు కలిపి1980 ఎకరాల్లో ఎయిర్ ఫోర్స్ స్టేషన్, ఎయిర్ పోర్టు నిర్మాణానికి సానుకూలంగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. కేంద్రం నిర్ణయంపై సంతోషం వ్యక్తం చేశారు ఎమ్మెల్యే పాయల్ శంకర్. ఎయిర్ పోర్ట్ నిర్మాణంపై సానుకూలంగా ఉన్న ప్రధాని మోడీ, సీఎం రేవంత్ కు ఎమ్మెల్యే పాయల్ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్ సహా పలుప్రాంతాల్లో చిరుజల్లులు

### చల్లబడ్డ నగర వాతావరణం

హైదరాబాద్ ,జూన్4 : జూన్ నెల వచ్చినా ఎండలు మండిపోతున్నాయి... రుతుపవనాల రాక ఆలస్యమవ్వడంతో మరి కొన్ని రోజులు ఎండ తీవ్రత ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. అయితే.. గురువారం ఉదయం నుండి ఎండ దంచికొట్టినప్పటికీ మధ్యాహ్నం అయ్యేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఒక్కసారిగా మబ్బులు కమ్మేసి చిరుజల్లులు కురిశాయి. ఈ దెబ్బతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయి నగరం చల్లబడింది. వర్షం కురిసే సమయంలో రోడ్ల మీద ఉన్న వాహనదారులు చిరుజల్లులతో రిలీఫ్ అయ్యారు. అప్పటిదాకా ఎండలో ట్రాఫిక్ జామ్ లో విసిగిపోయిన జనం ఒక్కసారిగా కురిసిన చిరుజల్లులతో ఉపశమనం పొందారు. కరీంనగర్ జిల్లాలో కూడా వాతావరణం ఒక్కసారిగా మారిపోయి వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు తిమ్మాపూర్, మనుకొండూరు, శంకరపట్నం, జమ్మికుంట, హుజురాబాద్ మండలాల్లో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవగా... మరికొన్ని చోట్ల ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుండి విపరీతమైన ఎండ వేడితో అల్లాడిన జనం వర్షంతో ఉపశమనం పొందామని అంటున్నారు. మెదక్ జిల్లా నిజాంపేట మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది.

# విశాఖ వేదికగా జూలైలో ఎస్ఎఫ్ఐ జాతీయ మహాసభలు

## పోస్టర్ ఆవిష్కరించిన విద్యార్థి నాయకులు




విశాఖపట్టణం : భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జాతీయ సమావేశాలు జూలై 13,14,15 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్, అధ్యక్షులు రామ్మోహన్ తెలిపారు. గురువారం జగదాంబ సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ సమావేశాలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సమావేశాలకు దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని చెప్పారు. కేంద్రంలోని ఎన్డీఎ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన నీట్ పరీక్ష నిర్వహణలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడంతో, పరీక్షను రద్దు చేశారని, దీంతో ఈ పరీక్షకు హాజరైన 23 లక్షల మంది అభ్యర్థులు తీవ్రమైన ఆత్మ క్షోభకు గురయ్యారని చెప్పారు. అనేకమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని అన్నారు. కేవలం నీట్ పరీక్షలు మాత్రమే కాకుండా యుజిసి పరీక్షలు, ఆఖరికి సిబిఎస్ఎస్సి పరీక్షలను సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి ఉందన్నారు. సిబిఎస్సి పరీక్ష నిర్వహణలో విఫలం చెందిన సి బి ఎస్ సి కార్యదర్శిని తొలగించారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని ఎస్ఎఫ్ఐ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో అన్ని రాష్ట్రాలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం ప్రకారం రూపొందించి పంపిస్తుందని చెప్పారు. వాటి పుస్తకాలలో మతాన్ని బోధించే విధంగా వీటి రూపకల్పన ఉందన్నారు. విద్యను కేంద్రీకరించడం సరికాదన్నారు. విద్య వికేంద్రీకరణ జరగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, అలాగే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రైవేటు విద్యను ప్రోత్సహిస్తూ, ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వేసవి రోజులలో కూడా రాష్ట్రంలోని కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠశాలలను నిర్వహించాయని, వాటిపై ఎటువంటి చర్య లేదన్నారు. ఎస్ ఎస్ సి లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉన్నతంగా రాణించారని గొప్పలు చెప్పిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అడ్డగోలుగా ప్రైవేట్ విద్యా సంస్థలను ప్రోత్సహించడంతో, ఈ ఏడాది లక్ష మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు దూరమైనట్టు ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీలలో అధ్యాపకుల పోస్టులు 5 వేలు ఖాళీలు ఉన్నాయన్నారు. గీతం వంటి ప్రైవేటు విద్యాసంస్థను అధికార పార్టీ వారే నడుపుతూ, ప్రభుత్వ యూనివర్సిటీలను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. విద్యా వ్యవస్థలో సమూలమైన మార్పులు తీసుకురావాలని కోరుతూ, విద్యను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, ఎస్ఎఫ్ఐ పోరాటం చేస్తుందన్నారు. ఇందుకోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.సాయి తేజ, ప్రధాన కార్యదర్శి జి. అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## హరిత ఆలోచనలతో భావి తరాలను తీర్చిదిద్దాలి

### చిన్నప్పటి నుంచే పర్యావరణంపై అవగాహన

### ప్రకృతిపై మమకారంతోనే సమాజంపై బాధ్యత

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ,జూన్4 : పర్యావరణ పరిరక్షణపై చిన్నప్పటి నుంచే అవగాహన కల్పిస్తే విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని సంరక్షించడం వంటి విలువలు బాల్యంలోనే అలవడితే సమాజం పట్ల బాధ్యతాభావం పెరుగుతుందని పేర్కొన్నారు. నెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగరంలోని సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. డ్రీమ్ వర్క్స్ ఆర్ట్ గ్యాలరీ, ఆంధ్రప్రదేశ్ క్రియేటివిటీ కల్చర్ కమిషన్, ఎన్.టి.ఆర్.జిల్లా అధికార యంత్రాంగం, కొమ్మారెడ్డి వెంకట సదాశివరావు సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, విజయవాడ. ఎ.పి.సర్వోదయ మండలి, రూట్ హెల్త్ ఫౌండేషన్, సర్వోదయ ట్రస్ట్, జి.ఆర్.కె.పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, మార్పు వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 200 మంది ప్రఖ్యాత చిత్రకారులతో ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. అదేవిధంగా పాఠశాల, కాలేజీ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ వాతావరణ మార్పులు, కాలుష్యం, నీటి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి అంశాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం అవసరమన్నారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా జీవన విధానంగా మార్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, ఎ÷–లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటం, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. ప్రకృతిపై మమకారం పెరిగినప్పుడే పర్యావరణ పరిరక్షణ పట్ల నిబద్ధత ఏర్పడుతుందని, అలాంటి చైతన్యవంతులైన యువతతోనే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థి హరిత కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని, పరిశుభ్రమైన, పచ్చని పరిసరాల నిర్మాణానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న ప్రతి సంస్థకు, వ్యక్తికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్ధన్ పాల్గొని పర్యావరణ పరిరక్షణపట్ల మార్గనిర్దేశర చేశారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం పెరిగినప్పుడే సమాజంలో సానుకూల మార్పు సాధ్యమవుతుందని అన్నారు. ప్రకృతిని కాపాడటం అంటే మన భవిష్యత్తును కాపాడటమేనని పేర్కొంటూ, పర్యావరణ పరిరక్షణను ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఞార్యక్రమంలో సిద్దార్థ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ సునీత, డ్రీమ్ ఆర్ట్ అకాడమీ సెక్రెటరీ రమేష్, జీఆర్‌కే పోలవరపు సమితి అధ్యక్షులు గోళ్ళ నారాయణరావు, మార్పు సంస్థ నుంచి తులసి పద్మశ్రీ, సర్వోదయ నుంచి రాంబాబు నాయుడు, మోతుకూరి వెంకటేశ్వరరావు, రూట్ హెల్త్ ఫౌండేషన్ విజయభాస్కర్, న్యాయవాది నరేంద్రకుమార్, కళాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## రష్యాలో కొనసాగిన లోకేశ్ పర్యటన

### బిజినెస్ ఫోరమ్‌లో పెట్టుబడులపై చర్చ

అమరావతి,జూన్4 : రష్యాలో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఎస్పీఐఈఎఫ్ బిజినెస్ ఫోరం సదస్సులో ఆంధ్రప్రదేశ్ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. భారత్, రష్యాల మధ్య ఉన్న సుదీర్ఘ సాంకేతిక, ఆర్థిక అనుబంధాన్ని గుర్తుచేస్తూ, 2030 నాటికి 100 బిలియన్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఏపీ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంతో ఆంధ్రప్రదేశ్‌ను 2.5 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ ధ్యేయమని ప్రకటిస్తూ.. అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను కేవలం పెట్టుబడిదారులుగా కాకుండా రాష్ట్ర అభివృద్ధిలో సమాన భాగస్వాములుగా ఆహ్వానించారు. ఈ సదస్సులో భాగంగా రష్యాకు చెందిన ప్రముఖ ఉక్కు దిగ్గజం 'నోవోస్టల్–ఎం సంస్థ చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో మంత్రి లోకేష్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. భారతదేశంలో అత్యాధునిక ఈఏఎఫ్ (ఇంఈ) గ్రీన్ స్టీల్ ఎ÷–లాంట్ నిర్మాణాన్ని చేపట్టాలని, అదేవిధంగా ఏపీలోని ప్రతిష్ఠాత్మక పారిశ్రామిక హబ్ 'శ్రీసిటీ'లో రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ 'సిస్టమా' ప్రెసిడెంట్ తాగిర్ సిట్దేకోవ్‌తో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేష్.. రాష్ట్రంలో సరికొత్త రవాణా, సాంకేతిక ప్రాజెక్టులపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లోని అంతర్గత జలరవాణా మార్గాలలో పర్యావరణ అనుకూల 'ఎలక్ట్రిక్ రివర్ మెట్రో' పైలట్ ప్రాజెక్టులను ప్రారంభించాలని కోరారు. దీంతో పాటు భవిష్యత్ సాంకేతికతలకు కేంద్రంగా నిలుస్తున్న ఏపీ 'క్వాంటమ్ వ్యాలీ ఫ్రేమ్ వర్క్' ప్రాజెక్టులో సిస్టమా సంస్థను భాగస్వామి కావాల్సిందిగా మంత్రి నారా లోకేష్ ఆహ్వానించారు. లోకేశ్‌తో లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు ఉన్నారు.

## ఢిల్లీ అగ్నిప్రమాద ఘటన

### హోటల్ యజమాని అరెస్ట్

న్యూఢిల్లీ,జూన్4 : ఢిల్లీలోని మాల్వీయ నగర్‌లోని ఓ హోటల్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది మృతిచెందిన ఘటనలో ఆ హోటల్ ఓనర్ లవ్‌కేశ్ బజాజ్‌ను నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జుడిషియల్ మెజిస్ట్రేట్ భాను ప్రతాప్ సింగ్ ఈ ఆదేశాలు ఇచ్చారు. దర్యాప్తు కోసం కస్టడీలోకి తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు అభ్యర్థించారు. అగ్నిప్రమాదం వేళ నిర్లక్ష్యం కింద కేసు బుక్ చేశారు. ఫ్లోరిష్ స్టే బీ అండ్ బీలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందిన వారిలో ఎక్కువ శాతం మంది విదేశీయులు ఉన్నారు. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారి బంధువులే ఆ మృతుల్లో ఉన్నారు. అయితే ఏ కారణం చేత మంటలు వ్యాపించాయో ఇంకా స్పష్టంగా తెలియలేదు. ఎ÷–లోరిష్ స్టే హోటల్ కోసం బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద హోటల్ ఓనర్ బజాజ్ లైసెన్సు తీసుకున్నారు. కానీ ఆ లైసెన్సు ప్రకారం అతిథులకు కేవలం ఆరు రూమ్‌లు మాత్రమే ఉంటాయి. కానీ ప్రాథమిక విచారణ ప్రకారం.. ఎ÷–లోరిష్ స్టేలో 25 రూమ్‌లు ఆపరేటింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. బేస్మెంట్‌లో ఉన్న అకామిడేషన్‌ను కూడా వాడుతున్నారు. ఆ ప్రాపర్టీకి మొత్తం ఓనర్ బజాజ్ ఒక్కడే. జై మిశ్రా అనే వ్యక్తికి మేనేజ్మెంట్ అప్పగించినట్లు ఆయన చెప్పారు. అయితే మిశ్రా కోసం ప్రస్తుతం పోలీసులు గాలిస్తున్నారు. అతను పరారీలో ఉన్నాడు. బీ అండ్ బీ స్కీమ్‌ను 2007లో ప్రవేశపెట్టారు. ఆ స్కీమ్‌లో సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన వసతిని ఇవ్వనున్నారు. బుధవారం జరిగిన ప్రమాదంలో 21 మంది మృతిచెందగా, దాంట్లో 12 మంది విదేశీయులు ఉన్నారు.

## ఆస్పత్రిలో మృతురాలి మెడలో పుస్తెల తాడు మాయం

### పోలీసులకు ఫిర్యాదు చేసిన బంధువులు

యాదాద్రి భువనగిరి ,జూన్4 : భువనగిరిలో దారుణం జరిగింది. మృతదేహంపై ఉన్న మూడు తులాల బంగారు పుస్తెల తాడును దుండగులు మాయం చేశారు. భువనగిరి జిల్లా ఆసుపత్రిలో చనిపోయిన మహిళ మెడ నుంచి మూడు తులాల బంగారు పుస్తెల తాడు మాయమైన ఘటన కలకలం రేపింది. వలిగొండ మండలం వర్కట్ పల్లికి చెందిన సుష్మిత అనే గర్భవతికి దమ్ము ఎక్కువగా వస్తుండటంతో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆమె భర్త నాగరాజు ఆమెను జిల్లా ఆసుపత్రికి తీసుకొచ్చాడు. తెల్లవారుజామున నాలుగు గంటలకు సుస్మిత చికిత్స పొందుతూ చనిపోయింది. పోస్టుమార్టం సమయంలో సుస్మితపై ఉన్న బంగారు ఆభరణాలు తీసుకోండని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆమె ఒంటిపై ఉన్న బంగారం గురించి చూడగా.. అప్పటికే ఆమె మెడలోని మూడు తులాల పుస్తెలా తాడు కనిపించలేదు. ఈ ఘటనపై.. ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు పోలీసులకు సుస్మిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అమిర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్ : హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ – 1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమీర్‌పేట– ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

## రాష్ట్రంలో తగ్గని ఎండల తీవ్రత

### అంగన్‌వాడీ కేంద్రాలకు 14 వరకు సెలవులు

### 15న తిరిగి ప్రారంభించాలని ఆదేశాలు

హైదరాబాద్ ,జూన్4 : రాష్ట్రంలో భానుడి భగభగలకు జనం అల్లాడిపోతున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మే నెల ముగిసినా ఎండల తీవ్రత, వడగాల్పుల ప్రభావం ఏమాత్రం తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న పిల్లలు, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను పొడిగించింది. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శృతి ఓఝు వేసవి సెలవులను జూన్ 13 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జూన్ 14వ తేదీన ఆదివారం కావునా.. జూన్ 15 నుండి ఈ కేంద్రాలు యథావిధిగా తిరిగి పనిచేయడం ప్రారంభిస్తాయి. నిజానికి ముందస్తు ప్రణాళిక ప్రకారం జూన్ 2వ తేదీ నుంచే అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను పునఃప్రారంభించాలని ప్రభుత్వం భావించింది. అయితే, జూన్ మొదటి వారంలో కూడా ఉష్ణోగ్రతలు 40 నుండి 45 డిగ్రీల సెల్సియస్ దాటుతుండటం, మధ్యాహ్నం వేళల్లో తీవ్రమైన ఉష్ణగాలులు వీస్తుండటంతో తల్లిదండ్రుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. చిన్న పిల్లలు ఎండ దెబ్బకు గురయ్యే ప్రమాదం ఉండటంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సైతం ఎండల తీవ్రత కారణంగా వేసవి సెలవులను పొడిగించిన సంగతి తెలిసిందే. పాఠశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాలను కూడా జూన్ 14 వరకు మూసి ఉంచాలని, విద్యాసంస్థలతో పాటే జూన్ 15న ఒకేసారి తెరవాలని ప్రభుత్వం భావిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారు 3 నుండి 6 సంవత్సరాల లోపు పిల్లలు కావడంతో వారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో వారు బయటకు వస్తే వడదెబ్బ తగిలి డీహైడ్రేషన్, జ్వరం బారిన పడే అవకాశం ఉంది. అందుకే వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో ప్రభుత్వం ఈ పొడిగింపు నిర్ణయం తీసుకుంది. సెలవుల పొడిగింపు కేవలం చిన్న పిల్లల రాకకు మాత్రమే వర్తిస్తుంది. అయితే అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం పంపిణీకి ఎలాంటి ఆటంకం కలగకుండా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల అంగన్‌వాడీ సిబ్బందితో పాటు, చిన్నారుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ప్రశాంత్ నీల్‌కి జూనియర్ ఎన్టీఆర్ బర్త్‌డే విషెస్.. వైరల్ అవుతున్న పోస్ట్!

ఇండియన్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్ నీల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని, అలాగే వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే డ్రాగన్ సినిమాను గుర్తుచేస్తూ.. ఎన్టీఆర్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌లో ఎన్టీఆర్ స్పందిస్తూ.. "పుట్టినరోజు శుభాకాంక్షలు డైరెక్టర్ గారూ.. మీరు చెప్పే కథలంత గొప్పగా ఈ ఏడాది మీకు సాగాలని కోరుకుంటున్నాను. మన కాంబినేషన్‌లో రాబోయే ప్రాజెక్ట్ కోసం, మన భవిష్యత్తు ప్రయాణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను ప్రశాంత్ అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో ప్రశాంత్ నీల్‌ను ఉద్దేశించి ఎన్టీఆర్ కన్నడ పదం 'అవరే' (గారూ) అని సంబోధించడం ఇరు భాషల అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి ఇండస్ట్రీ హిట్ చిత్రాలతో సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.



# సాలిడ్ కమ్ బ్యాక్ కోసం సమంత ప్లానింగ్.!

ఒకప్పుడు స్టార్ లీగ్‌లో కనిపించిన.. ఈ మధ్య స్లో అయ్యారు. హెల్త్ ఇష్యూస్ కారణంగా బ్రేక్ తీసుకున్న ఈ బ్యూటీ తరువాత బాలీవుడ్ మీద ఫోకస్ చేస్తున్నారు. ఎక్కువగా డిజిటల్ ప్రాజెక్టస్ మీదే దృష్టి పెట్టిన సమంత, అందులోనూ యాక్షన్ రోల్స్‌కే ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. ఆల్రెడీ రిలీజ్ అయిన షోస్‌తో పాటు సెట్స్ మీద ఉన్న ప్రాజెక్ట్సులోనూ అలాంటి క్యారెక్టర్సే ప్లే చేస్తున్నారు. సమంత ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసిన ప్రాజెక్ట్ ది ఫ్యామిలీ మ్యాన్ 2.ఒకప్పుడు స్టార్ లీగ్‌లో కనిపించిన.. ఈ మధ్య స్లో అయ్యారు. హెల్త్ ఇష్యూస్ కారణంగా బ్రేక్ తీసుకున్న ఈ బ్యూటీ తరువాత బాలీవుడ్ మీద ఫోకస్ చేస్తున్నారు. ఎక్కువగా డిజిటల్ ప్రాజెక్టస్ మీదే దృష్టి పెట్టిన సమంత, అందులోనూ యాక్షన్ రోల్స్‌కే ఇంపార్టెన్స్ ఇస్తున్నారు. ఆల్రెడీ రిలీజ్ అయిన షోస్‌తో పాటు సెట్స్ మీద ఉన్న ప్రాజెక్ట్సులోనూ అలాంటి క్యారెక్టర్సే ప్లే చేస్తున్నారు. సమంత ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసిన ప్రాజెక్ట్ ది ఫ్యామిలీ మ్యాన్ 2. అప్పటి వరకు సౌత్ సినిమాల్లో జస్ట్ గ్లామర్ హీరోయిన్‌గా మాత్రమే ఉన్న సామ్, ఈ షోలో బోల్డ్ సీన్స్‌తో పాటు యాక్షన్ సీన్స్‌లోనూ నటించారు. నార్త్ ఎంట్రీలో యాక్షన్ ఇమేజ్ సమంతకు బాగానే హెల్ప్ అయ్యింది. అందుకే అదే టీమ్‌తో వరుస ప్రాజెక్ట్సు చేస్తున్నారు సామ్. ఆల్రెడీ ది ఫ్యామిలీ మ్యాన్ 3లోనూ సమంత కనిపించబోతున్నారన్న హింట్ ఇచ్చారు మేకర్స్. ది ఫ్యామిలీ మ్యాన్ 2 తెరకెక్కించిన రాజ్ అండ్ డీకేనే, రీసెంట్‌గా రిలీజ్ అయిన సిటాడెల్ హనీ బన్నీకి కూడా దర్శకులు. హాలీవుడ్‌లో సూపర్ హిట్ అయిన సిటాడెల్‌ను ఇండియన్ నేటివిటికీ తగ్గట్టుగా మార్చి తెరకెక్కించారు రాజ్ అండ్ డీకే. ఈ షోలో ఏజెంట్‌గా యాక్షన్ రోల్‌లోనే కనిపించారు. ప్రజెంట్ రక్త బ్రహ్మాండ్ అనే భారీ వెబ్ సిరీస్‌ను రూపొందిస్తున్నారు రాజ్ అండ్ డీకే. పీరియాడిక్ జానర్‌లో తెరకెక్కుతున్న ఈ సిరీస్‌లో ఆదిత్యరాయ్ కపూర్, అలీ ఫజల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ షోలో సమంత యువరాణిగా కీలక పాత్రలో నటించబోతున్నారు.అంతేకాదు ఇందులోనూ యాక్షన్ రోలే ప్లే చేస్తున్నానని చెప్పారు సామ్. దీంతో సామ్ ఇక రెగ్యులర్ గ్లామర్ రోల్స్‌కు గుడ్ బై చెప్పేసినట్టేనా అన్న డిస్కషన్ జరుగుతోంది.




# 'పెద్ది'లో సైలెంట్‌గా లిరిక్స్ మార్పు..

## 'చికిరి చికిరి' పాటలో ఆ పదాలను తొలగించిన మేకర్స్!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలతో అభిమానుల సంబరాలు అంబరాన్ని తాకుతున్నాయి. జూన్ 3 రాత్రి తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించిన స్పెషల్ ప్రీమియర్ షోలతో సినిమా సందడి మొదలైంది. ఇప్పటికే సోషల్ మీడియాలో సినిమా సన్నివేశాలు, అభిమానుల స్పందనలు వైరల్ అవుతున్నాయి. ఈ క్రమంలో 'పెద్ది' చిత్రంలోని సూపర్ హిట్ సాంగ్ 'చికిరి చికిరి' గురించి ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. సినిమా విడుదలకు ముందే 'చికిరి చికిరి' పాట ప్రేక్షకుల్లో భారీ క్రేజ్ సంపాదించుకుంది. సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాట విడుదలైన క్షణం నుంచే సోషల్ మీడియాలో ట్రెండ్ అయింది. యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్ సాధించడమే కాకుండా, మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫారమ్‌లలోనూ టాప్‌లో నిలిచింది.తెలుగు వార్తలు ఈ పాటకు చిన్నారుల నుంచి యువత వరకు అందరూ స్టెప్పులేస్తూ రీల్స్ క్రియేట్ చేయగా, 'చికిరి చికిరి' సోషల్ మీడియాలో ఓ సెన్సేషన్‌గా మారింది. అయితే సినిమా ప్రీమియర్ షోలను వీక్షించిన ప్రేక్షకులు ఒక విషయాన్ని వెంటనే గమనించారు. పాట ఆడియో వెర్షన్‌లో ఉన్న కొన్ని లిరిక్స్‌ను సినిమా వెర్షన్‌లో మార్చినట్లు తెలుస్తోంది. మొదట విడుదలైన పాటలో "పడతా పడతా పడతా.. ఎనుకే ఎనుకే పడతా.. సరుకు సామాన్లు సూసి మీసం లేసి ఏసే కేక.. చికిరి చికిరి" అనే పదాలు వినిపించాయి. కానీ థియేటర్లలో ప్రదర్శితమైన సినిమా వెర్షన్‌లో "సరుకు సామాన్లు" అనే పదాలను తొలగించి, వాటి స్థానంలో "సొగసు సింగారం" అనే పదాలను ఉపయోగించినట్లు అభిమానులు చెబుతున్నారు. గత కొంతకాలంగా 'సామాన్లు' అనే పదంపై సోషల్ మీడియాలో తీవ్ర చర్చ జరిగింది. ముఖ్యంగా నటుడు శివాజి ఒక కార్యక్రమంలో మహిళల వస్త్రధారణపై వ్యాఖ్యానిస్తూ చేసిన పదప్రయోగం వివాదానికి దారితీసింది. ఆ వ్యాఖ్యలపై మహిళా సంఘాలు, నెటిజన్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం శివాజీ క్షమాపణలు కూడా చెప్పారు.అదే సమయంలో 'చికిరి చికిరి' పాటలోని "సరుకు సామాన్లు" లిరిక్స్‌పై కూడా కొందరు సోషల్ మీడియాలో విమర్శలు చేశారు. మహిళలను కించపరిచే విధంగా ఆ పదాలు ఉన్నాయంటూ అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అయితే అప్పట్లో చిత్ర బృందం ఎలాంటి వివరణ ఇవ్వలేదు. సినిమా విడుదల తర్వాత ఎలాంటి వివాదాలు తలెత్తకుండా ఉండేందుకు మేకర్స్ ముందస్తు జాగ్రత్తగా లిరిక్స్ మార్చి ఉండవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకపోయినా, థియేటర్లలో వినిపిస్తున్న కొత్త వెర్షన్ ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది.



# ఇప్పటివరకూ రాని కథ!

లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు దర్శకత్వం వహిస్తున్న సంగీతప్రధాన చిత్రం 'సింగ్ గీతం'. ప్రముఖ దర్శకుడు నాగ్‌అశ్విన్ నిర్మిస్తున్నారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపూడి ప్రధాన పాత్రధారులు. ఈ నెల 11న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక అహల్యా బమ్రూ విలేకరులతో ముచ్చటించింది. తన నేపథ్యం గురించి చెబుతూ 'మాది పుదుచ్చేరి. ఇంగ్లీష్, ఫ్రెంచ్, బెంగాలీ భాషలు మాట్లాడే ఓ ఇంటర్నేషనల్ కమ్యూనిటీలో పెరిగాను. నా ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ చూసి నాగ్‌అశ్విన్ సినిమాలో అవకాశం ఇచ్చారు. ఆడిషన్ కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇచ్చాను' అని చెప్పింది. ఈ సినిమాలో తాను బలమైన వ్యక్తిత్వం ఉన్న అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, ఇందులో విలన్ క్యారెక్టర్‌లో కూడా అమ్మాయే నటించిందని తెలిపింది. 'కథాపరంగా కూడా ఇది కొత్త జోనర్ సినిమా. ఇలాంటి కథను ఇంతవరకు చూసి ఉండరు. తెలుగు ఇండస్ట్రీలో పనిచేయడం ఆనందంగా ఉంది. మహేష్‌బాబు నా ఫేవరేట్ హీరో. యాక్షన్ సినిమాలు చేయాలన్నది నా డ్రీమ్' అని అహల్యా బమ్రూ చెప్పింది.



# రష్మికలో ఏదో తెలియని శక్తి ఉంది : రాహుల్ రవీంద్రన్

రాహుల్ రవీంద్రన్ తాజాగా రష్మికను గర్ల్ ఫ్రెండ్‌గా చూపించాడు. గర్ల్ ఫ్రెండ్ టీజర్‌లో రష్మిక చాలా కొత్తగా, పాజిటివ్‌గా కనిపించింది. రష్మిక చాలా సటిల్డ్‌గా కనిపించింది. చాలా వరకు ఆమె అల్లరి చేసే పాత్రలు, చిన్న పిల్లల్లా ఎక్స్ ట్రాలు చేసే కారెక్టర్లనే పోషించింది. కానీ ఓ హుందాతనం ప్రదర్శించి, సైలెంట్‌గానే ప్రభావం చూపించే పాత్రలను పోషించలేదు.కానీ ఈ గర్ల్ ఫ్రెండ్ పాత్ర అలాంటిదే అనిపిస్తోంది. రష్మికపై రాహుల్ వేసిన ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. రష్మిక ప్రస్తుతం నేషనల్ వైడ్‌గా హాట్ టాపిక్ అయిన సంగతి తెలిసిందే. పుష్ప 2లో ఆమె నటన కొందరికి నచ్చలేదు. మరి కొందరికి చాలా నచ్చింది. రష్మిక యాక్టింగ్ మీద ఎప్పుడూ భిన్న రకాలుగా కామెంట్లు వస్తూనే ఉంటాయి. ఇక పుష్ప 2లో కొన్ని సీన్లు బాగా లేవని, ఇంకొన్ని సీన్లలో రష్మిక నిజంగానే బాగా యాక్ట్ చేసిందని అంటున్నారు. అలా యానిమల్, పుష్ప 2 చిత్రాలతో నేషనల్ వైడ్‌గా రష్మిక అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం అయితే చేసింది. ఇప్పుడు రష్మిక గర్ల్ ఫ్రెండ్ అంటూ అందరినీ పలకరించింది.గర్ల్ ఫ్రెండ్ టీజర్‌ను విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. కేవలం రిలీజ్ చేయడమే కాకుండా టీజర్‌కు వాయిస్ ఓవర్ కూడా ఇచ్చాడు. ఇక విజయ్ వాయిస్ ఓవర్‌లో చెప్పిన కవిత్వం, రష్మిక పరిచయం అదిరిపోయింది. రష్మిక చాలా కామ్‌గా కనిపిస్తూనే చాలానే ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. రష్మిక ఇంత సైలెంట్‌గా ఉండి.. ప్రభావం చూపించిన సీన్లు ఇవే అయి ఉంటాయి. ఎప్పుడూ వాగుతూ కనిపించే రష్మికకు ఇలాంటి ఓ డిఫరెంట్ పాత్రను రాహుల్ ఇచ్చాడు. రాహుల్ తీసిన చిలసౌ క్లాస్ ఆడియెన్స్‌ను తెగ ఆకట్టుకుంది. ఆ ఒక్క మూవీతో అటు రుహానీ, ఇటు సుశాంత్ కెరీర్‌లు ఊపందుకున్నాయి. దర్శకుడిగా, రైటర్‌గా రాహుల్‌కు మంచి పేరుని తీసుకొచ్చింది. కానీ తరువాత చేసిన మన్మథుడు 2 చిత్రం దారుణంగా విమర్శల్ని ఎదుర్కొంది. అందుకే రాహుల్ మళ్లీ చాలా గ్యాప్ తీసుకున్నాడు. తన స్టైల్లో ఓ డిఫరెంట్ లవ్ స్టోరీని రూపొందించాడనిపిస్తోంది. ఈ క్రమంలో గర్ల్ ఫ్రెండ్ సినిమాలో రష్మిక నటన, ఆమె అప్పియరెన్స్ గురించి మాట్లాడాడు. ఆమెను ట్యాగ్ చేసి ఈ ట్వీట్ వేయడం లేదు.. అలా చేస్తే ఏదో హైప్ చేసేందుకు వేసినట్టు అవుతుంది.. ఆమెలో ఏదో తెలియని శక్తి ఉంది.. అదే ఆమెను ఇంతలా వెలిగేలా చేస్తోంది.. ఆమె నటన, ఆమె యాటిట్యూడ్ ఇలా అన్నీ కూడా ఆమెతో పని చేసే దర్శకులకు ఓ వరం అంటూ రాహుల్ రవీంద్రన్ ట్వీట్ వేశాడు.



# డ్రింకర్ సాయి ప్రేమకథ

వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ప్రేమకథాచిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' అనేది ఉపశీర్షిక. ధర్మ, ఐశ్వర్యశర్మ జంటగా నటిస్తున్నారు. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మాతలు. ఈ నెల 27న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ కార్యక్రమం సోమవారం హైదరాబాద్‌లో జరిగింది. హీరోహీరోయిన్లు ధర్మ, ఐశ్వర్య తమ పాత్రలకు ప్రాణం పోశారని, యువతరం ప్రేక్షకులను థియేటర్లకు రప్పించేందుకే కొంత యూత్‌ఫుల్ కంటెంట్‌ని ఈ కథలో పెట్టాల్సొచ్చిందని, నిజానికి ఇది అన్ని వర్గాలు మెచ్చే కథ అని, సాంకేతికంగా అన్ని విధాలా సినిమా ఆకట్టుకుంటుందని దర్శకుడు చెప్పారు. సినిమాలో నటించడం పట్ల హీరోహీరోయిన్లు ధర్మ, ఐశ్వర్య శర్మ ఆనందం వెలిబుచ్చారు. నరేట్ చేసిన దానికంటే అద్భుతంగా సినిమాను దర్శకుడు కిరణ్ తీశాడని, పనిచేసిన అందరికీ మంచి పేరు తెచ్చే సినిమా అవుతుందని నిర్మాతలు నమ్మకం వెలిబుచ్చారు. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్.ఎస్.కాంచి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రశాంత్ అంకిరెడ్డి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com

# రోహిత్, కోహ్లీ వన్డే సిరీస్ ఆడతారా?

స్పోర్ట్స్

## ఫిట్‌నెస్‌పై కొనసాగుతున్న సస్పెన్స్



అఫ్ఘానిస్థాన్‌తో జూన్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 వన్డేల సిరీస్‌లో భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా లేదా అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. గాయాల కారణంగా వీరిద్దరూ దూరమవుతున్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే స్పందించారు. ఫిట్‌నెస్ ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయని, వైద్య బృందం నివేదిక ఆధారంగా త్వరలోనే అధికారిక నిర్ణయం ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ .. ప్రస్తుతం టెస్ట్, టీ20లకు గుడ్‌బై చెప్పి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌లో ఆడటమే లక్ష్యంగా వీరిద్దరూ అడుగులు వేస్తున్నారు. ఇక స్వదేశంలో జూన్ 13 నుంచి అఫ్ఘానిస్థాన్‌తో భారత్ వన్డే సిరీస్‌లో ఆడనుంది. మొత్తంగా మూడు వన్డే మ్యాచ్‌లు ఈ సిరీస్‌లో జరుగుతాయి. ఇందుకోసం ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ రోహిత్, కోహ్లీలు ఈ సిరీస్‌లో ఆడేది అనుమానంగా మారింది. ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. శుభమన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు ఈ సిరీస్‌లో తలపడనుంది. అయితే గాయాల కారణంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. వన్డే సిరీస్‌కు దూరమవుతారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై రకరకాల వార్తలు వస్తున్నాయి. రోహిత్ దూరమయ్యాడని.. కోహ్లీ ఆడతాడా లేడా అనేది తేలాల్సి ఉందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే ఈ విషయంపై అప్‌డేట్ ఇచ్చాడు. "బయట ఎలాంటి చర్చ జరిగినా అనవసరం. అధికారికంగా మేం త్వరలోనే సమాచారం ఇస్తాం. విరాట్ కోహ్లీ లేదా రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్లు సిరీస్‌లో ఆడకపోవడం బిగ్ న్యూస్ అవుతుందని తెలుసు. ఫిట్‌నెస్‌కు సంబంధించి ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయి. సిరీస్ ప్రారంభానికి ఇంకొంత సమయం ఉంది. ఆలోగా మేం నిర్ణయం తీసుకుంటాం. ఫిట్‌గా ఉంటే తుది జట్టులో ఉంటారు. లేకపోతే అందుకు తగినట్టుగా మార్పులు చేసుకుంటాం. వైద్య బృందం నిర్ణయం తర్వాత.. ఆయా ఆటగాళ్ల పరిస్థితిపై అధికారికంగా స్పందిస్తాం" అని టెన్ డస్కటే చెప్పాడు.

వన్డే సిరీస్ కోసం భారత జట్టు.. శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబె.


## రిటైర్మెంట్ ప్రకటించిన కోన శ్రీకర్ భరత్

భారత వికెట్ కీపర్, తెలుగు తేజం కోన శ్రీకర్ భరత్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ విషయాన్ని ఇన్‌స్టాగ్రామ్ వేదికగా గురువారం వెల్లడించాడు. గర్వంతో, కృతజజతా భావంతో ఆటకు వీడ్కోలు పలుకుతున్నట్లు తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. దేశం కోసం ఆడటం తన జీవితంలో లభించిన గొప్ప గౌరవమని తెలిపాడు. 'ఎంతో గర్వంతో, కృతజ్ఞతాభావంతో నేను అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నాను. దేశం తరఫున ఆడటం జీవితంలో నాకు లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. నా ఈ ప్రయాణంలో ఎంతో పట్టుదల, బలం అవసరమయ్యాయి. కానీ టెస్ట్ క్రికెట్‌లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం రావడం నాకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నా. నా కెరీర్‌కు అండగా నిలిచిన బీసీసీఐ, కోచ్‌లు, మేనేజర్లందరికీ నా ధన్యవాదాలు. అత్యున్నత స్థాయిలో ఆడటానికి గొప్ప వాతావరణాన్ని సృష్టించి, నాకు నిరంతరం మద్దతుగా నిలిచినందుకు మీ అందరికీ స్పెషల్ థ్యాంక్స్. నా సహచర ఆటగాళ్లందరికీ బిగ్ థ్యాంక్స్. మనమందరం కలిసి పంచుకున్న క్షణాలు, సాధించిన విజయాలు నా కెరీర్‌లో ఎంతో సహాయపడ్డాయి. మీరందరూ లేకపోతే నా కలను నిజం చేసుకోవడం, ఇన్నేళ్లపాటు ఈ ఆటను ఆడటం నాకు సాధ్యమయ్యేది కాదు. నా ప్రతిభను నిరూపించుకోవడానికి, గుర్తింపు తెచ్చుకోవడానికి నాకు అవకాశం కల్పించిన నా ఐపీఎల్ అరంగేట్ర కెప్టెన్ విరాట్ కోహ్లీ, టెస్ట్ కెప్టెన్ రోహిత్ శర్మ, నా టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ సార్‌కి ధన్యవాదాలు. భారత్-ఏ జట్టు నుంచి టీమిండియా వరకు ఆయన అందించిన గైడెన్స్ ఎప్పటికీ మరవలేనిది. మీ మద్దతుతోనే నేను భారత టెస్ట్ క్రికెటర్‌ను కాగలిగాను. యువ ఆటగాళ్లకు నా సలహా ఏంటంటే.. పెద్ద కలలు కనండి. వాటిని సాధించడానికి నిరంతరం కష్టపడండి. పట్టుదల, క్రమశిక్షణ, కష్టపడే తత్వం, దృఢ సంకల్పం ఉంటే కలలు ఖచ్చితంగా సాకరమవుతాయి. బీసీసీఐ, టెస్ట్ క్రికెట్‌తో నా ప్రయాణం ముగిసి ఉండవచ్చు. కానీ ఈ ఆటతో నా ప్రయాణం కొనసాగుతూనే ఉంటుంది. రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున రాణించాలని కలలు కనే తదుపరి తరానికి మార్గదర్శకత్వం. మెంటారింగ్, కోచింగ్ ఇవ్వడం ద్వారా నా వంతుగా క్రికెట్‌కు సేవ చేస్తూనే ఉంటాను.'అని కేఎస్ భరత్ తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌కు చెందిన 32 ఏళ్ల భరత్ తన కెరీర్‌లో 7 టెస్టులు, 10 ఐపీఎల్ మ్యాచులు ఆడాడు. ఐపీఎల్ 2024 ఛాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. రంజీ ట్రోఫీ చరిత్రలోనే వికెట్ కీపర్-బ్యాటర్‌గా ట్రిపుల్ సెంచరీ (308 పరుగులు) చేసిన తొలి ఆటగాడిగా రికార్డ్ సాధించాడు. 2014-15 సీజన్‌లో గోవాపై ఈ రికార్డు స్కోరు నమోదు చేశాడు. ఐపీఎల్ 2021 సీజన్‌లో ఆర్‌సీబీ తరఫున ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్‌లో ఆఖరి బంతికి సిక్స్ కొట్టి మ్యాచ్ గెలిపించడం అతని కెరీర్‌కే హైలైట్. 113 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన కేఎస్ భరత్.. 6102 పరుగులు చేశాడు. ఇందులో 11 సెంచరీలతో పాటు 34 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. వికెట్ కీపర్‌గా 380 క్యాచ్‌లు అందుకోవడంతో పాటు 42 స్టంపౌట్స్ చేశాడు.



## వైభవ్‌పై మనసుపారేసుకున్న రిద్ధిమా పాఠక్

ఐపీఎల్ సమరంలో వీరోచితమైన ఆట తీరు ప్రదర్శించి వరల్డ్ వైడ్‌గా ఫేమస్ అయిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన నిర్భయమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. వైభవ్ సాధించిన విజయాలు దేశీయంగా, అంతర్జాతీయంగా అన్నిచోట్లా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇటీవల, 2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా వైభవ్ నిలిచాడు.రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ 16 మ్యాచ్‌లలో ఐదు అర్ధశతకాలు, ఒక శతకంతో సహా 776 పరుగులు సాధించాడు. స్పోర్ట్స్ యాంకర్ రిద్ధిమా పాఠక్ వైభవ్ అద్భుత ప్రదర్శనను ప్రశంసిస్తూ, అతడిని బీహార్ అతిపెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని అభివర్ణించారు. దీనికి సంబంధిన వీడియోని కూడా ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అవుతోంది.వైభవ్ సూర్యవంశీ బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా తాజ్‌పూర్ గ్రామానికి చెందినవాడు. అతను బీహార్ తరఫున దేశీయ క్రికెట్ ఆడతాడు. అయితే ఈసారి ఐపీఎల్‌లో తన విజృంభణ చూపించడంతో పిల్లాడు కాస్తా క్రికెట్ పిడుగు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. క్రికెట్ లెడెండ్స్, సెలబ్రిటీలు సైతం ఈ కుర్రాడి ఆటతీరు, రికార్డులు బద్దలు కొట్టడంపై స్పందించారు. బీహార్‌కు అంతర్జాతీయంగా కీర్తిని తెచ్చిపెట్టిన వైభవ్ గురించి తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో రిద్ధిమా పాఠక్ ఇంట్రెస్టింగ్ కామెంట్ చేశారు. చిన్నప్పుడు స్కూల్లోనూ, కాలేజీలోనూ 'మీరు ఎక్కడి నుండి వచ్చారు?' అని మమ్మల్ని అడిగినప్పుడు, మేము బీహార్ వాసులమని చెప్పడానికి సంకోచించేవాళ్ళమని కాని ఇప్పుడు గర్వంగా ఉందని చెప్పుకొచ్చింది. ఎందుకంటే లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్‌కు అలాంటి ఇమేజ్ ఏదీ ఇవ్వలేదు. కానీ ఆ తర్వాత రెండు అద్భుతమైన విషయాలు జరిగాయి. మొదటిది మహేంద్ర సింగ్ ధోని, రెండవది, 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' సినిమా. ఈ రెండూ బీహారీలలో కొంత ఉత్సాహాన్ని నింపాయి.కానీ దీని వల్ల వచ్చిన మంచి ప్రచారం మొత్తం బీహార్ నుండి విడిపోయి కొత్త రాష్ట్రంగా ఏర్పడిన జార్ఖండ్‌కు చేరిందని పాఠక్ తెలిపారు. అయితే ఇప్పుడు ముందుకు వచ్చిన వ్యక్తి వైభవ్ సూర్యవంశీ. అతను పూర్తిస్థాయి బీహారీ. ఇప్పుడు తాను బీహారీ అని చెప్పుకోవడానికి ఏ బీహారీ కూడా సిగ్గుపడటం లేదని గర్వపడుతున్నామని చెప్పుకొచ్చింది. ఆమె మాటల్లో ఆనందం, ముఖంలో గర్వం చూస్తుంటే వైభవ్ సూర్యవంశీని విపరీతంగా అభిమానిస్తున్నట్లుగా కనిపిస్తోంది. స్పోర్ట్స్ యాంకర్ రిధిమా పాఠక్ ఎవరు..?రిధిమా పాఠక్ స్వస్థలం జార్ఖండ్. ఆమె తండ్రి పేరు సురేష్ కుమార్ పాఠక్, ఆయన సైన్యంలో పనిచేశారు. రిధిమా ఒక సుప్రసిద్ధ స్పోర్ట్స్ యాంకర్ , ప్రజెంటర్. ఆమె అనేక ఐసీసీ ఈవెంట్లలో యాంకరింగ్ చేస్తూ కనిపించారు.ఆమె విద్య విషయానికి వస్తే రిధిమా రాంచీలో ప్రాథమిక విద్యను పూర్తి చేసి, ఆ తర్వాత పూణే నుండి ఎలక్ట్రానిక్స్ , టెలికమ్యూనికేషన్స్‌లో ఇంజనీరింగ్ డిగ్రీని పొందారు. అయితే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే రిధిమా పాఠక్ సెలబ్రిటీలతో జరిపిన ఇంటర్వ్యూలు, ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.స్పోర్ట్స్ యాంకర్ కాకముందు ఆమె ఒక కార్పొరేట్ ఉద్యోగంలో చేశారు. కానీ క్రీడలపై ఆమెకున్న అభిరుచి ఆమెను మీడియా పరిశ్రమలోకి నడిపించింది. ఆమె తన కెరీర్‌ను రేడియో జాకీ , వాయిస్-ఓవర్ ఆర్టిస్ట్‌గా ప్రారంభించి ఆ తర్వాత టీవీలో స్పోర్ట్స్ యాంకర్‌గా పేరు పొందారు. ధిమా పాఠక్ బీహారిలకు ఇప్పుడు వైభవ్ సూర్యవంశీ రోల్ మోడల్ అంటూ చెప్పడంతో నెట్టింట్లో కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. ఈ పిల్లాడిపై యాంకరమ్మ మనసు పారేసుకుంది ఏంటని కామెంట్స్ చేస్తున్నారు.




## హర్మన్‌ప్రీత్ ఖాతాలో మరో వరల్డ్ రికార్డు

క్రికెట్ అంటేనే ఇండియా పేరు మార్మోగిపోతోంది. అది ఏ ఫార్మెట్ కాని.. రికార్డులు తిరగరాస్తున్నారు. భారత మెన్ క్రికెట్ జట్టుతో సమానంగా విమెన్ క్రికెట్ జట్టు కూడా పటిష్టంగానే ఉంది. ఇక భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రపంచ రికార్డు సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రీడాకారిణిగా హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త చరిత్ర లిఖించారు. ఇప్పటి వరకు న్యూజిలాండ్ క్రీడాకారిణి సుజీ బేట్స్ (367 మ్యాచ్‌లు) ఆడి టాప్ ప్లేసులో ఉండగా.. ఇంగ్లండ్‌లోని టాంటన్‌లో మంగళవారం జరిగిన మూడో టీ20 మ్యాచ్ తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్ కెరీర్‌లో 368వ అంతర్జాతీయ మ్యాచ్ పూర్తి చేసుకుంది. దీంతో న్యూజిలాండ్ ప్లేయర్ పేరుతో ఉన్న రికార్డును అధిగమించారు. ఈ జాబితాలో సుజీ బేట్స్ రెండో స్థానంలో ఉండగా ఆస్ట్రేలియాకు చెందిన ఎల్లీస్ పెర్రీ (357 మ్యాచ్‌లు) మూడో స్థానంలో కొనసాగుతున్నారు. 2009లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ పంజాబ్‌కు చెందిన ఆల్‌రౌండర్. ప్రస్తుతం విమెన్ టీమిండియా జట్టు సారథిగా ఉంది. ఇప్పటివరకు 7 టెస్టులు, 164 వన్డేలు, 197 టీ20 మ్యాచ్‌లు ఆడారు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 1-2 తేడాతో కోల్పోయినప్పటికీ నిర్ణయాత్మకమైన ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ హాఫ్ సెంచరీతో రాణించడం విశేషం. 2025లో భారత జట్టుకు తొలిసారిగా మహిళల ప్రపంచకప్ అందించిన కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకుంది. అంతే కాదు విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్‌కు పలు టైటిళ్లు సాధించిపెట్టిన భారత మహిళల క్రికెట్ సారథిగా ఆమెకు మంచి గుర్తింపు ఉంది. ఇక ఆట పరంగా చూసుకుంటే కూడా కౌర్ బ్యాటింగ్, బౌలింగ్ తో పాటు కెప్టెన్సీని కూడా సమర్ధవంతంగా పోషిస్తూ ఆల్‌రౌండర్ ప్రతిభను చాటుకుంటోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన ఘనత సాధించడంపై సహచర క్రీడాకారులు, జట్టు ప్రధాన కోచ్ అభినందనలు తెలిపారు. మహిళల క్రికెట్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌ల సంఖ్య పెరుగుతున్న ఈ రోజుల్లో ఆమె స్థిరత్వం, అంకితభావానికి ఈ రికార్డు నిదర్శనమని క్రీడా వర్గాలు ప్రశంసిస్తున్నాయి.

## స్వగ్రామం చేరుకున్న వైభవ్..

ఐపీఎల్ 2026లో సంచలనం సృష్టించిన తర్వాత, వైభవ్ సూర్యవంశీ బీహార్‌లోని తన స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈ వార్త తెలియగానే 15 ఏళ్ల ఈ సూపర్‌స్టార్‌ను కలవడానికి జనం గుంపులు గుంపులుగా తరలివచ్చారు. సమస్తిపూర్‌లోని వైభవ్ స్వగ్రామమైన తాజ్‌పూర్‌లో అతనికి ఘన స్వాగతం లభించింది.ఇప్పుడు వైభవ్‌ను కలవడానికి, సెల్ఫీలు తీసుకోవడానికి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. ఇప్పటికే అతని ఇంటి బయట జనం గుమిగూడటం మొదలైంది. వైభవ్ కుటుంబ సభ్యులతో పాటు బంధువులతో అతని ఇల్లు సందడిగా మారితే.. ఇంటి ముందు అభిమానులు, స్థానికులతో కోలాహలంగా మారింది.చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల నుండి ప్రజలు వైభవ్‌ను కలవడానికి వస్తున్నారు. కానీ అందరూ అతనికి దగ్గర కాలేకపోతున్నారు. వైభవ్ కేవలం కొద్దిమందిని మాత్రమే కలుస్తున్నాడు. అతని ఇంటి బయట చిన్న యూట్యూబర్లు, స్థానిక మీడియా ప్రతినిధులు గుంపుగా కనిపిస్తున్నారు. గత ఒకటి రెండు రోజులుగా సూర్యవంశీ కుటుంబం కూడా మీడియాకు దూరంగా ఉంటోంది. ఐపీఎల్‌లో సంచలనం సృష్టించిన తర్వాత వైభవ్ సూర్యవంశీ తాను ఈ టోర్నీలో గెలుచుకున్న పథకాలు, షీల్డులతో స్వగ్రామమైన సమస్తిపూర్‌లోని తన స్వగ్రామమైన తాజ్‌పూర్‌కి తిరిగి వచ్చాడు.స్థానిక క్రికెటర్లు, జిల్లా స్థాయి క్రికెటర్లు కూడా అతన్ని కలిసేందుకు క్యూ కట్టారు.తల్లిదండ్రుల కృషి ఫలితమే వైభవ్వైభవ్ విజయంలో అతని తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారు. వైభవ్ కేవలం నాలుగేళ్ల వయసులోనే తన తండ్రి సంజు పర్యవేక్షణలో క్రికెట్ శిక్షణ ప్రారంభించాడు. అతని తండ్రి ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటల బస్సులో వైభవ్‌ను శిక్షణ కోసం పాట్నాకు తీసుకువెళ్లేవారు, అదే సమయంలో అతని తల్లి ఆర్తి సూర్యవంశీ తెల్లవారుజామున 2 గంటలకే నిద్రలేచి అతనికి మధ్యాహ్న భోజనం సిద్ధం చేసేవారు.ఈ యంగ్ ప్లేయర్ ఇంత పిన్నవయసులోనే ప్రపంచ రికార్డులు నెలకొల్పే క్రికెటర్ కావడం వెనుక క్రమశిక్షణ, కఠోర శ్రమ ఉందనే చెప్పాలి. వైభవ్ చాలా చిన్న వయస్సు నుండే తన వయసుకు రెట్టింపు వయసున్న ఆటగాళ్ల వేగవంతమైన బంతులను నిర్భయంగా ఎదుర్కొని భారీ సిక్సర్లు కొట్టాడు. వైభవ్ సూర్యవంశీ అన్నదమ్ములు ముగ్గురు. ముగ్గురు సోదరులలో వైభవ్ మధ్యవాడు. ఐపీఎల్ 2026లో 776 పరుగులు..ఐపీఎల్ 2025 వేలంలో రాజస్థాన్ రాయల్స్ వైభవ్ సూర్యవంశీని రూ.1 కోటి 10 లక్షలకు కొనుగోలు చేసినప్పుడు అతని వయస్సు కేవలం 14 సంవత్సరాలు.

# వైభవ్ సూర్యవంశీకి టీమిండియా పిలుపు?



ఐపీఎల్ వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకురావాలనే వాదన చాలా బలంగా వినిపిస్తోంది. లెజెండ్రీ క్రికెటర్ల దగ్గర నుంచి సామాన్య అభిమాని వరకూ వైభవ్ టీమిండియాలోకి రావాలనే కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ కూడా అటువైపు అడుగులు వేస్తోంది. సూర్యవంశీకి జాతీయ జట్టులో చోటు కల్పించాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ కూడా తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా సూర్యకుమార్ యాదవ్ స్థానంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్‌ను ఆడించాలని చూస్తోంది. టీమిండియా టీ20 వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ శకం ఇక దాదాపు ముగిసినట్టే. ఇప్పటికే సూర్యకుమార్ యాదవ్‌ను టీమిండియా టీ20 కెప్టెన్‌గా తొలగిస్తున్నారనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఆ ప్లేస్‌లో సర్పంచ్ సాబ్ శ్రేయాస్ అయ్యర్‌ను నూతన కెప్టెన్‌గా నియమిస్తున్నారని కూడా తెలుస్తోంది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2024, 2026లో వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్.. ఇప్పుడు మూడోసారి టైటిల్ గెలిచి రికార్డు సృష్టించాలని ఉంది. దాంతో టీ20 వరల్డ్‌కప్ 2028 టార్గెట్‌గా బీసీసీఐ అడుగులు వేస్తోంది. ఆ క్రమంలోనే సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించనున్న బీసీసీఐ.. యువ ఆటగాళ్లు, అనుభవం ఉన్న ప్లేయర్లతో జట్టును సిద్ధం చేయాలని ఫిక్స్ అయినట్టుంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీతో పాటు రెండుసార్లు ఆర్సీబీని ఛాంపియన్‌గా నిలిపిన రజత్ పటిదార్‌ను టీ20 జట్టులోకి తీసుకురావాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే జాతీయ జట్టులో చోటు కల్పించడం సరైనదేనా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ.. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ మాత్రం సూర్యవంశీకి టీమిండియా క్యాప్ అందించాలని చాలా సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను పూర్తిగా తొలగిస్తే అతని స్థానంలో నెంబర్ 4లో రజత్ పటిదార్‌ను ఆడిస్తే బాగుంటుందేమో అని బీసీసీఐ పరిశీలిస్తోంది. పటిదార్ కెప్టెన్సీలో ఆర్సీబీ వరుసగా రెండు ఐపీఎల్ టైటిల్స్ గెలవడమే కాకుండా.. కెప్టెన్ ధోనీ, రోహిత్ శర్మ సరసన కూడా నిలిచాడు. దాంతో పాటు ఐపీఎల్ 2026లో కెప్టెన్‌గా సక్సెస్ కావడమే కాకుండా 192.69 స్ట్రయిక్ రేట్‌తో 501 పరుగులు కూడా చేసి సత్తా చాటాడు. టీమిండియాలోకి వైభవ్‌ను వీలైనంత త్వరగా తెచ్చేందుకు బీసీసీఐ చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే సూర్యవంశీని ఈ నెలలో శ్రీలంకలో జరగనున్న ఇండియా - ఏ, అఫ్ఘనిస్థాన్ - ఏ, శ్రీలంక - ఏ మధ్య జరగనున్న ట్రై సిరీస్‌కు కూడా స్క్వాడ్‌లో సెలెక్ట్ చేశారు. ఈ సిరీస్‌లో వైభవ్ తన సత్తా చాటితే రానున్న కాలంలో టీమిండియాలో అడుగుపెట్టడం ఖాయమనే చెప్పొచ్చు.